సంపుటి : 78 సంచిక : 15 పుటలు : 52

జాగృతి

కలి 5127 - శ్రీ విశ్వావసు మాఘ శుద్ధ అష్టమి
26 జనవరి - 01ఫిబ్రవరి 2026
వెల : ₹20/-



వెండి బంగారమాయెనె..!

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

సిక్కిం సుందరి

హిమాలయాలలో జీవ వైవిధ్యం అసాధారణమైనది. ఈ ఫోటోలో కనిపిసున్న పొడవాటి మొక్క హిమసానువులలో అత్యంత అరుదుగా కనిపిస్తుంది. సిక్కిం సుందరి అంటూ ముద్దుగా పిలుచుకుంటారు. శాస్త్రీయ నామం రియుమ్ నొబైల్. గ్లాస్ హౌస్ ప్లాంట్ అని అంటారు. స్థానికంగా చుకా అని కూడా పిలుచుకుంటారు. నేపాలీలు పదాంచల్ అంటారు. పగోడా పువ్వు అని కూడా పేరు ఉంది. నల్లగా ఉండే దీని కాండంతో పచ్చడి, జామ్ తయారుచేసుకుంటారు. అలాగే ఎన్నో ఔషధీయ గుణాలు కూడా ఇది కలిగి ఉంటుంది. నొప్పుల నుంచి ఉపశమనం, వాపు తగ్గడానికి, జీర్ణవ్యవస్థ మెరుగుపడడానికి ఉపయోగపడుతుంది. దీని ఆకులు కాంతిమంతంగా ఉంటాయి. చూడడానికి పూరేకుల పలె నాజూకుగా ఉన్నా, ఇవే ఆ మొక్కను 4000 నుంచి 4800 ఎత్తున కూడా తీవ్ర గాలుల నుంచి, ఎండ వేడిమి నుంచి కూడా రక్షిస్తూ ఉంటాయి. ఆ ఎత్తులో మాత్రమే అది మొలుస్తుంది. ఆ ఆకులు పారదర్శకంగా ఉండి కాండానికి తగినంత వేడిని కూడా సమకూరుస్తాయి. ఇది ఒకటి నుంచి రెండు మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. అంత ఎత్తుకు ఎదిగి, తరువాత చనిపోతుంది. సిక్కిం, భూటాన్, నేపాల్, టిబెట్, మైన్మార్‌లలో ఇది కనిపిస్తూ ఉంటుంది. ఇది ఒకసారి ఇలా మొలిచి, తరువాత ఎదిగి, విత్తనాలు ఇచ్చి మరణిస్తూ ఉంటుంది. చిన్న గులాబీ మొగ్గలాగే ఇది మొలుస్తుంది. చాలా నెమ్మదిగా 1-2 మీటర్లకు అంటే దాదాపు ఆరు అడుగుల వరకు ఎదుగుతుంది. ఎంత నెమ్మదిగా అంటే ఆ గులాబీ మొగ్గ ఇంతగా ఎదగడానికి దశాబ్దాలు (ఏడేళ్ల నుంచి 30 ఏళ్ల వరకు) పడుతుంది. చూడడానికి స్తంభంలా ఉంటుంది. కింద లేత గులాబీ, పసుపు రంగులలో ఉన్నా, శిఖరం మాత్రం గులాబీ రంగులో ఉంటుంది. కొన్ని పసుపు రంగులోను కనిపిస్తాయి. ఈ హిమాలయ అద్భుతం గురించి మొదట జోసెఫ్ హుకర్ (ఇంగ్లిష్ వృక్షశాస్త్రవేత్త), థామస్ థామ్సన్ (బ్రిటిష్ శస్త్రవైద్య నిపుణుడు) 1855లో లోకానికి వెల్లడించారు.

పతంగులతో ప్రపంచ నేతలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ జనవరి 12న అహ్మదాబాద్‌లోని సబర్మతి నదీ తీరాన అంతర్జాతీయ గాలిపటాల వేడుకను ప్రారంభించారు. మకర సంక్రాంతి సందర్భంగా గుజరాత్ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఈ కార్యక్రమం జరిగింది.

ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ హాజరయ్యారు. ఇది ఆయన మొదటి అధికారిక భారత పర్యటన. ఉదయం మొదటగా ఇద్దరూ సబర్మతి ఆశ్రమానికి వెళ్లి మహాత్మాగాంధీ ప్రతిమకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. గాంధీజీ జీవితం, వారసత్వంపై ప్రదర్శనను వీక్షించారు. ప్రపంచానికి గాంధీజీ బోధనలు ఇప్పుడు మరింత అవసరమని ఛాన్సలర్ మెర్జ్ అన్నారు.

ఆ తర్వాత సబర్మతి నదీతీరానికి వచ్చి అంతర్జాతీయ గాలిపటాల వేడుకను ప్రారంభించారు. నేతలిద్దరికీ నిర్వాహకులు గుజరాతీ సంప్రదాయ శాలువాలు అందించి స్వాగతించారు. కళాకారులు బేడా రాస్, కూచిపూడి, భరతనాట్యం, మల్లఖంబ్ వంటి నృత్యాలు, సంగీత ప్రదర్శనలు ఇచ్చారు. జర్మన్ సంగీతాన్ని సితార్, ఫ్లూట్, తబలా వంటి భారతీయ వాయిద్యాలతో మిళితం చేసి ప్రదర్శించారు.

యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రాంతంగా వాసికెక్కిన అహ్మదాబాద్ కోట గోడల నగరంలోని సాంప్రదాయిక హవేలీల నమూనాలను ప్రదర్శించే ఒక పెద్ద నమూనాను ఏర్పాటు చేశారు. ఇందులో ఇరుకైన గల్లీలు, ఓట్లా (బయటి కూర్చునే ఏర్పాటు), చాబుతరో (పక్షులకు ఆహారం పెట్టే చోటు) వంటివి ఉన్నాయి. గాలిపటాల మ్యూజియం, ఫోటో వాల్ కూడా ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన గాలిపటాలు, వాటి తయారీ పద్ధతులు, వస్తువులను గురించి ఇద్దరు నేతలకు నిర్వాహకులు వివరించారు.వారు మహిళా కళాకారులతో మాట్లాడి గాలిపటాల తయారీ ప్రక్రియను అవగతం చేసుకున్నారు. ఇద్దరు నాయకులు ఓపెన్ వాహనంలో ప్రదర్శన ప్రదేశంలో తిరిగారు. భారత త్రివర్ణ పతాకం, భారత్ – వసుధైవ కుటుంబకం అనే సందేశం, హనుమాన్ చిత్రం ఉన్న గాలిపటాలను ఎగురవేశారు. ఇది ఇండియా–జర్మనీ మధ్య బలమైన సంబంధాలను సూచిస్తుంది. ఈ వేడుకను పెద్ద సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా వీక్షించారు.

ఈ ఏడాది అంతర్జాతీయ గాలిపటాల వేడుకలో 50 దేశాల నుంచి 135 అంతర్జాతీయ కైటిస్టులు, 13 భారత రాష్ట్రాల నుంచి 65 మంది, గుజరాత్ నుంచి 870 మందికి పైగా స్థానికులు పాల్గొన్నారు. వివిధ రకాల వర్ణాలు, డిజైన్లతో కూడిన గాలిపటాలను ఎగురవేశారు.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 **సంవత్సర చందా రూ.850**

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

దేశానికే ప్రథమ ప్రాథమ్యం అన్న సిద్ధాంతంతో ఆవిర్భవించిన రాజకీయ పక్షం భారతీయ జనతా పార్టీ. ఆ సిద్ధాంతం విషయంలో బీజేపీ నిబద్ధత తిరుగులేనిది. వచ్చే ఎన్నికలలో గెలుపు అన్న హ్రస్వదృష్టి ఆ పార్టీని నడిపించడం లేదు. గెలిచిన తరువాత రాబోయే ఎన్నికలలో మళ్లీ గెలవాలన్న ఏక సూత్ర ప్రణాళికతో ప్రభుత్వాలను నిర్వహించడం లేదు. శతాబ్దాల పాటు సాగిన దురాక్రమణదారుల, వలసవాదుల పాలన మిగిల్చిన అంధకారాన్ని; విదేశీ భావజాలాలు, రాజకీయ సిద్ధాంతాలు తెచ్చిన వికారాలను నిర్మూలించడమే ధ్యేయంగా పని చేస్తున్న ఏకైక భారత రాజకీయ పక్షం. రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందన్న వాస్తవాన్ని విస్మరించకుండానే, వలసవాద బుద్ధిని వదలించడానికి ఉద్యమిస్తున్న పార్టీ బీజేపీ మాత్రమే. సాంస్కృతిక జాతీయవాదం వంటి సమున్నత ఆశయంతో 1980లో ఉద్భవించిన ఆ పార్టీ ఎప్పుడు కొత్త సారథిని ఎన్నుకున్నా ఈ అంశాలన్నీ అప్రయత్నంగానే కీలకంగా ఉంటున్నాయి. జనవరి 20, 2026న కొత్త సారథిగా ప్రమాణం చేసిన నితిన్ నబీన్ సిన్హా ఎంపిక వెనుక కూడా ఇవే వాస్తవాలు సుస్పష్టం.

బీజేపీ 12వ జాతీయ అధ్యక్షుడు నబీన్ బిహార్ నుంచి వచ్చారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న కుటుంబం వారిది. సంఘ శతాబ్ది వేడుకల వేళ ఆ అత్యున్నత పదవిని చేపట్టడం నిశ్చయంగా నబీన్‌కు ఆనందం కలిగించే విషయమే. ఐదుసార్లు వరసగా ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉంది. వయసు 45 ఏళ్లు. ఇప్పుడు ఇదే అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. ప్రధాన ప్రతిపక్షం అధ్యక్షుడి వయసును గమనిస్తే 45 ఏళ్ల వ్యక్తి అధికార, జాతీయ పార్టీకి నేత కావడం నిబిడాశ్చర్యం కలిగించేదే. ప్రధాన ప్రతిపక్షానికి నాయకత్వం వహిస్తున్నవారి వయసు 84 ఏళ్లు. సరిగ్గా బీజేపీ ఆవిర్భవించిన 1980లోనే నబీన్ జన్మించారు. ఇప్పుడు పార్టీ అధ్యక్ష పదవిని అలంకరించారు. ఇది పార్టీ దూరదృష్టికి నిదర్శనం. ఇక్కడ తరం మార్పు, మారిన తరానికి సారథ్యం బదలీ అన్న అంశాలను జాతిజనులు గమనిస్తున్నారు. నిజమే, మఖలో పుట్టి పుబ్బలో పుటుక్కుమనే పార్టీలకు కూడా ఒకే కుటుంబం నుంచి వచ్చిన వారే, సాధారణంగా ఒక్కరే చిరకాలం పాటు అధ్యక్ష స్థానాన్ని భర్తీ చేస్తూ,

శాలివాహన 1947 శ్రీ విశ్వావసు మాఘ శుద్ధ అష్టమి

లోపలి పేజీలలో...



6లో

ముఖపత్ర కథనం

వెండి బంగారమాయెనే!

జాగృతి పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు శ్రేయోభిలాషులకు గణతంత్ర దిన శుభాకాంక్షలు

- అసోసియేట్ ఎడిటర్

ధారావాహిక నవల

20 గణపతిదేవుడు

- మత్తి భానుమూర్తి

20లో

ప్రత్యేక వ్యాసం

మేడారం... భక్తకోటి హృదయాలయం

26లో

జాగృతి

సంపాదకీయం

బరువును పెంచుతూ ఉంటారు. కమ్యూనిస్టు పార్టీలైతే బాగా తలనెరిసిన, నోరు ఖాళీ అయిన వారికి ప్రాధాన్యం ఇస్తాయి. ప్రపంచంలోనే ఏకైక పెద్ద పార్టీ బీజేపీకి, వారి సొంత రాష్ట్రంలో తప్ప పెద్దగా పేరు ప్రఖ్యాతులు లేని యువనేతకు పగ్గాలు అప్పగించడం అపురూపం. ఇది పార్టీని సజీవంగా ఉంచాలన్న వాస్తవిక దృక్పథానికి తిరుగులేని నిదర్శనం.

డిసెంబర్ 14, 2025న తాత్కాలిక అధ్యక్షునిగా మొదట నియమితులైన నబీన్, పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించిన సందర్భం క్లిష్టమైనది. కొన్ని నెలలలోనే ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగబోతున్నాయి. వాటిలో ఒకటి–దేశాన్ని

బీజేపీ కొత్త సారథి నబీన్

మరొకసారి మత ప్రాతిపదికన విభజించాలని తహతహలాడుతున్న ముస్లిం మతోన్మాదులను బుజ్జగింపు రాజకీయాలతో పెంచి పోషిస్తున్న పశ్చిమ బెంగాల్. రెండవది–ద్రవిడవాదం మాటున వేర్పాటువాదాన్ని ఎగదోస్తూ, ఇందుకు హిందూధర్మం మీద విషం చిమ్మే డీఎంకే ఏలుతున్న తమిళనాడు. మూడవది–కేరళ. ఇక్కడ కమ్యూనిస్టు దీపం కొండెక్కబోతున్నా, సమాఖ్యవాదానికీ, హిందూధర్మానికీ, మానవతకూ ఎంత హాని చేయగలదో అంత హానీ చేసేసింది. కొంచెం ఆలస్యమే అయినా దీనిని కేరళీయులు గుర్తించారు. మార్పు కనిపిస్తున్నది. ఇక్కడ కాంగ్రెస్, కమ్యూనిస్టు కూటములు వేర్పాటువాదాన్ని పోటీ పడి పెంచాయి. మరొక రాష్ట్రం అస్సాం. ఈ దఫా కూడా బీజేపీ తప్ప ఏ ఇతర పార్టీ గెలిచినా, ఆ రాష్ట్రాన్ని దేశం నుంచి విడదీయడానికి కాంగ్రెస్ హయాంలో జరిగిన కుట్రలకు మళ్లీ ఊతం ఇచ్చినట్టే. ఆ కుట్రలను నిలువరించడానికి రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా శ్రమిస్తున్నది. పుదుచ్చేరి (కేంద్ర పాలితప్రాంతం) మరొకటి. ఈ నేపథ్యంలో బీజేపీ సత్తా చూపడం చారిత్రక అవసరం. భారతీయ జనతా పార్టీని విమర్శించడానికీ, భారతదేశాన్ని విమర్శించడానికీ మధ్య తేడాను మరచిన దిక్కుమాలిన ప్రతిపక్షాలు దేశంలో అఘోరిస్తున్నాయి. బీజేపీ పట్ల ప్రజాభిమానాన్ని, జాతి ప్రదర్శిస్తున్న ఆదరణను ఓటింగ్ యంత్రాల మాయాజాలంగా వక్రీకరిస్తూ, దాచి పెట్టే యత్నంలో విధ్వంసక రాజకీయాలు వీరంగం వేస్తున్నాయి. వేర్పాటు, మతోన్మాద శక్తుల విజృంభణకు సెక్యులరిజం, ఉదారవాదం కవచాలుగా మారిపోయాయి. ప్రజాస్వామ్యాన్ని అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని పెకలించే, రాజ్యాంగం మాటున రాజ్యాంగాన్ని బలహీనపరిచే నీతిమాలిన ధోరణులను బలోపేతం చేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి శషభిషలు లేకుండా హిందువుల ఐక్యతకు కొత్త అధ్యక్షుడు అగ్రాసనం ఇవ్వవలసి ఉంటుంది.

నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు మద్దతు ఇస్తూ ప్రధాని నరేంద్ర మోదీ సహా, పార్టీ పెద్దలు, ముఖ్యమంత్రులు సంతకాలు చేయగా 37 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. మాజీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా పగ్గాలు అప్పగించారు. 'ఇప్పుడు నాకు, లక్షలాది మంది నా వంటి కార్యకర్తలకు నితీన్ నాయకుడు' అని మోదీ వ్యాఖ్యానించారు. ఈ ఉత్సవానికి మోదీ, రాజ్‌నాథ్, అమిత్‌షా, గడ్కరి వంటి పెద్దలంతా హాజరై, పార్టీ పంథాను, సంస్కృతిని చాటారు. బీజేపీ చాలా పెద్ద పార్టీయే కావచ్చు. చిన్నవారే అయినా దానిని నడిపించడానికి అవసరమైన అర్హతలు నబీన్‌కు ఉన్నాయని ఆయనతో పనిచేసినవారు చెబుతున్నారు. అందులో మొదటిది, కష్టించే తత్వం. రెండవది, సమన్వయ కళ. నబీన్ నాయకత్వంలో పార్టీ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలనీ, విశ్వగురు కలను నెరవేర్చే దిశగా సాగాలనీ ఆశిద్దాం. కొత్త అధ్యక్షుడికి శుభాభినందనలు. ★

38లో

కథ

జ్ఞానయోధుడు.!!

- బి.కళాగోపాల్



మత 'మానసిక' రోగుల జిహాద్! (ఉన్మాదం)	-	11
ఆ మహా తండ్రులకు వందనాలు! (బెంగాల్ మాయాజాలం)	-	14
ప్రాయోజిత పథకాలతో పురోగమనం (ఆంధ్రప్రదేశ్)	-	16
జానపద మాధురి (మహిళ)	-	18
రాజ్యాంగంతోనూ రాజకీయాలేనా? (జాతీయం)	-	24
స్వాభిమాన సాగరం సోమనాథ్ ఆలయం (ప్రత్యేక వ్యాసం-1)	-	28
ఆర్ఎస్ఎస్‌కు, ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులకు వందనం	-	34
అనంతం.. మన వైజ్ఞానిక మేధో చరితం (గళమెత్తిన గతం)	-	35
అటకెక్కిన ఆటలు.. 'బొద్దు' బారిన బాల్యం! (క్రీడ)	-	43
'శర్వా' సంక్రాంతి హ్యాట్రిక్ 'నారీనారీ నడుమ మురారి' (సినిమా)	-	50

ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్, సౌరవిద్యుత్, విద్యుత్ వాహనాలు, రక్షణ రంగ పరికరాలు, వైద్య పరికరాల్లో వెండి వాడకం పెరిగిపోవడంతో, పారిశ్రామికంగా ఈ లోహానికి డిమాండ్ విపరీతంగా ఉంది. మొత్తం డిమాండ్‌లో 15శాతం వాటా సౌరవిద్యుత్ రంగానిదే! 2000 సంవత్సరం నుంచి పరిశీలిస్తే వెండి డిమాండ్ ఎనిమిది రెట్లు పెరిగింది. ఇందుకు ప్రధాన కారణం అప్పటివరకు దీన్నొక ఖరీదైన లోహంగా పరిగణిస్తూ వచ్చినా, తర్వాత క్రమంగా పరిశ్రమల్లో దీని వాడకం పెరగడమే! అయితే పెరుగుతున్న

డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేదు. వెండి మైనింగ్ పరిమితంగానే కొనసాగడంతో ఏటా 200-250 మిలియన్ ఔన్స్‌ల వరకు వెండి సరఫరాలో కొరత సుస్థిరంగా కొనసాగి, మార్కెట్లలో వెండి లభ్యత క్రమంగా తగ్గిపోయింది. వెండిని శుద్ధి చేయడంలో చైనాదే అగ్రస్థానం. ముడి వెండి ప్రాసెసింగ్‌లో ప్రపంచంలో చైనా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుండగా, భారత్ ఈ విషయంలో ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉండటం గమనార్హం. కానీ శుద్ధి చేసిన వెండిని పెద్దమొత్తంలో దిగుమతి చేసుకునేది మన దేశమే! జీటీఆర్ఐ నివేదిక ప్రకారం 2024లో మనదేశం దిగుమతి చేసుకున్న శుద్ధి చేసిన వెండి విలువ 6.4 బిలియన్ డాలర్లు! ఇది ప్రపంచం మొత్తంమీద దిగుమతుల్లో 1/5శాతం! ఇదే సమయంలో కేవలం 500 మిలియన్ డాలర్ల విలువైన వెండి ఉత్పత్తులను మాత్రమే ఎగుమతి చేయగలిగింది. ఎగుమతి- దిగుమతుల మధ్య కొనసాగిన ఈ విపరీత వ్యత్యాసం, భారత్ ఈ లోహం దిగుమతులపై ఎంతగా ఆధారపడుతున్నదీ వెల్లడిస్తున్నది.

దిగుమతి కష్టాలు

ఈ ఏడాది జనవరి 1 నుంచి చైనా లైసెన్స్ ఆధారంగా వెండి ఎగుమతులు కొనసాగాలన్న నిబంధనను ప్రవేశపెట్టడంతో, వెండి దిగుమతికి కష్టాలు మొదలయ్యాయి. అంటే వెండికి సంబంధించిన ప్రతి ఎగుమతికి చైనా ప్రభుత్వ అనుమతి తప్పనిసరి! ఫలితంగా అంతర్జాతీయంగా వెండి సరఫరా శృంఖలాల్లో తీవ్ర అనిశ్చితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో జీటీఆర్ఐ మనదేశానికి ఒక సలహా ఇచ్చింది. వెండిని కేవలం ఒక విలువైన లోహంగా కాకుండా, పారిశ్రామిక ఉత్పత్తి అవసరాలను తీర్చేదిగా పరిగణించాలన్నది ఆ సలహా సారాంశం. అంతేకాదు స్వచ్ఛ ఇంధనం (పర్యావరణ మిత్ర)గా ఇతర ఖనిజాలతో కలిపి దీన్ని పరిగణించాలని స్పష్టం చేసింది. ఇందుకోసం దీర్ఘకాల వ్యూహం అవసరం. ముఖ్యంగా సముద్ర మార్గం ద్వారా నిరంతరం మనదేశానికి సరఫరా అయ్యే విధంగా, దేశీయంగా వెండి రీసైక్లింగ్, శుద్ధి విధానాలను ప్రోత్సహించడం ద్వారా శుద్ధి చేసిన వెండి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలి. ఇదే సమయంలో వెండి దిగుమతి కోసం కేవలం కొన్ని హబ్‌లపై ఆధారపడకుండా, విభిన్న మార్గాలను ఎంచుకోవాలి. మారిన కాలమాన పరిస్థితుల్లో వెండి ఇంధన భద్రతకు అత్యంత కీలకంగా పరిణమించడం గుర్తించాల్సిన ప్రధానాంశం. ఇందుకు అనుగుణంగా మన దేశం ఇప్పటి వరకు అనుసరిస్తున్న వెండి విధానంలో మార్పులు, చేర్పులు చేపట్టక తప్పదు.

గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం

ప్రస్తుతం మనదేశం గ్రీన్‌ఎనర్జీకి అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా సౌరవిద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సౌర ఫలకాల్లో వెండి అవసరం. దీనికితోడు ఎలక్ట్రానిక్స్, రక్షణ రంగాన్ని మరింత ఆధునికీకరించే చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో వైరింగ్, సెన్సార్‌లలో వెండిని వినియోగిస్తారు. ఇక శిలాజ ఇంధనాల ద్వారా నడిచే

గత ఏడాది మన దేశంలోకి వెండి దిగుమతులు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా పారిశ్రామిక అవసరాల కోసం వెండికి గిరాకీ పెరగడం, దీనికి అనుగుణంగా ఈ లోహం సరఫరా లేకపోవడం, భౌగోళిక రాజకీయాల సంక్లిష్టతల నేపథ్యం వెండి దిగుమతులు పెరగడానికి ప్రధాన కారణమని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) నివేదిక పేర్కొంది. శుద్ధి చేసిన వెండిని ప్రపంచంలోనే అత్యధికంగా దిగుమతి చేసుకున్న దేశం భారత్! 2025లో మనదేశం 9.2 బిలియన్ డాలర్ల విలువైన వెండి దిగుమతి చేసుకున్నదని ఒక అంచనా. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 44శాతం అధికం. విచిత్రమేమంటే వెండి ధర విపరీతంగా పెరిగినప్పటికీ ఈ దిగుమతులు ఆగకపోవడం! ఉదాహరణకు 2025 ప్రారంభంలో మన దేశంలో కిలో వెండిధర రూ.80-85వేల మధ్య వుండగా, 2026 జనవరి నాటికి ఏకంగా రూ.2.43లకు చేరింది. అంటే కేవలం ఏడాది కాలంలో కేజీ వెండి ధర మూడురెట్లు పెరిగింది. వెనిజులాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఏర్పడిన భౌగోళిక అస్థిరత ఇందుకు కారణమని కొన్ని విశ్లేషణలు వచ్చినప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా ఈ లోహానికి అపరిమితంగా డిమాండ్ పెరగడం ఈ ధర పెరుగుదలకు ప్రధాన హేతువని చెప్పక తప్పదు.

బంగారమాయెనే..!

వాహనాల వల్ల వాయుకాలుష్యం అధికంగా ఉండటంతో, దీన్ని అరికట్టడానికి మన ప్రభుత్వం విద్యుత్ వాహనాలకు ప్రాధాన్యతనిస్తోంది. వెండికున్న అద్భుతమైన వాహక లక్షణం వల్ల ఈవీ సెన్సార్లు, వైరింగ్, అత్యధిక పనిసామర్థ్యం కలిగిన కనెక్టర్ల కోసం అవసరం. మన భారతీయ సంస్కృతిలో వెండి, బంగారాలకున్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. మతపరమైన కార్యక్రమాలు, పండుగలు పబ్బాలకు వెండి, బంగారు ఆభరణాలు, వస్తువులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. బంగారంతో పోల్చినప్పుడు తక్కువ ధరలో సులభంగా లభ్యం కావడం కూడా దీనికున్న ప్రత్యేకత! ఇది ద్రవ్యోల్బణం, కరెన్సీల హెచ్చు తగ్గుల నుంచి రక్షణగా ఉండగలదు కూడా! ప్రస్తుత ప్రపంచ రాజకీయాల నేపథ్యంలో మదుపర్ల ఆలోచనాధోరణిలో మార్పు వచ్చింది. బంగారం ధర ఆకాశాన్నంటుతున్న కారణంగా వెండిని ఒక సురక్షిత మార్గంగా భావిస్తున్నారు. అయితే వెండిని మైనింగ్‌లో నేరుగా లభ్యం కాదు. కేవలం ఉప ఉత్పత్తిగా మాత్రమే లభిస్తుండటం వల్ల దీని ఉత్పత్తిని తగిన విధంగా పెంచడం సాధ్యం కావడంలేదు. ప్రపంచం ఇప్పుడు వెండి సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొనడానికి ఇదే ప్రధాన కారణం.

డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేదు

మనదేశంలో ఏటా 5 నుంచి 7 మిలియన్ టన్నుల వరకు వెండికి డిమాండ్ ఉండగా కేవలం 700 నుంచి 800 టన్నులు ఉత్పత్తి అవుతోంది. ఇందులో సింహభాగం రాజస్థాన్‌లోని హిందుస్తాన్ జింక్ ఉత్పత్తి చేస్తోంది. ఈ సంస్థ జింక్ కోసం చేసే మైనింగ్‌లో ఉప-ఉత్పత్తిగా వెండి లభ్యమవుతోంది తప్ప, ప్రత్యేకంగా వెండి మైనింగ్ సాధ్యం కాదు. అయితే ఈ సంస్థ రాబోయే కాలంలో తన వార్షిక వెండి ఉత్పత్తిని 1500 టన్నులకు పెంచుతామని చెబుతోంది. ఇది కూడా మనదేశంలోని డిమాండ్‌కు ఏమూలకు సరిపోదు. ఈ కారణంగానే వెండి అవసరాలకోసం మన దేశం 80-90 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. మనకు అత్యధికంగా వెండి సరఫరా చేసే దేశం మెక్సికో. ప్రపంచంలో వెండి ఉత్పత్తిలో ఈ దేశం అగ్రగామిగా కొనసాగుతోంది. మెక్సికో తర్వాత ఇతర దేశాల

అమెరికా మదుపర్లు క్రిప్టోకరెన్సీ, ఈక్విటీలు, టెక్నాలజీ స్టాక్‌లపై దృష్టి కేంద్రీకరిస్తున్న తరుణంలో భారత్, చైనా, రష్యాలు వెండి నిల్వలు పెంచుకో వడానికి తీసుకుంటున్న చర్యలు నిజంగా వ్యూహా త్మకం మాత్రమే కాదు ఎంతో దూరదృష్టితో కూడిన వని చెప్పాలి. ముఖ్యంగా డాలర్ ఆధారిత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచవ్యాప్తంగా అపనమ్మకం పెరుగు తున్న తరుణంలో, పారిశ్రామిక అవసరాలకు వెండి ప్రాధాన్య తను గుర్తించి ముందుజాగ్రత్తగా వ్యవహా రిస్తున్నాయి. బంగారాన్ని మానిటరీ నిల్వగా పరిగణిస్తుం డగా, 60 శాతం వెండి పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తున్నారు.

నుంచి మనం దిగుమతి చేసుకునే వెండి చాలా తక్కువేనని చెప్పాలి. ప్రస్తుతం మనదేశంలో వెండి వినియోగంలో కూడా వేగంగా మార్పులు వచ్చేస్తు న్నాయి. గతంలో 30-40% వరకు వెండిని ఆభరణాలు, వస్తువుల తయారీలో వినియోగించే వారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో పరిశ్రమల్లో వెండి వినియోగం 20-30% పెరిగింది. అదేవిధంగా వెండిపై పెట్టుబడి డిమాండ్ కూడా 20-30% వృద్ధి నమోదు చేసింది. ఇక మతపరమైన కార్యకలాపాల్లో వెండి వినియోగం తగ్గలేదు. సోలార్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్ వస్తువులు, విద్యుత్ వాహనాల ఉ త్పత్తిపై ప్రభుత్వం మరింత దృష్టి కేంద్రీకరించే కొద్దీ రాబోయేకాలంలో వెండికి డిమాండ్ మరింతగా పెరగడం ఖాయం.

భారత్, రష్యా, చైనాల వ్యూహం

అమెరికా మదుపర్లు క్రిప్టోకరెన్సీ, ఈక్విటీలు, టెక్నాలజీ స్టాక్‌లపై దృష్టి కేంద్రీకరిస్తున్న తరుణంలో భారత్, చైనా, రష్యాలు వెండి నిల్వలు పెంచుకో వడానికి తీసుకుంటున్న చర్యలు నిజంగా వ్యూహా త్మకం మాత్రమే కాదు ఎంతో దూరదృష్టితో కూడిన వని చెప్పాలి. ముఖ్యంగా డాలర్ ఆధారిత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచవ్యాప్తంగా అపనమ్మకం పెరుగు తున్న తరుణంలో, పారిశ్రామిక అవసరాలకు వెండి ప్రాధాన్యతను గుర్తించి ముందు జాగ్రత్తగా వ్యవహ రిస్తున్నాయి. బంగారాన్ని మానిటరీ నిల్వగా పరిగణిస్తుండగా, 60 శాతం వెండి పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో వెండి ఉత్పత్తిలో అగ్రస్థానంలో మెక్సికో ఉండగా, లోహాన్ని శుద్ధి చేయడంలో చైనా ముందం జలో ఉంది. అయినప్పటికీ చైనా ఇప్పుడు పెద్ద మొత్తంలో వెండిని దిగుమతి చేసుకోవడం విశేషం. ముఖ్యంగా మైనింగ్ చేసేవారితో నేరుగా సంప్రదిం పులు జరుపుతూ, ఇతర ప్రీమియంల చెల్లింపుల ద్వారా ముడి వెండిని సేకరించి, దేశీయంగా శుద్ధి చేస్తోంది. ముఖ్యంగా పశ్చిమదేశాల నియంత్రణలో వున్న 'సీఓఎంఈఎక్స్', 'ఎల్‌బీఎంఏ' వంటి ఎక్స్ఛేంజ్‌లపై ఆధారపడటం తగ్గించడం, సౌరఫలకాలు, విద్యుత్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీకి అవసరమైన ముడివెండిని సేకరించడం, డాలర్ ఆధారిత ఆస్తులు బలహీనపడుతున్న తరుణంలో ఇందుకు ప్రత్యామ్నాయంగా వెండిని ఒక ప్రత్యా మ్నాయ ఆస్తిగా అభివృద్ధి చేయడం, కరెన్సీ పరంగా ఉత్పన్నమయ్యే సంఘర్షణలను, వాణిజ్య వివాదా లను, ఆంక్షలను తట్టుకునే రీతిలో స్వయం సమృద్ధి సాధించడం లక్ష్యంగా చైనా వెండి నిల్వలను పెంచు కుంటోంది. ఆవిధంగా పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థల నుంచి తన ఆర్థిక వ్యవస్థను కాపాడుకుం టోంది. అందువల్ల దీన్ని కేవలం పెట్టుబడిగా పరిగణించడానికి వీల్లేదు. ఇక భారత్ విషయానికి వస్తే గత ఐదేళ్ల కాలంలో 900 మిలియన్ల ఔన్సుల వెండిని సమకూర్చుకుంది. సంప్రదాయిక, మతపర మైన కార్యకలాపాల కోసం మాత్రమే ఈ విధంగా చేయడం గమనార్హం. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలన్న దృష్టితో భారత్ సౌరవిద్యుత్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోంది. దీంతోపాటు డిఫెన్స్, ఎలక్ట్రానిక్, విద్యుత్ వాహనాల తయారీ వంటి వాటిపై కూడా పెట్టుబడులను కొనసాగిస్తోంది. ఇందుకు వెండి పెద్ద ఎత్తున అవసరం. చారిత్రకంగా పరిశీలిస్తే భారత్ బంగారం, వెండిలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం మనకు తెలిసిందే. ఇప్పుడు కరెన్సీ విలువ పతనాన్ని నిరోధించేందుకు, డిజిటల్ లావాదేవీలకు మరింత వెన్నుదన్నుగా ఉండేందుకు వీలుగా వెండి సేకరణను కొనసాగిస్తోంది. రష్యా కూడా భారత్, చైనాల మాదిరిగానే పశ్చిమదేశాల నియంత్రణలోని చెల్లింపుల వ్యవస్థ నుంచి బయట పడటానికి, ఆంక్షల నేపథ్యంలో డీడాలరైజేషన్ కోసం, దేశీయ అత్యాధునిక సాంకేతికతపై ఆధారపడే పరిశ్రమలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు వెండిని సేకరిస్తోంది. ముఖ్యంగా వస్తుమార్పిడి ఆధారిత ఆర్థికవ్యవస్థ నిర్మాణానికి కృషిచేస్తోంది.

నూతన ప్రపంచ క్రమం

ఎప్పుడైతే పేపర్ ఆధారిత కరెన్సీపై విశ్వాసం కోల్పోవడం జరుగుతుందో అప్పుడు, విలువైన లోహాలు మార్కెట్ నుంచి మాయమైపోతాయి. ఈవిధంగా కరెన్సీ విలువలు తగ్గిన సంఘటనలు గతంలో మూడుసార్లు చోటుచేసుకున్నా యి. అంటే కరెన్సీ విలువ పడిపోయినప్పుడు ఇటువంటి లోహాలను ప్రజలు తమ వద్ద భద్రపరచు కుంటారు. 1960లో బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ (డాలర్ వ్యవస్థ) దెబ్బతిన్నప్పుడు వెండి నాణేలు, ఇతర నాణేలలోని వెండి అంతర్గత విలువ, నాణెం ముఖ విలువను మించి పోవడంతో, ప్రజలు ఈ నాణేలను కరిగించడం మొదలుపెట్టారు. దీంతో యు.ఎస్. ప్రభుత్వం నాణేలలోని వెండి శాతాన్ని తగ్గించడం ద్వారా, వీటిని ప్రజలు నిల్వచేయకుండా, స్థిరమైన కరెన్సీ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. ఇక 1970లో బంగారం కంటే డాలర్ విలువ తగ్గింది. ఫలితంగా బంగారం ధరలు గణనీయంగా పెరిగాయి. పర్యవసానంగా వెండి ఔన్సు ధర 1.95 డాలర్ నుంచి 1980 నాటికి ఏకంగా 50 డాలర్లకు పెరిగింది. మదుపర్లు ఈ ద్రవ్యోల్బణం నుంచి రక్షణకోసం వెండి కొనుగోళ్లకు మొగ్గు చూపడమే ఈ పెరుగుదలకు కారణం. 1920ల్లో కూడా అతి ద్రవ్యోల్బణం కారణంగా కరెన్సీలకు విలువలేకుండా పోయింది. ఫలితంగా చెలామణిలో వున్న కరెన్సీ కంటే కర్మాగారాలు ఉత్పత్తి చేసిన వస్తువులకే ఎక్కువ విలువ నమోదైంది. ఇక ప్రస్తుత పరిస్థితికి వస్తే, డీడాలరైజేషన్ ప్రక్రియ ఊపందుకుంటోంది. మల్టీ పోలార్ కరెన్సీల దిశగా ప్రపంచ దేశాలు అడుగులు ముందుకేస్తున్నాయి. వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకుల నిర్దేశిత లక్ష్యాల కంటే అధికంగా ద్రవ్యోల్బణం కొనసాగుతోంది. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక

వ్యవస్థలు తలకుమించిన అప్పుల్లో మునిగిపోయాయి. ఈ నేపథ్యంలో క్రమంగా వెండి ఒక భౌగోళిక రాజకీయ అస్త్రంగా మారుతోంది. అందువల్ల వివిధ దేశాలు వెండి ప్రాముఖ్యతను గుర్తిస్తున్నాయి. ముఖ్యంగా ఉత్పత్తి దేశాల ఎగుమతి నియంత్రణలను అడ్డుకునేందుకు, సంప్రదాయంగా వస్తున్న డాలర్ వినియోగాన్ని తప్పించేందుకు వెండి ఉపయోగ పడుతుంది. భారత్, చైనా, రష్యాలు ఈ విధంగా వెండి నిల్వలను పెంచుకోవడం వెనుక ప్రపంచ వ్యవస్థలను క్షుణ్ణంగా అంచనా వేయడం ప్రధాన కారణం. ముఖ్యంగా రానున్న కాలంలో ప్రస్తుత శిలాజ ఇంధన వినియోగం నుంచి పర్యావరణ హిత ఇంధన వినియోగానికి మారాలంటే వెండి అత్యంత అవసరం. మానిటరీ వ్యవస్థ కూడా క్రమంగా మార్పునకు లోనవుతున్న కారణంగా ఇప్పటివరకు పట్టించుకోని వెండి కీలక పాత్ర పోషిస్తుందన్న సత్యాన్ని ఈ దేశాలు గుర్తించాయి. ఉదాహరణకు వెనిజులాపై అమెరికా దాడిని ముందు గానే పసిగట్టిన రష్యా, చైనాలు రహస్యంగా అక్కడి వెండి నిల్వల్లో చెరో 400 టన్నులను తమ దేశాలకు తరలించేశాయి. మదురోను అరెస్ట్ చేసిన తర్వాత వెండిని తరలిద్దామనుకున్న ట్రంప్ తెల్లమొగం వేయాల్సివచ్చింది. వస్తు మార్కెట్ల పరంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తలు చోటుచేసుకునే అవకాశాలు మెండుగా ఉన్న నేపథ్యంలో, దేశ రక్షణలో వనరుల భద్రత కూడా ఒక భాగమైందని గుర్తించే రీతిలో ఈ దేశాల ఆలోచనా సరళిలో వచ్చిన మార్పులకు ఇదొక గొప్ప ఉదాహరణ. ప్రపంచంలో బలీయమైన ఆర్థికశక్తుల మధ్య పోటీ నెలకొన్న తరుణంలో, వ్యూహాత్మక అవసరాలు, భౌతిక కొరతల మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు వెండిధర పెరగడం ప్రధానాంశం కాబోదు. ప్రస్తుతం అమెరికన్లు ఆర్థిక మార్కెట్లపై దృష్టి కేంద్రీకరించిన తరుణంలో ఇతర దేశాలు భవిష్యత్తు సైనిక, ఆర్థిక అవసరాలపై దృష్టి కేంద్రీకరించడం ఇక్కడ కీలకం. ఇప్పుడు వెండిని నిల్వచేసుకుంటున్న దేశాలు అధిక ధరలను పట్టించు కోవడం లేదు. కేవలం నూతన ప్రపంచ క్రమానికి తమను తాము సిద్ధం చేసుకుంటున్నాయన్నది అక్షర సత్యం. ఈ విషయంలో పశ్చిమదేశాలు ఇప్పటివరకు వెనుకబడి ఉన్నాయనే చెప్పాలి.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

అమెరికా జాతీయ భద్రతకు అండగా వెండి!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏకకాలంలో గ్రీన్‌లాండ్ పైనా, వెండిపైనా కన్నేశారు. గ్రీన్‌లాండ్ కొనుగోలు వ్యవహారం ఈ మధ్య మళ్లీ తెర మీదకొచ్చినదైతే, వెండి నిల్వలను పెంచుకునే కసరత్తు ఏడాది కాలంగా అమెరికాలో జరుగుతోంది. గ్రీన్‌లాండ్ కోసం అమెరికా పట్టు బట్టిన కారణంగా వెండి ధరలకూ రెక్కలొచ్చాయంటే విస్తుపోవాల్సిందే మరి.

2025లో అమెరికా కీలకమైన ఖనిజాల (క్రిటికల్ మినరల్స్) జాబితాలో వెండిని చేర్చింది. యుఎస్ జియాలజికల్ సర్వే-యూఎస్ జీఎస్ నవంబర్, 2025లో కీలకమైన ఖనిజాల జాబితాను ఖరారు చేసింది. ఇందులో వెండితో పాటు టంకం (బోరాన్), రాగి, సీసము, బొగ్గు, ఫాస్ఫేట్, పొటాషియం, రీనియం, సిలికాన్, యురేనియం వంటి 10 కొత్త ఖనిజాలను జోడించారు. దీంతో మొత్తం జాబితా 60 ఖనిజాలకు చేరుకుంది. ఈ జాబితాతో వెండిని కేవలం బంగారం లాంటి విలువైన లోహం లేదా పెట్టుబడికి పనికివచ్చే ఆస్తిగా మాత్రమే కాకుండా జాతీయ భద్రత, ఆర్థిక భద్రత, పారిశ్రామిక, రక్షణ, స్వచ్ఛమైన ఇంధనానికి అత్యవసర వ్యూహాత్మక ఆస్తిగా అమెరికా పరిగణించడం మొదలుపెట్టింది. వెండిని ఎలక్ట్రికల్ సర్క్యూట్స్, బ్యాటరీలు, సోలార్ సెల్స్ (ఫోటోవోల్టాయిక్ ప్యానెల్స్), ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ), సెమీకండక్టర్స్, 5జీ టెక్నాలజీ, యాంటీ-బ్యాక్టీరియల్ మెడికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, డిఫెన్స్ సిస్టమ్స్‌లో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఈ లోహానికి పారిశ్రామిక గిరాకీ 60%కి పైగా ఉండటం వల్ల సప్లై చైన్ సెక్యూరిటీ అత్యంత ముఖ్యమైందిగా మారింది.

చైనా ఆధిపత్యం నుంచి వెండి సప్లై చైన్‌ను మళ్లించడం కోసమని దేశీయ ఉత్పత్తిని పెంచడం, విదేశాలతో ఒప్పందాలు చేసుకోవడంపై అమెరికా ప్రధానంగా దృష్టి పెట్టింది. 2025లో ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ల ద్వారా ఖనిజాల ఉత్పాదకతను వేగవంతం చేయడానికి నియంత్రణలను సడిలించారు. దేశీయ మైనింగ్‌కు ప్రోత్సాహకాలు ఇచ్చారు. ఆస్ట్రేలియా, జపాన్, మలేషియా, థాయ్‌లాండ్, అర్జెంటీనా వంటి దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకం చేశారు.

జనవరి 14, 2026న ట్రంప్ వైట్ హౌస్ నుంచి ఒక సాధికార ప్రకటన (ప్రొక్లమేషన్)జారీ చేశారు. ఇందులో వెండి సహా 41 కీలకమైన ఖనిజాల ఎగుమతులు జాతీయ భద్రతకు ముప్పుగా ఉన్నాయని పేర్కొన్నారు. వాణిజ్య విస్తరణ చట్టంలో సెక్షన్ 232కు లోబడి వాణిజ్య మంత్రి, అమెరికా

వాణిజ్య ప్రతినిధులు విదేశీ సరఫరాదారులతో ఒప్పందాలు కుదుర్చుకునే అంశంపై చర్చలు జరపాలని ఆదేశించారు. ఇందులో కనీస ధరలు నిర్ణయించడం, వాణిజ్యపరమైన ఆంక్షలు వంటి చర్యలు పరిగణన లోకి తీసుకున్నారు. తద్వారా అమెరికా సరఫరాను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి అధిక ధరలు చెల్లించేందుకు సైతం సిద్ధంగా ఉన్నాననే స్పష్టమైన సంకేతాన్ని అంతర్జాతీయ సమాజానికి ఇచ్చింది.

అయితే సుంకాల విషయంలో మొదట్లో ఆలస్యం చేశారు. బదులుగా సంప్రదింపుల ద్వారా సరఫరాను భద్రపరుచుకోవాలని నిర్ణయించారు. అయితే, ఎగుమతులపై చైనా నియంత్రణలు, వాణిజ్య వివాదాల వల్ల ఉద్రిక్తత పెరిగింది. కాంగ్రెస్‌లో ద్వైపాక్షిక బిల్లు ద్వారా కీలకమైన ఖనిజాలకు సంబంధించి 2.5 బిలియన్ డాలర్ల విలువైన నిల్వలను సృష్టించాలని ప్రతిపాదన వచ్చింది. ఇది పెట్రోలియం నిల్వలాంటిది. ఈ ప్రతిపాదన వెండి సహా కీలకమైన ఖనిజాలను నిల్వ చేసి దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసే లక్ష్యంతో ఉంది. ఇది ఫెడరల్ రిజర్వ్ లాంటి పాలనా వ్యవస్థతో నడుస్తుంది.

ఈ వ్యూహం వల్ల వెండి ధరలు 2025లో 130% పెరిగాయి, 2026లో కూడా రికార్డు స్థాయిలకు చేరాయి స్పాట్ సిల్వర్ 90 డాలర్ల నుంచి 94 డాలర్లు/ఔన్స్‌కు చేరుకుంది). ఇది సరఫరా లోటు, పారిశ్రామిక గిరాకీ పెరుగుదల, జాతీయ భద్రతా ఆందోళనల వల్ల జరిగింది. భవిష్యత్తులో దేశీయ మైనింగ్, రీసైక్లింగ్, మిత్రదేశాలతో భాగస్వామ్యాలను పెంచడం ద్వారా దిగుమతులపై ఆధారపడటం తగ్గించాలనేది అమెరికా లక్ష్యం. మొత్తంగా, ట్రంప్ ప్రభుత్వం వెండిని జాతీయ భద్రతా సమస్యగా చూస్తూ, సప్లై చైన్ సెక్యూరిటీ, దేశీయ ఉత్పాదకత, సంప్రదింపులు, కనీస ధరలు, వ్యూహాత్మక నిల్వల ద్వారా భద్రపరుచు కునే వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇది వెండి మార్కెట్‌ను దీర్ఘకాలికంగా బలోపేతం చేసే అవకాశం ఉంది. అయితే ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయాలనే తన ప్రణాళికకు సంబంధించి యూరప్ దేశాలపై టారిఫ్ బెదిరింపులు జారీ చేయడం వల్ల ప్రపంచ మార్కెట్లలో భారీ ఒడుదొడుకులు ఏర్పడ్డాయి. ఈ టారిఫ్ బెదిరింపులు బులియన్ మార్కెట్‌ను (బంగారం, వెండి) రికార్డు స్థాయికి తీసుకెళ్లాయి. జనవరి 17న ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ద్వారా ప్రకటన ఇచ్చారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా పూర్తిగా కొనుగోలు చేసే ఒప్పందం జరిగే వరకు, డెన్మార్క్ సహా ఎనిమిది ఐరోపా దేశాల నుంచి వచ్చే వస్తువులపై 10% టారిఫ్ విధిస్తామని చెప్పారు. ఈ టారిఫ్ ఫిబ్రవరి 1 నుంచి అమలవుతుంది. జూన్ 1 నాటికి ఇది 25%కి పెరుగుతుందని హెచ్చరిం చారు. అమెరికా అధ్యక్షుడు హెచ్చరించిన దేశాల్లో డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్, నెదర్లాండ్స్, ఫిన్‌లాండ్ ఉన్నాయి.

గ్రీన్‌లాండ్ డెన్మార్క్ ఆధీనంలో ఉంది. ట్రంప్ దీనిని అమెరికా జాతీయ భద్రత కోసం కొనాలని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనను డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రజలు, ఐరోపా దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ టారిఫ్ బెదిరింపుల వల్ల ఐరోపా నుంచి ప్రతీకార టారిఫ్‌లు వచ్చే భయంతో ట్రేడ్ వార్ ముప్పు పెరిగింది. దీంతో ఇన్వెస్టర్లు సురక్షితమైన ఆస్తుల వైపు వైపు మొగ్గు చూపారు. ఫలితంగా బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి.

అమెరికా డాలర్ బలహీనపడటం, స్టాక్ ఫ్యూచర్స్ పడిపోవడం, ఐరోపా దేశాల నుంచి ప్రతిస్పందనలు రావడం వల్ల ఈ బంగారం-వెండి ర్యాలీ మరింత బలపడింది. అమెరికా ఇలా టారిఫ్‌లు విధించడం తప్పు అని, నాటో మిత్రదేశాలు ఇలాంటివి విధించడం సరికాదని ఐరోపా నాయకులు, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ వంటివారు విమర్శించారు. ఈ ఘటన గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ ఒత్తిడి తీవ్రతను చూపిస్తోంది. మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి గురవుతాయని అంచనా. భవిష్యత్తులో ట్రేడ్ వార్ తీవ్రమైతే బంగారం, వెండి ధరలు మరింత ఎగబాకే అవకాశం ఉంది. కాగా జనవరి 20 నాటికి వెండి ధర కిలో రూ. 3 లక్షలకు చేరింది.

– జాగృతి డెస్క్

మత 'మానసిక' రోగుల జిహాద్!

సనాతన ధర్మానికి మూలమైన భారతదేశంలో హిందువులలో భయానక వాతావరణం, అభద్రతాభావం కల్పించేందుకు దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయి. మంచితనంతో దేవుడిపై భారం వేసి తమ ధర్మాన్ని అనుసరిస్తున్న హిందువుల పరమత సహనాన్ని బలహీనంగా భావిస్తూ వారిని రెచ్చగొట్టేందుకు దేశంలో కుట్రలు జరుగుతున్నాయి. భారతీయులు సగర్వంగా నిర్మించుకున్న అయోధ్య రామమందిరం ప్రాంగణంలో, భాగ్యనగరం నడిబొడ్డున ఇటీవల జరిగిన దుశ్చర్యలు, ఏఐఎంఐఎం చీఫ్ అసద్దుదీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు పరిశీలిస్తే దేశంలో హిందూ సమాజం జాగృతం కావాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తున్నాయి. ఈ మూడు సందర్భాల్లోనూ తాము ఏమైనా చేయగలమనేలా మత ఛాందస బరితెగింపు స్పష్టంగా కనబడుతోంది. అయోధ్య, భాగ్యనగరంలో దేవాలయాల లక్ష్యంగా జరిగిన ఘటనలు హిందువుల సహనాన్ని పరీక్షించగా, ఓవైసీ వ్యాఖ్యలు యావత్ భారతదేశ భవిష్యత్తుకు ఒక హెచ్చరికే కాకుండా మత కుట్రలకు సూచికగా కనిపిస్తున్నాయి.

భారతీయులకు మచ్చగా నిలిచిన అయోధ్యలో బాబ్రీ మసీదు కట్టడాన్ని తొలగించి నిర్మితమైన భవ్యమైన రామమందిరం ప్రాంగణంలో జనవరి 10వ తేదీన కొందరు మతమౌఢ్యం చూపించారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి సంబంధించిన ముస్లింలు రామ మందిరం కాంప్లెక్స్ 'డీ-1' గేటు మార్గం ద్వారా సాధారణ భక్తులుగా ప్రవేశించి దేవాలయంలోని సీతారసోయి వద్ద నమాజు చేయడానికి ప్రయత్నించగా పసిగట్టిన భద్రతా దళాలు వేగంగా స్పందించి అడ్డుకున్నాయి. జమ్మూ కశ్మీర్‌లోని సోపైన్ జిల్లాకు చెందిన 55 ఏళ్ల అబు అహ్మద్ షేక్, సోఫియా అనే మహిళతో పాటు మరో యువకుడిని పోలీసులు ఈ ఘటనలో అదుపులో తీసుకోవడంతో యావత్ దేశం దిగ్భ్రాంతికి గురైంది. భద్రతా దళాలు అక్కడ ప్రార్థన యత్నాలను అడ్డుకోవడంతో అహ్మద్ షేక్ పెద్ద ఎత్తున మత నినాదాలు చేసినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. భారతీయులు శతాబ్దాలుగా పోరాడి నిర్మించుకున్న దివ్యమైన రామమందిరంలో మధ్యాహ్నవేళ నమాజుచేసి సనాతన ధర్మాన్ని అనుసరించే వారిని అవమానించడమే కాకుండా తాము తలుచుకుంటే ఏమైనా చేయగలమని హెచ్చరించాలనే ఉద్దేశపూర్వకంగా ఈ ఘటనకు పాల్పడ్డారు. నిత్యం లక్షలాది భక్తులతో కిటకిటలాడే అయోధ్య రామాలయంలో కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ కన్నుగప్పి లోనికి చొచ్చుకొచ్చి అక్కడ నమాజు చేయాలని సంకల్పించడమే వారి మత బరితెగింపును స్పష్టం చేస్తుంది. యావత్ హిందూ సమాజం ఎంతో ఆరాధ్యంగా కొలిచే అయోధ్య రామాలయంలోనే తాము బహిరంగంగా పగటి వేళనే నమాజు చేయగలిగామని వారు ప్రపంచానికి తెలియజేసే పైశాచికానందమైన కుట్రలు పన్నారు. మరోవైపు అయోధ్యలోని రామమందిరంపై ఉగ్రవాదులు కుట్రలు పన్నబోతున్నారనే వార్తలున్న నేపథ్యంలో ఇలాంటి ఘటన జరగడం, అక్కడ కోట్ల రూపాయలు వ్యయం చేసి ఆధునిక పరికరాలతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినా రక్షణ వైఫల్యం తీవ్ర ఆందోళనలు కలిగిస్తున్నాయి.

అయోధ్యలో నమాజు కుట్రలు బయటపడిన రోజునే మన భాగ్యనగరంలో కూడా దేవాలయం లక్ష్యంగా మరో దురదృష్టకరమైన ఘటన జరగడం ఆందోళనకరం. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లాకు చెందిన అల్తాఫ్ అనే ఒక మత మౌఢ్యుడు సఫిల్‌గూడ చెరువువద్ద కట్టమైసమ్మ ఆలయం ప్రాంగణంలో పవిత్రంగా భావించే బొడ్రాయి వద్ద అసభ్యకరంగా వ్యవహరించి హిందువుల మనోభావాలను గాయపరిచాడు. రాకపోకలతో నగరం నడిబొడ్డున నిత్యం హడావుడిగా ఉండే సఫిల్‌గూడ చెరువు ప్రధాన రహదారిలో ఉన్న కట్టమైసమ్మ అమ్మవారి దేవాలయంలో జనవరి 10వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో ఈ ముస్లిం యువకుడు దుశ్చర్యకు పాల్పడుతూ నిస్సిగ్గుగా బొడ్రాయి వద్ద మూత్ర విసర్జన చేయడంతో స్థానికులు అతడని పట్టుకొని ఆగ్రహంతో దేహశుద్ధి చేశారు. ఈ అసభ్య చర్యను నిరసిస్తూ వేలాది మంది తెల్లవారుజాము వరకు భారీ ధర్నా చేపట్టారు.

మైసమ్మ దేవాలయంలో అలజడి వేడి చల్లారకముందే హిందువులు ఆనందోత్సవాలతో జరుపుకునే మకర సంక్రాతి పండుగ రోజు జనవరి 14వ తేదీ అర్ధరాత్రి పాతబస్తీ ఫురానాపూల్ వద్ద చారిత్రాత్మకమైన మైసమ్మ దేవాలయంలో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. దుండగులు మైసమ్మ

ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి విగ్రహాన్ని, పటాలను ధ్వంసం చేశారు. ఈ ఘటన జరిగిన ప్రాంతం పాతబస్తీ కావడంతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. స్థానికులతో పాటు హిందూ సంఘాల నేతలు భారీ స్థాయిలో నిరసనలు చేపట్టారు. వారం రోజుల వ్యవధిలోనే హైదరాబాద్‌లో హిందూ దేవాలయాల లక్ష్యంగా రెండు దుశ్చర్య ఘటనలు జరగడంతో నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఒక వర్గం లక్ష్యంగా అల్లరి మూకలు బరితెగిస్తుండడంతో రానున్న రోజుల్లో మరింత అప్రమత్తంగా మెలగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

దేవాలయాల్లో జరిగిన ఈ మూడు ఘటనల్లో దుండగుల దుశ్చర్య గమనిస్తే సనాతన ధర్మంపై వారికున్న కక్ష మాత్రమే కాకుండా హిందువుల సహనాన్ని పరీక్షిస్తున్నట్టు ఉంది. మత దురహం కారంతో పరమతస్థుల మనోభావాలను గాయ పర్చేందుకు, రెచ్చగొట్టేలా ఈ చర్యలున్నాయి. నిత్యం లౌకికవాదాన్ని వల్లె వేసే మన సెక్యులర్ పార్టీలు, మేధావులు ఈ ఘటనలపై ఇంతవరకు నోరు మెదపకపోవడం దురదృష్టకరం. హిందువులపై, హిందూ దేవాలయాలపై ఎక్కడ దాడులు జరిగినా మొట్టమొదటగా వినిపించే మాట మానసిక పరిస్థితి సరిగ్గా లేని వ్యక్తులు చేసిన ఘటనగా కప్పిపుచ్చడం. ఒకటి రెండు అంటే అనుకోవచ్చు, అన్ని సందర్భాల్లో ఈ మానసిక పిచ్చోళ్లకు హిందూ దేవాలయాలే లక్ష్యాలుగా కనిపిస్తాయా? అనేది మిలియన్ డాలర్ ప్రశ్న. వాళ్లు అన్ని పనుల్లోనూ మంచిగానే ఉంటారు. కేవలం దేవాలయాలపై దాడులు చేసినప్పుడు మాత్రమే వారు మానసిక రోగులుగా కనిపిస్తారు. దీన్ని మానసిక రోగం అనే దానికంటే మత రుగ్మత అనడం సరైనది. ఎందుకంటే అయోధ్య రామాలయంలో నమాజు కోసం ప్రయత్నించిన వ్యక్తి కొంత కాలంగా మానసికంగా ఇబ్బందిపడుతూ చికిత్స తీసుకుంటున్నారని పోలీసులు చెబుతున్నారు. ఇక్కడ ఆశ్చర్యకరం ఏమిటంటే ఆ మానసిక రోగి కశ్మీర్ నుండి అజ్మీర్‌కు వెళ్తూ మధ్యలో అయోధ్య వచ్చాడు. ఒక మానసిక రోగి అన్ని వందల కిలోమీటర్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణం చేశాడు. అయోధ్యలో కూడా భద్రతా దళాల కన్నుగప్పి లోపలికి రావడం కూడా పిచ్చోడి లక్షణమేనా..? ఆయనను పోలీసులు పట్టుకున్నప్పుడు పెద్దగా మత నినాదాలు చేశాడు. ఎలాంటి లక్ష్యం లేకుండా వచ్చిన ఆయన నినాదాలు ఎందుకు చేశాడు..? పోలీసులు పట్టుకోగానే భయపడకుండా నినాదాలు చేయడం వెనుక తెగింపు కనిపించడం లేదా..? ఆయనకు తోడుగా మరో మహిళ కూడా రావడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి..? ఇవన్నీ మానసిక జబ్బు అంటే అంతకు మించి మరో హాస్యాస్పదం ఉండదు.

అయోధ్య రామాలయంలోనే కాదు సఫిల్‌గూడ కట్ట, పురానాపూల్ మైసమ్మ దేవాలయం వద్ద కూడా మత పిచ్చి ఉన్మాదులు అమానవీయంగా పశువుల వలే ప్రవర్తించారు. అన్ని ఘటనల్లో చెప్పినట్టే షరామామూలుగా వీరి మానసిక పరిస్థితి కూడా బాగోలేదంటూ అసలు విషయాన్ని పక్కదారి పట్టించడం ఖాయమని గత అనుభవాలు చెబుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో దేవాలయాలపై ఇలాంటి దాడులు పరిపాటిగా మారాయి. నగరంలో దేవాలయాల లక్ష్యంగా బరితెగిస్తున్న ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఆగస్టు, 2024లో పాతబస్తీ రక్షాపురంలో అమ్మవారి దేవాలయంపై, అక్టోబర్, 2024లో సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంలో ఇదే తరహా దాడులు జరిగాయి. అప్పుడు కూడా పెద్ద ఎత్తున హిందువులు నిరసనలు చేపట్టారు. నిందితులను మానసిక రోగులని చల్లార్చుతూ చేసిన ప్రకటనతో తాత్కాలికంగా ఉద్రిక్తతలు తగ్గిస్తున్నా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సరైన చర్యలు తీసుకోవడంలో మాత్రం ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయి.

హిందూ దేవాలయాల లక్ష్యంగా ముందస్తు ప్రణాళికలతో అలజడి సృష్టిస్తున్న వారిని మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని చెబుతూ సున్నితమైన అంశాలను పక్కదారి పట్టించడం చూస్తుంటే వారు మానసికంగా దృఢంగా ఉండి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారా? లేక మన ప్రభుత్వాలతోపాటు సనాతన ధర్మాన్ని అనుసరించే వారు మానసికంగా బలహీనంగా ఉన్నారా? అనే సందేహాలు వస్తున్నాయి. దేవాలయాలపై మత పిచ్చోళ్ల అరాచకాలు పెరుగుతున్న దశలోనే హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యల రూపంలో మానసిక దాడి చేశారు. మత పిచ్చితో ఉన్మాదులు దేవాలయాల్లో తెగబడితే ఎంపీ అసదుద్దీన్ తానేమీ తక్కువ కాదన్నట్టు మత కోణంలో మాట్లాడారు. ఉన్మాదులు దేవాలయాల్లో అలజడి సృష్టించి తమ మతం ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని చూస్తే, ఎంపీ తన వ్యాఖ్యలతో భారత్‌లో ఇస్లాం మతం ప్రాబల్యాన్ని సూచించారు.

హిందూ సమాజాన్ని కించపరుస్తూ దేవాలయాల్లో అలజడి జరుగుతున్న దశలోనే జనవరి 10వ తేదీన ఓవైసీ మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా ముంబాయిలో ప్రసంగిస్తూ హిజాబ్ ధరించిన మహిళ ఏదో ఒక రోజు దేశంలో అత్యున్నతమైన ప్రధానమంత్రి పదవి చేపడతారని అన్నారు. ఈ వ్యాఖ్యలు ఎన్నికల ప్రచారంలో భాగంగానే కనిపిస్తున్నా దీని వెనుక వారి మత ఆధిపత్యం, ఛాందస కుట్రలు దాగున్నాయి. దేశంలో 14 శాతంపైగా ఉన్న ముస్లిం మైనార్టీలు ప్రధాన మంత్రి పదవి చేపడతారని ఆయన ప్రకటించడం హాస్యాస్పదం కాదు. దేశంలో సంకుచిత బుజ్జగింపు రాజకీయాల కారణంగా 14 శాతం ఉన్న ముస్లింలు ఇప్పటికే పలుచోట్ల గెలుపోటములను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, తెలంగాణ, కేరళ, కర్నాటక, జమ్మూకశ్మీర్ వంటి కీలక రాష్ట్రాల్లో ప్రభుత్వ ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. బుజ్జగింపు రాజకీయాల దృష్ట్యా ఏదో ఒకరోజు మైనార్టీ నేత ప్రధానమంత్రి పీఠం అధిరోహిస్తారనే ధీమా ఓవైసీ మాటల్లో ప్రస్ఫుటమవుతోంది. మరోవైపు ముస్లింల జనాభా పెరుగుదలతో ప్రపంచంలో అతిపెద్ద హిందూ దేశమైన భారత్‌లో మార్పులు సంభవిస్తాయని ఓవైసీ సున్నితంగా తెలియజేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సనాతన ధర్మాన్ని అనుసరించే హిందూ సమాజానికి ప్రమాదకరమైన హెచ్చరిక లాంటిదే.

ప్రజాస్వామ్య భారత దేశంలో ఉన్నతమైన రాష్ట్రపతి పదవిని జాకీర్ హుస్సేన్, మహ్మద్ హిదయతుల్లా, ఫక్రుద్దీన్ ఆలీ, అబ్దుల్ కలాం చేపట్టారు.

దేశంలో అత్యున్నత పదవి మైనార్టీలకు ఇవ్వకూడదని ఎక్కడా లేదు. అలా అని మహిళలు చేపట్టకూడదని కూడా లేదు. అయితే అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యల్లోనే మత కోణం కనిపిస్తోంది. హిజాబ్ ధరించిన వారు ప్రధాని పదవి చేపట్టాలన్నారు. మతం ఆధారంగా రాజకీయాలు చేసే ఓవైసీ హిజాబ్ అంశంతో రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తున్నారు. ఒక ముస్లిం లేదా ముస్లిం మహిళ ప్రధాని పదవి చేపట్టాలి అనడం కంటే హిజాబ్ ధరించిన వారు ప్రధాని అవుతారని చెప్పడంలోనే మత కోణం ఉంది. బిహార్ సీఎం నితీష్‌కుమార్‌పై ఇటీవల హిజాబ్ చర్చ జరుగుతున్న వేళ ఓవైసీ మహారాష్ట్ర ఎన్నికల్లో హిజాబ్ అంశం లేవనెత్తారు. సున్నితమైన హిజాబ్ గురించి ఆయన మాట్లాడడం ఇది మొదటిసారి కాదు. అక్టోబర్ 26, 2022న కర్ణాటక రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలవేళ ఒక సభలో మాట్లాడుతూ హిజాబ్ ధరించిన వారు ప్రధాని కావాలని అసదుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో కర్ణాటకలో హిజాబ్ వివాదం నడుస్తుంది. అంతేకాక మార్చి, 2022లో కర్ణాటకలో హిజాబ్ అంశంపై కోర్టు తీర్పు ఇచ్చిన సమయంలో కూడా ఓవైసీ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఎన్నికల సమయాల్లో హిజాబ్ వంటి సున్నితమైన అంశాలతో రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించడం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి వెన్నతో పెట్టిన విద్య కావడంతో తరచూ మాట్లాడుతుంటారు.

పాకిస్తాన్ వలే కాకుండా ఇండియాలో అంబేద్కర్ కారణంగా హిజాబ్ ధరించిన వారికి కూడా ప్రధాన మంత్రి పదవి చేపట్టే అవకాశముందని ఓవైసీ వ్యాఖ్యానించారు. అడుగడుగునా మతం పేరుతో రాజకీయాలు నడుపుతూ లబ్ధిపొందే ఓవైసీ లాంటి వారు అంబేద్కర్ పేరు ఎత్తడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉంటుంది. మత రాజకీయాలు,

మతం ఆధారంగా రాజకీయాలు చేసే ఓవైసీ హిజాబ్ అంశంతో రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తున్నారు. ఒక ముస్లిం లేదా ముస్లిం మహిళ ప్రధాని పదవి చేపట్టాలి అనడం కంటే హిజాబ్ ధరించిన వారు ప్రధాని అవుతారని చెప్పడంలోనే మత కోణం ఉంది. బిహార్ సీఎం నితీష్ కుమార్‌పై ఇటీవల హిజాబ్ చర్చ జరుగుతున్న వేళ ఓవైసీ మహారాష్ట్ర ఎన్నికల్లో హిజాబ్ అంశం లేవనెత్తారు. సున్నితమైన హిజాబ్ గురించి ఆయన మాట్లాడడం ఇది మొదటిసారి కాదు.

భారత్‌లో ఇస్లాం మతం, దేశ విభజన అంశాలపై అంబేద్కర్ స్పష్టమైన అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఇస్లాంలో మతం, పాలన వేర్వేరుగా ఉండడం కష్టమని, దేశ విభజన సమయంలోనే హిందువులు, ముస్లింల మధ్య నమ్మకం తగ్గిందని, వీరి మధ్య శాంతి ఉండకపోవచ్చని, బాధాకరమైనా దేశ విభజన పరిస్థితులు ఏర్పడ్డాయని నాడే అంబేద్కర్ తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెబితే, ఇప్పుడు ఆయన పేరు ఉటంకిస్తూ హిజాబ్ ధరించిన వారు ప్రధానమంత్రి అవుతారని ఓవైసీ వ్యాఖ్యానించడం హాస్యాస్పదం.

అసదుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యల్లో ముస్లిం మహిళల అభివృద్ధి కంటే ఆయనలో ఉన్న మత అహంకార ఆధిపత్యమే కనిపిస్తోంది. ఎన్నో అవకాశాలున్నా ఓవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం పార్టీ కీలకమైన పదవులను మహిళలకు ఎన్నడూ కట్టబెట్టకుండా చిన్నచూపు చూస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కారణంగా తప్పని పరిస్థితుల్లో మహిళలకు కార్పొరేటర్ల పదవుల అవకాశాలు ఇస్తున్నారు. నిజంగా ఆయనకు ముస్లిం మహిళలపై ప్రేమ ఉంటే వారికి ఉన్నత పదవులు ఎందుకివ్వలేదు? ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మేయర్ పదవులను తమ కుటుంబ సభ్యులకు, తమ అనుచరులకు మాత్రమే ఇస్తూ మహిళలకు ఎందుకివ్వలేదు? భారతదేశంలో అత్యున్నత పదవైన ప్రధాని పదవి గురించి మాట్లాడే ఓవైసీ హిజాబ్ ధరించిన వారికి మజ్లీస్ పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వచ్చు కదా?! మహిళల గురించి మాట్లాడే ఓవైసీ 2023 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసిన మాధవీలతపై ఒక మహిళ అని కూడా చూడకుండా మజ్లీస్ పార్టీ ఎంత అనుచితంగా, దౌర్జన్యంగా వ్యవహరించిందో తెలిసిందే. మాధవీలత హిందు మహిళ అనుకుంటే గతంలో హిజాబ్ ధరించిన ముస్లిం మహిళ పట్ల కూడా మజ్లీస్ అలానే వ్యవహరించింది. చంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం నుండి 2018లో అసదుద్దీన్ ఓవైసీ సోదరుడు అక్బరుద్దీన్ ఓవైసీకి ప్రత్యర్థిగా బీజేపీ తరఫున పోటీ చేసిన ముస్లిం మహిళ షాహీజాది సయ్యదపై మజ్లీస్ పార్టీ చేసిన ఆగడాలు, వ్యాఖ్యలు అన్నీ ఇనీ&్న కావు. ఆమెను బరిలో నుంచి తప్పించేందుకు అన్ని రకాల ఒత్తిళ్లు తెచ్చారు. ఆమె వారి బెదిరింపులకు, ఒత్తిళ్లకు లొంగకుండా పోటీ చేస్తే ఇబ్బందులు పెట్టారు. హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని పదవి చేపట్టాలని ఆకాంక్షించే అసదుద్దీన్ నాడు హిజాబ్ ధరించిన మహిళపట్ల ఎందుకు అనుచితంగా వ్యవహరించారో సమాధానం చెప్పాలి. వీరి వ్యవహారశైలి ఒకేలా కనిపిస్తోంది. హిజాబ్ ధరించినా, ధరించక పోయినా మత ఛాందసంతో ఓవైసీ కనుసన్నల్లో వారి అడుగులకు మడుగులు వత్తే వారుండాలి. మానసికంగా రాజకీయ దాడులు చేస్తున్న అసదుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యలో ముస్లిం మహిళలపై ప్రేమ కంటే వారి మత ఆధిపత్యం, ఛాందసమే ఎక్కువగా కనిపిస్తోంది.

నూతన సంవత్సరం 2026 ఆరంభంలోనే యాదృచ్ఛికంగానైనా దేవాలయాల్లో ప్రత్యక్షంగా అలజడులు, పరోక్షంగా అసదుద్దీన్ వ్యాఖ్యలు గమనిస్తే దేశంలో సనాతన ధర్మంపై విషం కక్కేందుకు, కుట్రలు పన్నేందుకు విద్రోహ శక్తులు కాచుకొని కూర్చున్నాయని స్పష్టమవుతోంది. దేవాలయాలపై మానసిక రోగుల పేరిట దాడులు, హిందూ సమాజంపై మానసికంగా రాజకీయ దాడులు చేస్తున్న ఓవైసీ వ్యాఖ్యలపై జాగృతం కావాల్సిన పరిస్థితులు ఆసన్నమయ్యాయి. సెక్యులరిస్టుల నుండి సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన సమయం వచ్చింది. హిందూ సమాజం చైతన్యం కాకపోతే భవిష్యత్తులో విషపూరిత శక్తులతో తిప్పలు తప్పవు. అత్యంత అప్రమత్తంగా మెలగాల్సిన అవసరం సనాతన ధర్మవాదులపై ఉంది.

– శ్రీపాద

ఆ మహా తండ్రులకు వందనాలు!

పశ్చిమ బెంగాల్‌లో గత కొద్ది సంవత్సరాలుగా జరుగుతున్న ఎన్నికల్లో ఒకే వ్యక్తిని తండ్రిగా పేర్కొంటూ వందలాదిగా వ్యక్తులు ఓటర్లుగా నమోదు చేసుకున్న దృష్టాంతాలు కోకొల్లలు. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఇటీవల సుప్రీంకోర్టుకు విన్నవించుకుంది. ఇందుకు తార్కాణంగా 2025 సంవత్సరానికి ఓటర్ల జాబితాకు సంబంధించి అసోన్‌సోల్ జిల్లా, బారబని, 283 నంబరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకే వ్యక్తిని తండ్రిగా పేర్కొన్న 389 ఓటర్లు వెలుగులోకి వచ్చారు. సరిచేయాల్సిన అలాంటి అస్తవ్యస్తమైన సమాచారాన్ని తర్కబద్ధమైన అపసవ్యతలు (లాజికల్ డిస్‌క్రెపెన్సీస్) కేటగిరీలోకి చేరుస్తామని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనానికి ఈసీ తరపు న్యాయవాది రాకేష్ ద్వివేది తెలిపారు. రికార్డులను సరిచేయడం కోసం అలాంటి ఓటర్లకు నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. వారి సరైన తల్లిదండ్రుల పేర్లతో కూడిన పత్రాలను సమర్పించాల్సిన బాధ్యత నోటీసులు అందుకున్న ఓటర్లపై ఉంటుంది.

ఈసీ అఫిడవిట్ ప్రకారం169 అసెంబ్లీ నియోజకవర్గంలో (బాల్లి, హౌరా జిల్లా) ఒకే వ్యక్తిని తండ్రిగా పేర్కొంటూ 310 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే ఇక్కడ ఏడుగురు వ్యక్తులను గురించి చెప్పాలి. ఈ ఏడుగురు 100 మంది ఓటర్లకు తల్లిదండ్రులుగా ఉన్నారు. అలాగే 10 మంది వంతున వ్యక్తులు 50 లేదా అంతకన్నా ఎక్కువ మంది ఓటర్లకు తండ్రులుగా నమోదై ఉన్నారు. మరో 10 మంది 40 మంది లేదా అంతకన్నా ఎక్కువ మంది ఓటర్లకు తండ్రులుగా ఉన్నారు. 14 మంది 30 లేదా అంతకన్నా ఎక్కువ మంది ఓటర్లకు తండ్రులుగా, 50 మంది 20 లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలకు తల్లిదండ్రులుగా, 8,682 మంది 10 మంది పిల్లలకు తల్లిదండ్రులుగా, 2,06,056 మంది ఆరుగురు పిల్లలకు తల్లి దండ్రులుగా, 4,59,054 మంది ఐదుగురు పిల్లలకు తల్లిదండ్రులుగా నమోదై ఉన్నారని అఫిడవిట్ వెల్లడించింది.

2019-21 నాటి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం భారతదేశంలో సగటున ఒక కుటుంబంలో సభ్యుల సంఖ్య 4.4గా ఉంది. ఇదే విషయమై ఈసీ తరపు న్యాయవాది సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తూ ఈ గణాంకాల ప్రకారం దేశంలో ప్రతీ కుటుంబానికి సగటున ఇద్దరు నుంచి ముగ్గురు పిల్లలు ఉండాలి. అయితే కొన్ని కేసుల్లో(పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి) ఒక తండ్రికి ముడిపడి ఉన్న ఓటర్ల సంఖ్య 50కి పై మాటగా ఉంది. దీనిపై ఓటర్ల నుంచి వివరణ కావాలి అని అన్నారు. కనుక ఒకే వ్యక్తికి సంతానంగా ఆరుగురు లేదా అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉన్న కేసుల వెనుక నిజానిజాలను, సాధ్యాసాధ్యాలను మరింత జల్లెడ పట్టాల్సిన అవసరం ఉంది. అలాంటి కేసుల్లో మోసపూరితమైన వాటిని ఏరిపారివేయడానికి ఆ ఓటర్లకు ఓటరు నమోదు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు అని కోర్టుకు ద్వివేది విన్నవించారు.

ఈసీ తర్కబద్ధమైన అపసవ్యతలు (లాజికల్ డిస్‌క్రెపెన్సీస్) కేటగిరీకి లోబడి అదనంగా నాలుగు ప్రాతిపదికల కింద ఓటర్లకు నోటీసులు జారీ చేస్తోంది. అందులో మొదటిది అక్టోబర్ 27, 2025 నాటి ఎన్నికల జాబితాలో ఉన్న ఓటరు పేరు 2002లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టిన తర్వాత విడుదల చేసిన జాబితాలోని పేరుతో సరితూగకపోవడం. రెండవది 2002 ఎస్ఐఆర్ జాబితా ప్రాతిపదికగా లెక్కించిన ప్రకారం ఓటరుకు, అతడు లేదా ఆమె తల్లిదండ్రులకు మధ్య వయోభేదం 15 సంవత్సరాల కన్నా తక్కువ ఉండటం. మూడవది ఓటరుకు, తల్లిదండ్రులకు మధ్య వయోభేదం 50 సంవత్సరాల కన్నా ఎక్కువ ఉండటం. ఈ కేటగిరీలోనే నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్ కూడా ఎన్నికల సంఘం నుంచి నోటీసు అందుకు న్నారు. ఓటరుకు, గ్రాండ్ పేరెంట్స్‌కు మధ్య వయోభేదం 40 సంవత్సరాల కన్నా తక్కువ ఉండటాన్ని నోటీసులు జారీ చేయడానికి నాల్గవ ప్రాతిపదికగా ఈసీ పరిగణిస్తోంది.

– జాగృతి డెస్క్



భాగం-20

అరిస్టాటిల్ బోధించిన రాజనీతి

గ్రీకు తత్వవేత్తలలో ప్లేటో, అరిస్టాటిల్ ప్రసిద్ధి పొందినవారు. రాజనీతిని బోధించి, రాజ్యాన్ని సుస్థిరం చేసేందుకు వారిద్దరూ పుస్తకాలు రచించారు. సమాజంలోని వైరుధ్యాలను చర్చిస్తూ... వాటికి తగిన పరిష్కారమార్గాలను వెతికే ప్రయత్నం చేశారు. వారి తర్వాత రోమన్ల కాలం ప్రవేశించింది.

వైయక్తిక సంపదలకు... అరిస్టాటిల్ తగు స్థానాన్ని కల్పించాడు. 'నా సంపదలు నా వ్యక్తిత్వానికి అద్దాన్ని చూపిస్తాయి. వాటియందే నేను నా ప్రతిబింబాన్ని చూస్తాను. వేటియందు నాకు అధికారం ఉంటుందో... వాటియందే నాకు నా గురించిన ఎరుక కలుగుతుంది' అని చెప్పాడు. దృఢత్వమనేది ప్రాకృతిక, నైతిక, ఆవశ్యకత అనే మూడింటి దృష్టి కోణాల్లో వైయక్తిక సంపదలయందు ఉండడం సమంజసం అన్నాడు. కొంతమంది శారీరకంగా, బౌతికంగా దుర్బరులై ఉంటారు. ఇది ప్రాకృతికమైన అంతరం. సమాజంలో కొంతమంది ఉత్కృష్టులు, మరికొందరు నికృష్టులు ఉంటూనే ఉంటారు. ఇక్కడ ఉన్నది నైతిక అంతరం. సామాజిక దృష్టిలో కూడా దృఢత్వం అవసరం. ఎందుకంటే వ్యవసాయం, ఉద్యోగం, రక్షకభట విభాగాలను ఈ దృఢత్వం ద్వారానే చక్కగా నిర్వహించడం సాధ్యమవుతుంది. పని విభజన దృష్ట్యా కూడా దృఢత్వం అవసరమని అతడు భావించాడు.

అరిస్టాటిల్, '[ప్రేమ – సామాన్యహితమనే రెండు భావనల రీత్యా కుటుంబ జీవితాన్ని గడపడం ఆవశ్యమని బోధించాడు. 'నైతికత అనే దృష్టికోణంలో కుటుంబంలో సహజ సిద్ధంగా ఏర్పడిన పాఠశాల. భార్య – భర్త, తండ్రి – కొడుకుల మధ్య ఏర్పడే బంధం ప్రాకృతికమైనది. వ్యక్తిత్వ వికాస దృష్ట్యా కుటుంబం ఒక స్థాయిని ఏర్పరుస్తుంది. ఆధునిక రాజ్యాల కల్పన ఇక్కడినుంచే ప్రారంభమవుతుంది' అని చెప్పాడు. విద్యాబోధనలో ఇట్టి సహజమైన విధానాలు – సిద్ధాంతాలే మేలన్నాడు. 'రాజ్యం – వ్యక్తుల మధ్య ఏ విధమైన వైరుధ్యం లేదు. ఇద్దరూ ఒక్కటే' అని ప్లేటో – అరిస్టాటిల్ నొక్కి చెప్పారు.

ఈ సిద్ధాంతాన్ని అనుసరించారు. వాళ్లిద్దరూ తమ సమకాలీన రాజ్య పరిస్థితుల పట్ల సంతుష్టిగా లేరు. అందువల్ల వారిద్దరూ రాజ్యంలో వాస్తవిక పరివర్తన వచ్చే విధంగా ఆదర్శ రాజ్య చిత్రణలు చేశారు. సంరక్షకులు నిస్వార్థ సేవారతులై ఉండాలన్నారు. అందుకోసం ప్లేటో ఆర్థిక – సామాజిక సామ్యవాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అరిస్టాటిల్ ఈ అభిప్రాయంతో విరోధించాడు. అతడి అభిప్రాయంలో, 'మానసిక వికారం అనేది మానసిక సమస్యలను తగ్గించే ఔషధాలను స్వీకరించడం ద్వారా మాత్రమే తగ్గించవచ్చు.' వారిద్దరూ కూడా విద్యారంగం రాజ్యం అధీనంలో ఉండాలని భావించారు. ఇస్టోయిక్ అనే దార్శనికుడు, మానవులందరూ సమానమే అన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. గ్రీకు తత్వవేత్తలందరూ మానవులకు స్వతంత్రత ఉండాలని నమ్మారు.

రాజనీతి శాస్త్రజ్ఞుల విషయంలో రోమ్‌కి ప్రముఖ స్థానం ఇవ్వాలి. వారి ప్రభావం నేడు కూడా యూరోప్ అంతటా కనిపిస్తుంది. గ్రీకులు పాటించిన రాజనీతిపరమైన ఆదర్శం వ్యక్తి – దేశాల స్వాతంత్ర్యాల పరంగా ఆదర్శప్రాయమైనది. గ్రీకులు నాగరిక రాజ్యాలకు చెందిన ప్రభుత్వాలనే ఎరిగిన వారు. వాటిలో నాగరిక పాలకులు, పరిపాలనా విధానాలు కూడా చేరి ఉన్నాయి. దీనికి పూర్తి విరుద్ధంగా రోమన్లు విశాల సామ్రాజ్యాల నిర్మాణం కావించారు. తాము స్వాధీనం చేసుకున్న ఆయా దేశాలను రోమ్ నుంచే పాలించారు. గ్రీకుల దృష్టికోణం నాగరిక రాజ్య నిర్మాణం అనే హద్దుల లోపల చిక్కుకున్నందువల్ల సంకుచితం అయింది. రోమ్‌కి చెందినవారు ప్రపంచం అంతటినీ ఒక్కటిగానే భావించి, రాజ్యపరంగా దేశాలన్నింటినీ ఏకం చేశారు. ప్రపంచ ప్రజల హృదయాలలో ఈ సమస్త ప్రపంచాన్ని ఒకే సూత్రంతో నిబద్ధించవచ్చని, ఒకే గొడుగు కిందికి తీసుకురావచ్చని అనిపించేలా చేశారు.

(వచ్చేవారం... మధ్యయుగంలో రాజనీతి)

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువత్త : నేతి సూర్యనారాయణశర్మ

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పథకాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం, రాష్ట్ర ఆర్థిక స్థితిని సరిచేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థిక అవకతవకలు, నిధుల మళ్లింపు వంటి సమస్యలను సవరించుకుంటూ, ప్రతి రూపాయిని సద్వినియోగం చేయడంపై దృష్టి సారించింది.

ప్రాయోజిత పథకాలతో

రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి అధిక నిధులు సాధించడం, వాటిని సమర్థవంతంగా ఖర్చు చేయడం, అదనపు నిధులు తెచ్చుకోవడం అనే మూడు సూత్రాలతో రాష్ట్ర యంత్రాంగాన్ని నడిపిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 76 కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్ర, కేంద్ర వాటా నిధులు కలిపి మొత్తం రూ. 24,513 కోట్లు కేటాయించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 15,173 కోట్లు, రాష్ట్ర వాటా రూ. 9,340 కోట్లు. ఈ నిధులను పూర్తిగా ఖర్చు చేయడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేయాలని ప్రణాళికలు రూపొందించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర పథకాల్లో రాష్ట్రానికి రూ. 39,642 కోట్లు కోతపడ్డాయి. అదనంగా రూ. 10,171 కోట్లు వేరే పథకాలకు మళ్లించారు. ఫలితంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. కానీ, ఎన్డీయే ప్రభుత్వం తొలి ఏడాదిలోనే ఈ సమస్యలను పరిష్కరించి, రూ. 17 వేల కోట్ల వరకు ఖర్చుచేసి విజయం సాధించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీలో కేంద్రమంత్రులు, అధికారులతో సమన్వయంచేస్తూ, రాష్ట్ర యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. నెల రోజుల్లోనే రెండుసార్లు సమీక్షలు నిర్వహించి, లక్ష్యాలను నిర్దేశించారు. దీంతో గత నెల (డిసెంబర్) 17వ తేదీ నాటికి రూ. 10,362 కోట్లు మాత్రమే ఖర్చు చేసిన స్థితి నుంచి, నెల గడవక ముందే అదనంగా రూ. 2,000 కోట్లకు పైగా వెచ్చించారు. ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేయడంతో పర్యవేక్షణను మరింత బలోపేతం చేశారు. ఇప్పుడు కేంద్రం నుంచి మూడో విడత నిధులు సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు.

కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు విధానాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో రాష్ట్రాలు కేంద్ర నిధులను పక్కదారి పట్టించడంతో కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాలు ప్రవేశపెట్టింది. ఇందులో సింగిల్ నోడల్ ఏజెన్సీ, సింగిల్ నోడల్ అకౌంట్ ఫ్రేమ్‌వర్క్ (స్నఫ్) వంటివి ఉన్నాయి. ఈ విధానంలో కేంద్ర నిధులు రాష్ట్ర ఖజానాకు చేరి, బిల్లులు సమర్పించిన తర్వాత నోడల్ ఏజెన్సీలకు విడుదల చేస్తారు. కానీ, ఈ విధానంలో లోపాలు ఉన్నాయని గుర్తించి, స్నఫ్ మార్గదర్శకాలను అమలు చేశారు. వీటి ప్రకారం,ప్రతి కేంద్ర పథకానికి సింగిల్ నోడల్ ఖాతా ఏర్పాటు చేయాలి. కేంద్ర, రాష్ట్ర వాటాల నిధులు ఆ ఖాతాకే విడుదల చేయాలి. దీంతో నిధుల మళ్లింపు అవకాశాలు తగ్గుతాయి, పారదర్శకత పెరుగుతుంది. ఈ మార్పులు రాష్ట్రంలోని పథకాల అమలును మరింత సమర్థవంతం చేస్తున్నాయి. ఉదాహరణకు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ఈ పథకాలు ప్రభావం చూపుతున్నాయి.

మొత్తంగా, ఎన్డీయే ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, సమన్వయం, పర్యవేక్షణల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. గత ప్రభుత్వ లోపాల నుంచి బయటపడి, కేంద్ర సహకారంతో భవిష్యత్ లక్ష్యాలను సాధించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రయత్నిస్తోంది. ఈ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో సహాయపడతాయి, రాష్ట్రానికి మరిన్ని అవకాశాలు తెరుస్తాయి.

21 లక్షల పిల్లలకు పోషకాహారం

పోషణ అభియాన్ 2.0 పథకం ద్వారా రాష్ట్రంలో 21 లక్షల మంది బాలలకు ప్రయోజనం కలిగింది. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో రాష్ట్రానికి రూ. 1,007 కోట్లు కేటాయించింది. మహిళలు, బాలల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహిస్తారు. 0-6 సంవత్సరాల పిల్లలు, ఆడపిల్లలు, గర్భిణులు, బాలింతలలో పోషకాహార

పోషణ అభియాన్

సమగ్ర శిక్షా అభియాన్

పురోగమనం

లోపాన్ని పరిష్కరించడం. మానవాభివృద్ధి ఈ పథకం లక్ష్యం. పోషకాహారంపై అవగాహన పెంచుతుంది, స్థిరమైన ఆరోగ్యం, మంచి ఆహార అలవాట్లను ప్రోత్సహిస్తుంది. అంగన్‌వాడీలలో బాల్య సంరక్షణ చేపడుతుంది. పిల్లలలో ఎదుగుదల లోపం, క్షీణత, తక్కువ బరువు సమస్యలు తగ్గుతాయి. గర్భిణులు, బాలింతలకు పోషకాలు అందడంతో శిశు మరణాలు తగ్గుతాయి, మాతా – శిశువుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఆడపిల్లలలో రక్తహీనత నియంత్రణకు సహాయ పడుతుంది. ఈ పథకం వల్ల 8 కోట్ల మంది పిల్లలకు, కోటి మంది గర్భిణులు, బాలింతలు, ఆకాంక్ష జిల్లాలలో 20 లక్షల మంది ఆడపిల్లలు ప్రయోజనం పొందుతున్నారు. సమాజంలో ఆరోగ్య స్థిరత్వం, ఉత్పాదకత పెరుగుతాయి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు దోహదపడుతుంది. ప్రస్తుత ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం 2025-26లో రూ.21,960 కోట్లు కేటాయించింది.

35 లక్షల విద్యార్థులకు సదుపాయాలు

సమగ్ర శిక్షా అభియాన్ పథకం ద్వారా రాష్ట్రం లో 35 లక్షల మంది విద్యార్థులకు విద్యకు సంబం ధించిన సదుపాయాలు అందాయి. సర్వ శిక్షా అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్, ఉపాధ్యాయ విద్యను కలిపి రూపొందింది. ప్రీ-స్కూల్ నుండి సీనియర్ సెకండరీ వరకు సమగ్ర, నాణ్యమైన విద్య అందించడం జాతీయ విద్యా విధానం-2020 అమలు, విద్యా హక్కు చట్టం-2009కు సహాయం పునాది అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం పెంపొందించడం సామాజిక, లింగ అంతరాలు తగ్గించడం సమానత్వం, సమ్మిళితం, వృత్తి విద్య ప్రోత్సహించడం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సహాయం ఈ పథకం లక్ష్యం. పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు మెరుగవుతు న్నాయి. ఉపాధ్యాయుల శిక్షణ, డిజిటల్ సాధనాలు (స్మార్ట్ తరగతులు, సమాచార సాంకేతికత) ప్రవేశ పెట్టారు. అట్టడుగు సముదాయాలు, ఆడపిల్లలు, దివ్యాంగులకు సమాన అవకాశాలు లభిస్తున్నాయి. 35 లక్షల మంది విద్యార్థులకు సదుపాయాలు మెరుగు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2024-25లో పాత బిల్లులకు రూ.1,240.10 కోట్లు చెల్లించింది. రాష్ట్ర వాటాతో కలిపి రూ.1,893.50 కోట్లు ఖర్చు చేసింది. 2025-26లో రూ.1,854 కోట్లు సింగిల్ నోడ్ ఖాతాలో ఖర్చు చేసేందుకు అందుబాటులో ఉండగా రూ.1,446 కోట్లు ఖర్చు చేశారు.

కృషి సంచాయి

గ్రామీణ రహదారులకు నిధులు

రాష్ట్రంలో పీఎం జన్మన్ (అడవితల్లి బాట) ద్వారా 239 ఆవాస ప్రాంతాలకు రూ.555 కోట్ల వ్యయంతో 206 రోడ్ల అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 30 బీటీ రోడ్లు వేస్తున్నారు. 160 పనులు మార్చి ఆఖరిలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. పల్లె పండగ-2.0 కింద ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా రూ. 1,122 కోట్ల వ్యయంతో 976 కి.మీ. మేర రోడ్లు అభివృద్ధి చేస్తున్నారు. నాబార్డు నిధులతో 1,203 కిలోమీటర్ల మేర 402 రహదారుల పనులకు రూ. 557 కోట్లు వెచ్చిస్తున్నారు. ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టుమెంటు బ్యాంకు (ఏఐఐబి) ద్వారా రూ. 1,100 కోట్ల వ్యయంతో 963 కి.మీ రోడ్లు (561 పనులు) నిర్మిస్తున్నారు.

రైతులకు నీటి సదుపాయం

ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన కింద రాష్ట్రంలోని రైతులకు సౌర శక్తి ద్వారా నీటిపారుదల సౌకర్యాలు, డీజిల్ పంపులు తగ్గించడం, ఆదాయం పెంచడం జరుగుతుంది. ఈ పథకానికి రాష్ట్రంలో రూ.111 కోట్లు కేటాయించగా, రూ.62 కోట్లు ఖర్చుచేశారు. 2026 నాటికి 34,800 మెగావాట్ల సౌర సామర్థ్యం సాధించడం, 20 లక్షల సౌర పంపుల ఏర్పాటు ఈ పథకం లక్ష్యం. 15 లక్షల సౌరశక్తీకరణ పంపులు ఇప్పటికి ఏర్పాటయ్యాయి. వీటి ఏర్పాటలో రైతులకు 60% సబ్సిడీ, 30% రుణం లభించగా 10% స్వంతంగా సమకూర్చు కోవాలి. సౌర యూనిట్లతో విద్యుత్ అమ్మి ఆదాయం (హెక్టారుకు రూ.80,000/సంవత్సరం) పెరుగు తుంది. డీజిల్ ఖర్చు తగ్గుతుంది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.34,422 కోట్లు సహాయం అందిస్తోంది.

ఆరోగ్య సదుపాయం

జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం ద్వారా రాష్ట్రానికి రూ.1,001 కోట్లు కేటాయించగా రూ.187 కోట్లు ఇప్పటికి ఖర్చుచేసింది. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్‌లు సంయుక్తగా అమలుచేస్తాయి. నాణ్యమైన ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులోకి తీసుకురావడం, మాతాశిశు మరణాలు తగ్గించడం, రక్తహీనత, సంక్రమణ, అసంక్రమణ వ్యాధుల నియంత్రణ ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ బలోపేతం చేయడం, పునరుత్పత్తి, మాతృత్వ, నవజాత, బాల్య, యువ ఆరోగ్య సేవలు మెరుగుపరచడం ఈ పథకం లక్ష్యం. ఈ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం 2024-25లో రూ.36,000 కోట్లు కేటాయించింది. ఆంధ్రలో రూ.1,001 కోట్లు మంజూరు చేయగా, రూ.187 కోట్లు ఖర్చు చేసింది. ఇక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి రూ.1,838 కోట్లు ఇచ్చింది.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

'కాశ్మీర దీపకళిక' (యాత్రా సాహితీ రచన)

'అపరాజిత' (మరో ఇద్దరితో కలిసి గొలుసు నవల)

అగ్నిపుత్రి పేరిట కవితా సంకలనం

ఆయుధ శీర్షికన కథాసంపుటి

తరగతి గదిలో ఆలకించిన పాఠాల నేపథ్యంలో ధారావాహికగా 'ఆంధ్రుల కథ', జానపద గేయాల గురించిన పరిశోధన.

ఇలా ఎన్నో విభిన్నతలను పుణికిపుచ్చుకున్న నాయని కృష్ణకుమారి తనదైన తీరున పాట రాసింది పదకొండేళ్ల వయసులో!

దశాబ్దం క్రితం జనవరి 30న ఆమె శాశ్వత నిద్రలోకి జారుకున్నపుడు వనితా సాహితీ కిరణం మటుమాయమైందని ఎందరెందరో కంటతడి పెట్టారు.

తన రచనల్లో ఒకటి 'ఏం చెప్పను నేస్తం' నాటి నుంచి నేటిదాకా ఏటేటా ఆ మూడు పదాలనే తలచుకుంటున్నారు అభిమానులందరూ! అంతటి ఆ 'సారస్వత మిత్ర' జీవనయాన విశేషాలెన్నో.

జానపద

భారత స్వాతంత్ర్య సమరయోధులు నాయని సుబ్బారావు. భావ కవిత్వమైనా, ఆత్మకథాత్మక ప్రక్రియ అయినా ఆయనవే. మాతృగీతాలు, జన్మభూమి కావ్యాలకర్త. ఆయన తనయే కృష్ణకుమారి.

'నాన్న నాకు ఎన్నో నేర్పారు. ఎలా రాయాలో, ఏం మాట్లాడాలో, నలుగురిలోనూ ఏ విధంగా మెలగాలో, ఎప్పుడు ప్రశ్నించాలో, ఏ రీతిన సమాధానం రాబట్టాలో నాన్నే నాకు నేర్పించారు, తీర్చిదిద్దారు' అని పలుమార్లు గుర్తు చేసుకునేవారామె. 'నా తొలి గురువు నాన్న' అంటుండేవారు.

ఆమె ఉన్నత స్థాయి చదువులు గుంటూరు, శ్రీకాకుళం ప్రాంతాల్లో కొనసాగాయి. డిగ్రీ చదువుతుండగానే చరిత్ర పుస్తకాన్ని వెలువరించారు. అప్పటికి తనకు 18 సంవత్సరాలే! విశిష్ట అంశం మరొకటి ఏమిటంటే – అప్పట్లో ఆ పుస్తకమే బడి పిల్లల పాఠ్య గ్రంథమైంది!

అధ్యాపక జీవితం మద్రాసు, హైదరాబాద్ నగరాల్లో. తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపకులపతి స్థాయికి ఎదిగినా, ఎంతగానో ఒదిగి ఉండేవారు. ఉత్తమ రచయిత్రిగా పురస్కారం స్వీకరించినా, రాష్ట్ర స్థాయిన సాహిత్య అకాడమీ బహుమతి విజేత అయినా, అన్నింటినీ మించి ఆనాడే గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతగా కీర్తి కిరీటం అందుకున్నా... సదా వినమ్రత కనబరచేవారు.

గృహలక్ష్మితోపాటు ఆంధ్ర మహిళ, జయశ్రీ, కిన్నెర వంటి పత్రికల్లో నాయని కృష్ణకుమారి రచనలనేకం ప్రచురితమయ్యాయి. 'ఆత్మకథ' రచన ప్రచురితమైనపుడు ఆ రచయిత్రి వయసు 23. అందులో వర్ణన: ఆవిడది సన్నగా, పొడుగ్గా ఉండే రూపం. తీర్చిదిద్దిన ముఖం. సన్నటి వాయిల్ చీరకట్టి, తలవెంట్రుకలను జారుముడి వేసుకుని ఉంది.

అదే కథాపరంపరలోని సంభాషణల శైలికి ఓ మచ్చుతునక : 'అన్నీ ఆలోచించే సమాధానం చెప్తున్నాను. నా కంఠంలో ప్రాణం ఉండగా; ఈ లోకమంతా ఏకమైనా నన్ను ఆ దౌర్భాగ్యుడికిచ్చి పెళ్లి చేయలేరు. నేను చచ్చిన తర్వాత నా శవానికి అతడిని కట్టాల్సిందే! ఇది మాత్రం నిజం, బాగా ఆలోచించి మాట్లాడుతున్నాను. నేను బాగా ఉండాలంటే ఈ సంబంధాన్ని ఒప్పుకోకండి. ఇప్పటికింకా మించి పోలేదు'– ఈ విధంగా కొనసాగుతుంది రచనాశైలి అంతా.



వాక్యరచనలో సూటిదనం, సన్నివేశ కల్పన / చిత్రీకరణలో సహజత్వం కృష్ణకుమారి నిపుణతకు తార్కాణాలు. ఎంత పెద్ద సంవిధానమైనా, ఎక్కడా వ్యర్థపదమంటూ కనిపించదు. పాత్రల ద్వారా ప్రశ్నింపచేసే తత్వమూ ఆ కథల్లో కనిపిస్తుంటుంది. ఇటువంటి శైలీ విన్యాసాలే చదువరుల అభిమానం చొరగొనేలా చేశాయి.

ఐకమత్యము పేరిట ఉన్న రచన మొత్తం సామెతలతో కొనసాగుతుంది.

లక్షాధికారైన లవణమన్నమె కాని....

మిరపగింజ చూడ మీద నల్లగ ఉండు... వంటివి.

వంట ఇంటి మూలలో ఉన్న కూరగాయల తట్టలోని మిరపకాయ బంగారు చెక్కపెట్టెలని లవణ స్వామి.

పక్కన కాగితంలో పెట్టిన చింతపండు.

ఇదే కథావిధానంలోని కొన్ని వాక్యాలు ప్రస్తుత సందర్భంలో ప్రస్తావించుకోవాల్సినవే. అంతగా ఆకట్టుకుంటాయవి.

నిద్రపోతున్న చింతపండు మహాశయుడు ఆవలిస్తూ లేచి, చేతులూ కాళ్లూ సవరించుకుని, 'మీలో

మాధురి

మీకెందుకు తగువులు?' అని సర్దబోయారు గాంధీజీ లాగ.

'అంతేలేండి...' అని సగం ఇష్టం, సగం అయిష్టం సూచిస్తున్న ధ్వనితో పులుసు వాక్యాలను నమర్థించబోయాడు నెహ్రూ పండితుడిలా కారం మహాశయుడు.

కానీ లవణస్వామి జయప్రకాశ్‌నారాయణ్ ఉద్ధతం పుణికిపుచ్చుకున్నాడాయె. ఊరుకుంటాడా? 'ఏం.... ఆ కారం.... ముందు నన్నెందుకు కదిలించాలీ' అని ప్రొటెస్ట్ చేశాడు.

అంతలో ఆ ఇంట్లోని ఆమె ఆ అన్నింటినీ (పదార్థాలు) కలిపి సాంబారు కాచడంతో, కమ్మదనం వ్యాపించిందనేది సారాంశం.

పులుసు, ఉప్పు, కారాలే సాంబారుగా రూపొంది నపుడు; సమైక్యత సాధించినపుడు... ఆ మధురత్వం స్వరాజ్యమెందుకు కాదూ – అని ముక్తాయించారు రచయిత్రి కృష్ణకుమారి.

ఈమె వేరొక కథానిక 'అభిమానాలు'. ఇందులోని విశేషణం: 'అతని నాభినుంచి బయలుదేరిన హసన తరంగమొకటి కెరటాలు కెరటాలుగా గొంతవరకూ కదిలివచ్చి, అక్కడ ఆగిపోగా.... ముఖం చలించి... అరుణమై... నవ్వును పుక్కిటపట్టినట్లు కలకలలా డింది!'

'నీలి గోరింట' పేరుతో రాసిన కథకు ముగింపు ఎంతో విభిన్నంగా గోచరిస్తుంది. అది : 'బయట రాజుకుంటున్న పిడకల పొగ ఆవిష్ణి చుట్టుముట్టగా, ఆ ఆకారం రేకులు కరుగుతున్న నీలి గోరింటలా ఉంది' అని!

ఇక; 'జానపద సాహిత్యము, సంస్కృతి' అనే – గ్రంథం కృష్ణకుమారి పరిశీలనాతృష్ణను, పరిశోధక పటిమను తేటతెల్లం చేస్తోంది. భారతీయ జానపద ఘనతలో ఇదొక అంతర్భాగం.

అలనాటి ఆ పెండ్లి కథల్లో భాగంగా సీతా కల్యాణాన్ని వివరిస్తూ ఇలా ప్రస్తావించారు రచయిత్రి (ఉదాహరణ పూర్వకంగా)

బంగారు పందిరీ బలుపుగా తీర్చీ
పచ్చలా పీటల్లు పందిట్ల పరిచీ
విరజాజి పువ్వులా వీవనలు తెచ్చీ
వింత వింతల మాలలెన్నో కైసేసీ
దూరాన ఎప్పరే వచ్చేటి వారూ?

పెండ్లి కొడుకు రామయ్యా.... పేరైన వాడూ!

ఆ కోవలోనే బాలపార్వతి అవతరణ గురించిన అభివర్ణన :

కన్నులు కలువ రేకులు బోలూ
కురులు తుమ్మెదల బారును బోలూ
చూపులు విరితూపులను బోలూ
మన్మథుని ముంజేతి చిలుక ఆ బాలా!
పరమేశ్వరుని అర్ధాంగి ఆ పడతి!!

'తెలుగు జానపద గేయగాథలు' సైతం కృష్ణకుమారి గ్రంథంలో అనేకంగా వెలుగు చూశాయి. ప్రచురణగా వెలువడి ఇప్పటికే ఐదున్నర దశాబ్దాలు! ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నది ఈ పుస్తకానికే. పరిశోధన రంగంలో తన ఘనతకు మూలకారకులు భర్త మధుసూదనరావు కావడంతో, గేయగాథల గ్రంథాన్ని ఆయనకే అంకితం చేశారు. అందులోనే తన కృతజ్ఞతాభావాన్ని చిరువాక్యాల్లో విస్తరించారు.

'పడి ఉన్న చోటు నుండి అణువైనా
అటూ ఇటూ తనంతట తానై తరలలేని
కందుక సదృశ మందప్రవృత్తి నాది' అన్నారు మొదట.

నన్ను పురికొల్పి రెచ్చగొట్టి
తిన్నగా పరిశోధనా సముద్రంలో ముంచేసి
తమాషా చూసిన నా భర్తకు నా ప్రాణానికి....

అంటూ దాంపత్య అనురాగ బంధాన్ని విభిన్న కోణంలో ఆవిష్కరించారు.

'జానపద సరస్వతి'గా పలువురి ప్రశంస లందుకున్న ఆమె అనువాద రంగంలో సైతం సుప్రసిద్ధ, బహుభాషా నైపుణ్యాన్ని మెండుగా కనబరిచారు.

'పదవాజ్మయంలో పిల్లల ప్రసక్తి'ని ప్రత్యేకించి గుర్తు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందిప్పుడు.

ఆమె దృష్టిలో, అభివ్యక్తిలో....

తన బిడ్డ గురించి తెలిపేందుకే స్త్రీ నోరు విప్పి పాడుతుంది.

మాతృకర్తృక పదాలు, పాటలు, కీర్తనలే ఎక్కువ.

గానం లేనివి, వచన రూపంలోనివీ వనితలు సృజించినవే!

పిల్లల కోసం పడతి తపస్సు వర్ణనకు అతీతం.

రుద్రాక్ష మీద భద్రాక్ష
భద్రాక్ష మీద పోకచెక్క
పోకచెక్క మీద సన్న సూది

సన్న సూది మీద శిరస్సు కిందికీ, సిరిపాదం మీదికీ...అనేంతగా!

మరి– బిడ్డకళ్లు కలువపూలైతే? వాటి నుంచి జారే కన్నీరు....

అమ్మణ్ణి కన్నుల్లు తమ్మి పువ్వుల్లు
తమ్మి పువ్వులు తేర్చు కమ్మ తేనెల్లు
చిన్నారి కళ్లలో కన్నీటి జల్లు
కన్నీరు చూపకే కరగు నెదదల్లు
చక్కన్ని నా తల్లి గుక్క పట్టింది
చెక్కుటద్దాలలో చెదిరెనే సంజ!

ఇంతటి ప్రేమాదరాల తల్లిని విశదీకరిస్తూ, జానపద గేయ సాహితిని, విపులీకరిస్తూ, నాయని కృష్ణకుమారి చేసిన పరిశీలన, పరిశోధనలు రచనా రంగాన్ని సుసంపన్నం చేశాయి.

తెలుగు భాషా చరిత్రను గ్రంథస్తం చేసిన ప్రసిద్ధత ఆమెది. దీపకళిక అనే ఆమె పుస్తకం పేరు వ్యక్తిపరంగానూ ఆమెకే వర్తిస్తుంది! విశేష కృషికి మారు పేరు, విశిష్టసేవకు మరో పేరూ కృష్ణకుమారి. రచనల పరంపరలే ఇందుకు అక్షర సాక్ష్యాలు.

జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

వెలనాడు యుద్ధంలో కాకతీయసైన్యం విజయం సాధించిన వార్తలు వార్తాహరుల ద్వారా ఒకటొకటిగా తెలియ వస్తున్నాయి. వచ్చిన వార్తాహారుడి వద్దకు గణపతి వేగంగా దూకి భుజాలు పట్టుకుని కుదిపివేస్తూ "ఊ.. చెప్పు. ఏమిటి వార్త?" అని అడిగాడు.

"ద్వీపరాజ్య రాజధాని తలగడదీవి కోటలో అఖండమైన భాండాగారం ఉన్నదట ప్రభూ! లెక్కపెట్టలేనన్ని వజ్ర వైఢూర్యాలు, బంగారు వెండి నాణాలు, నగలు, బంగారు అచ్చులు.. అబ్బో! వాటిని అనుమకొండకు తరలించడానికి వంద మత్తగజాలు సరిపోవట ప్రభూ.." చెబుతూ లేఖను రెండు చేతులతో ఆయన వైపు చాపాడు.

చౌండసేనాని పంపిన లేఖ చదవకుండానే వార్తాహరుడే మొత్తం అంశం వివరించేశాడు.

మళ్లీ గణపతిదేవునిలో గంతులు మొదలు. ఆయన సంతోషాలు, ఉద్వేగాలు, ఉత్సాహాలు.. ఇంతింత అని చెప్పడానికి లేదు. సైన్యం మొత్తం తిరిగి అనుమకొండ చేరేవరకు చిన్నపిల్లాడిలా పరవశిస్తూనే ఉన్నాడు. విజయులై తిరిగి వచ్చిన సర్వ సైన్యాధ్యక్షుడు చౌండసేనాని, శూన్యపాలకుడు.. ఇతర సైనిక ప్రముఖులతో ఆట పాటలు మొదలు..

చౌండసేనానికి 'ద్వీపలూటకార' బిరుదు ప్రదానం చేసి మిగిలిన మహాయోధులను కూడా సముచితంగా సన్మానించి మండలాలు, మడిమాన్యాలు బహుమతులుగా అందించి గౌరవించి తనను తాను గౌరవించుకున్నాడు.

కాకతీయ మహాయోధులు రుద్రదేవుడు, మహాదేవుడు వెనువెంటనే మరణించడం, యువరాజు గణపతిదేవుడు బందీ కావడంతో కాకతీయ వంశ పాలనపై నీలినీడలు కమ్ముకున్నాయి. కానీ రుద్ర సేనాని, వెల్లంకి గంగాధరుడు లాంటి నమ్మినబంట్లు పట్టుసడలని పోరాటంతో కాకతీయ వంశాన్ని కాపాడి గణపతిదేవుని సింహాసనంపై నిలిపి తిరిగి కాకతీయ కేతనాన్ని రెపరెపలాడించారు.

కాకతీయవంశ పాలన తిరిగి నిలదొక్కుకున్నాక కాకతీయ గణపతిదేవుడు తొలి యత్నంలోనే వెలనాడును జయించడం తెలుగు రాజ్యాల చరిత్రలోనే మహోన్నత ఘట్టం. అది కాకతీయులకు మరింత గొప్ప నంగతి. కారణం... వెలనాడును జయించాలని మూడు నాలుగు తరాలుగా కాకతీయులు చేయని ప్రయత్నం లేదు. గతంలో గణపతిదేవుని తాత రెండవ ప్రోలరాజు వెలనాడును జయించాలని వెళ్లి వెలనాడు సామంతుడు కోట చోడోదయ మహారాజు చేతిలో మరణించాడు. గణవతి పెదనాన్న రుద్రదేవుడు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. పల్నాడు యుద్ధంలో పాల్గొన్నాడు కానీ వెలనాడులో తిమ్మ వేయలేక పోయాడు.

ఇప్పుడు గణపతిదేవుడు వెలనాడును సాధించి తన రాజ్యంలో కలిపేసుకోవడం.. ఇది చిన్నగెలుపు.. సాధారణ విజయం కాదు. ఓ మహోద్భుతం.. ఓ సామ్రాజ్య స్థాపనకు పునాది.

అక్కడి నుండి గణపతిదేవుని జైత్రయాత్ర మొదలయ్యింది.

గణపతి వెలనాడు జయించినా పాలకుడు పృథ్వీశ్వరుడు తప్పించుకుని పారిపోయి శ్రీకూర్మం చేరాడు. అక్కడి నుండి వెలనాడును తిరిగి జయించడానికి ఆతడు చేయని ప్రయత్నం లేదు. కొందరు సామంతులను కూడగట్టి తిరిగి గణపతిదేవునిపై యుద్ధం ప్రకటించాడు. గణపతి కూడా అనేక మంది చిన్నచిన్న రాజులను సామంతులుగా చేసుకుని బలిష్టుడయ్యాడు. తిరిగి ఆరేళ్లకు పిఠాపురం వద్ద జరిగిన యుద్ధంలో గణపతిదేవుడు స్వయంగా పాల్గొని పృథ్వీశ్వరుడిని చంపి అతని తలతో కందుక క్రీడ ఆడి తన కసి తీర్చుకున్నాడు.

ఈ గెలుపు గణపతిదేవునికి మరో వివాహానికి దారి తీసింది.

పృథ్వీశ్వరుడు పారిపోగా కాకతీయ సైన్యం అతని బంధువు, సామంతుడు అయిన ద్వీపరాజ్య పాలకుడు పినచోడుని ఓడించి అతని వద్దనున్న వెలనాడు ధనాగారాన్ని స్వాధీనం చేసుకుని తిరిగి పినచోడునే వెలనాడు పాలకుడుగా కాకతీయ సామంతునిగా ప్రకటించారు. ఆ యుద్ధంలో సర్వ సైన్యాధ్యక్షునిగా ఉన్న మల్యాల చౌండసేనాని పినచోడుని ఇద్దరు కుమార్తెలను అనుమకొండ తరలించి రాజ ప్రాసాదంలో గౌరవ బందీలుగా ఉంచాడు. అప్పుడే వాళ్ల తమ్ముడు చిన్నారి జాయచోడుడు ఎవ్వరికి చెప్పకుండా అక్కల బండి వెంటపడి అనుమకొండ వచ్చేశాడు. అక్కడ నానా అగచాట్లుపడి బతుకుతూ.. పిఠాపురం యుద్ధంలో పాల్గొని గణపతిదేవుడు, పృథ్వీశ్వరుడు ఎదురెదురయినప్పుడు గణపతికి ఖడ్గం అందించి శత్రువు తల తుంచడానికి సహాయపడ్డాడు.

యుద్ధానంతరం పినచోడుని కుటుంబానికి జరిగిన అన్యాయం గణపతి దేవునికి పూర్తిగా తెలిసింది. పినచోడుని కుమార్తెలు బందీలుగా ఉండటం, కొడుకు జాయపుడు అదే అనుమకొండలో ఆరేళ్లుగా అనాథగా బతకడం అతన్ని తీవ్రంగా కలసివేసింది. ప్రాయశ్చిత్తంగా గణపతిదేవుడు ఆ ఇద్దరు అమ్మాయిలను వివాహమాడాడు. అందుకు భార్య సోమలదేవి అనుమతి తీసుకోలేదు కాని తండ్రులస్థాయి గురువులయిన రుద్రసేనాని, వెల్లంకి గంగాధరుని ఆమోదం తీసుకున్నాడు.

అల్లునిగా ద్వీపరాజ్య రాజధాని తలగడదీవి కోటలో ఉండగా మరో యుద్ధానికి సిద్ధం కావాల్సివచ్చింది. విక్రమ సింహపురి రాజ్యాలపై

గణపతిదేవుడు

20

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

చోళప్రభువు కులోత్తుంగ చోళుడు దాడి చేసి ఆక్రమించుకున్నాడు. మహారాజు మనుమసిద్ధిని బందీని చేశాడు. ఇది మహామంత్రి తిక్కన నెల్లూరులో లేని సమయంలో జరిగింది.

తెలుగుప్రజల అన్ని సమస్యలూ తిక్కనా మాత్యునివే. మొదటగా చోళసామ్రాజ్యానికి కప్పాలు కట్టే చోడ రాజ్య పాలకులతో మంతనాలు జరిపి కప్పాలు, అంగీకరించిన పన్నులు వగైరా ఆపు చేశాడు. తర్వాతి దశలో చోడ అనే పేరుకు ముందు తెలుగు అనే పదం చేర్పించి పూర్తి తెలుగుజాతి రాజ్యాలుగా తెలుగు చోళ రాజ్యాలుగా వాటిని మార్చేశాడు. చోడ సామంతరాజ్యాలు అనే మచ్చను పూర్తిగా రూపు మాపాడు. మూడవ దశలో తెలుగు చోడ రాజ్యాలను ఏకీకృతం చేసి కాకతీయరాజ్యానికి సామంతులుగా మార్చడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాడు.

ఆయన కందవోలులో తెలుగురాజ్యపు ఆవశ్యకతపై ఆ రాజ్యపు సమయ సెట్టిలతో సమావేశమై ఉన్నాడు.

మనుమసిద్ధి కుమారుడు అక్కడికి వచ్చి జరిగింది వివరించాడు. హతాశుడైన తిక్కన వెనువెంటనే తలగడదీవి కోటలో ఉన్న గణపతిదేవుని కలిసి తన మాటగా సహాయం అందించవలసినది అని ప్రార్థించమన్నాడు.

వెంటనే తిక్కన కుమారుడు తలగడదీవి వెళ్లి జరిగిన సంగతి గణపతిదేవునికి విన్నవించి తిక్కనా మాత్యుని అభ్యర్థన కూడా తెలియజేశాడు.

వెనువెంటనే స్పందించి బావమరిది జాయచోడుని తోడు తీసుకుని దగ్గరలో ఉన్న సామంతుల సైన్యాన్ని సమాయత్తపరచి స్వయంగా సైన్యానికి నాయకత్వం వహించి కదిలాడు గణపతిదేవుడు.

అంత త్వరగా సైన్యంతో కదలి నెల్లూరు వచ్చి తన సహాయాన్ని ప్రకటించిన గణపతిదేవుని చూసి తిక్కనామాత్యుడు కృతజ్ఞతతో పొంగిపోయాడు. సజల నయనాలతో ఆయనకు ఆతిథ్యం ఇచ్చాడు. తిక్కన మంత్రి బృందంతో తీవ్రమైన మంత్రాంగం జరిగింది. భవిష్యత్ యుద్ధ తంత్రాన్ని రూపొందించారు.

* * *

తంజావూరు రాజప్రాసాదం సభ నిర్వహిస్తోన్న చోళ చక్రవర్తి కులోత్తుంగ చోళుని ముందు వినయంగా వంగి నమస్కరించాడు నెల్లూరు రాజ్యపు సంధివిగ్రహి ముప్పలప్రగ్గడ. తాను నెల్లూరు నుండి వచ్చానని విక్రమసింహపురి రాజ్యవారసులు మనుమసిద్ధి మహారాజులకు సంఘీభావంగా కాకతీయ మహామండలేశ్వరులు శ్రీశ్రీశ్రీ గణపతిదేవమహారాజులు ససైన్యంగా నెల్లూరు వచ్చి ఉన్నారని.. వారు పంపిన ఈ లేఖను అందుకుని సమాధానం ఇవ్వవలసిందిగా కోరాడు.

ఆయన సహాయకులు లేఖ అందుకుని ఆయనకు చదివి వినిపించాడు.

"చోళ మహారాజ్య పాలకులు శ్రీశ్రీశ్రీ కులోత్తుంగ చోళ చక్రవర్తులకు వినమ్ర నమస్సులు.

యుద్ధ ధర్మాలకు విఘాతం కలిగించి కొందరు తిక్కన వంశ ద్రోహులద్వారా మహారాజు మనుమసిద్ధి రాజ్యాన్ని ఆక్రమించిన మిమ్మల్ని గొప్ప చరిత్ర కలిగిన చోళసమ్రాట్టుగా గౌరవించలేక పోతున్నాము. మనుమసిద్ధి మహారాజులవారికి సర్వకాల సర్వావస్థలలో ఈ కాకతీయ మహామండలేశ్వరుడు గణపతిదేవుడు ఉన్నాడని తమరికి తెలియజేస్తున్నాము. తక్షణం విక్రమసింహపురి రాజ్యాన్ని మనుమసిద్ధి మహారాజులవారికి స్వాధీనపరచవలసినదిగా హెచ్చరిస్తున్నాము. ప్రాచీన తొండమనాడు రాజ్య ప్రాంతంలో తెలుగు మాట్లాడే ప్రజలున్న రాజ్యమంతా మాకు స్వాధీనం చేయాల్సి ఉంది. అది మా హక్కు. లేనినాడు ఎలా స్వాధీనం చేసుకుంటామో తమరు ప్రత్యక్షంగా చూడగలరు. ఇది మా హెచ్చరిక!!"

లేఖ చదివి కోపంతో పళ్లు కొరికాడు కాని చివరి వాక్యాలతో ఆలోచనలో పడ్డాడు కులోత్తుంగుడు.

తెలుగు మాట్లాడే ప్రాంతమా??

సంధివిగ్రహి ద్వారా పంపిన లేఖలో గణపతిదేవుడు తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ మాకు కావాలి అని పేర్కొనడం చోళమహారాజు కులోత్తుంగుని ఆలోచనలో పడవేచింది.

అంతేకాదు. అదే అతని ఆలోచనలను తల కిందులు చేసింది. నిజానికి వెలనాడు వరకు చోళ సామ్రాజ్యంలో కలుపుకుని తమిళభాషా రాజ్యంగా చేయాలని అతని లోలోపలి ఆలోచన.

ఇది గణపతిదేవునికి తెలిసిందా?! తెలుగు భాషారాజ్యమనే పదాన్ని ఆయన ఎలా పేర్కొన్నాడు??

చోడరాజులు ఇటీవల తెలుగుచోడరాజులుగా ప్రకటించుకుంటున్నారని వేగుల సమాచారం. ఇప్పటికే వాళ్లు తమకు కప్పాలు కట్టడం తగ్గించారు కూడా.

తెలుగురాజ్యాలలోకి చొచ్చుకుపోవాలంటే ముందు నెల్లూరు స్వాధీనం కావాలి. మనుమసిద్ధి దాయాదులైన నల్లసిద్ధి, తమ్మసిద్ధి తనకు సహాయ పడడానికి సిద్ధంగా ఉన్నారు. వారి సహాయంతో రాత్రికి రాత్రి మెరుపు దాడి చేయించాడు. విజయవంతమయ్యాడు.

నెల్లూరుకు కాకతీయ మహారాజు గణపతిదేవుడు సహాయంగా నిలబడతాడని సమాచారం ఉన్నా కాని ఇంత తక్కువ సమయంలో ఇంత వేగంగా గణపతిదేవుడు ససైన్యంగా నెల్లూరు వస్తాడని ఊహించలేదు.

తన మందిరంలో అటూ ఇటూ తిరుగుతూ తీవ్రంగా ఘర్షణ పడుతున్నాడు కులోత్తుంగచోళుడు. మౌనంగా నిలబడి చూస్తున్నాడు నెల్లూరు నుండి వచ్చిన సంధి విగ్రహి ముప్పలప్రగ్గడ.

అప్పుడే వేగంగా లోపలికి వచ్చాడు చోళ సామ్రాజ్య గూఢచారి అభిరామయ.

"క్షమించండి మహాప్రభూ. నెల్లూరు రాజ్యానికి సహాయంగా వెళుతున్న మన సైన్యంపై కాకతీయ సైన్యం దాడి చేసింది. యుద్ధం తీవ్రంగా జరుగుతోందని తెలియవచ్చింది. మన పరిస్థితి.. ఏమిబాగో.."

చేతిలోని గణపతిదేవుని లేఖను విసిరికొట్టి

మత్తి భానుమూర్తి

వికృతంగా గావుకేకలు పెట్టాడు చోళుడు.

"ఎలా జరిగిందిది?? ఆ కాకతీయుడు నెల్లూరు లోనే ఉన్నాడని చెప్పావు కదా. ఎవరు మన సైన్యాన్ని ఎదుర్కొన్నది??"

"గొప్ప పన్నాగం ప్రభూ. సైన్యం రెండుగా చీలి ఒక పటాలం నెల్లూరులో ఉండగా మరో పటాలం గణపతిదేవుని బావమరిది.. జాయచోడుడట. అతని నేతృత్వంలో కంచి పైకి వచ్చింది. ఆ విషయం మనకు తెలియకుండా ఈ సంధి విగ్రహితో రాయబారం పంపాడు గణపతిదేవ మహారాజు.."

చోళుడు మళ్లా పెదబొబ్బలు పెడుతుండగా ఆయనకు వినయంగా నమస్కరించి బయటకు కదిలాడు సంది విగ్రహి ముప్పలప్రగ్గడ.

అతడు నిష్క్రమిస్తూ చోళగూడచారిని అభినందనగా చూస్తూ వెళ్లడం ఆవేశంతో ఆవేదనతో రొప్పుతున్న కులోత్తుని కంటపడింది.

ముప్పలప్రగ్గడ వెళ్లగానే అరిచాడు చోళుడు, "నువ్వు.. నువ్వు.. తెలుగువాడివి కదూ??"

అతని జవాబు వినకుండానే.. జవాబు తెలిసినట్లు.. పూర్తిగా ఓటమిని గుర్తించినట్లు మళ్లీ

పట్టాభిషేకానంతరం తిక్కనతో పాటు గణపతి దేవునికి కూడా సాష్టాంగ ప్రణామాలు చేశాడు మనుమసిద్ధి.

"అయ్యయ్యో.. తమరు నాకంటే వయస్సులో పెద్దవారు. ఇది తగదు.." అంటూ గణపతిదేవుడు వారించినా వినలేదు మనుమసిద్ధి.

"మీకు ఏమిచ్చి మీ రుణం తీర్చుకోగలను.. సాష్టాంగ ప్రణామాలుతప్ప.."

అవకాశాన్ని వదులుకోలేదు గణపతిదేవుడు.

"స్థాపించబోయే తెలుగు సామ్రాజ్యానికి మీరు తొలి తెలుగు సామంత మహారాజులు. ఇక్కడ మీరు తెలుగు భాషవైపు కోటలా నిలబడితే తెలుగు సామ్రాజ్య స్థాపన ఎంతసేపూ..?!"

చాలా తేలిక అన్నట్లు చెబుతూ మనుమసిద్ధిని మరింత కర్తవ్యముఖుడ్ని చేశాడు గణపతిదేవుడు.

"ఇక్కడ మా పక్కన తిక్కనమామ ఉండగా మాకేమీ భయం? మీరు కోరినట్లు దక్షిణ భాగానికి మేము అండగా నిలబడతాం." అన్నాడు మనుమసిద్ధి.

"అటు తమిళం వైపు చివరి గ్రామం ఏవిటి.. ఇటు కన్నడం వైపు చివరి గ్రామ ఏవిటి.. అనే సరి గ్రామం వరకు మనం హద్దులు నిర్ణయించుకుని సాధించుకోవాలి.."

"శుభం. నా అభిప్రాయం కూడా అదే. ఆ ఆఖరి గ్రామం ఏదో నేను పరిశీలించి తెలుసుకుంటాను. మీరు నిశ్చింతగా అనుమకొండ వెళ్లి సత్పరిపాలన అందించండి మహాప్రభూ.. శుభం భూయాత్.." అన్నాడు తిక్కనార్యుడు ఆశీర్వదిస్తూ.

గణపతిదేవుడు, బావమరిది జాయచోడునితో తిరిగి తలగడదీవి చేరారు.

తెలుగు భాషారాజ్యం కోసం దక్షిణాది వైపున్న పరిస్థితులను.. పాలకులైన చోళరాజుల శక్తియుక్తులను ఆకళింపు చేసుకున్నాక ఇతర దిక్కులవైపు దృష్టి సారించాడు గణపతిదేవుడు. పడమర కన్నడ భాషా రాజ్యాలున్నాయి. అందులో బలిష్టుడు బల్లాలదేవుడు. ద్వారసముద్రం రాజధానిగా శత్రువు కన్నెత్తి చూడలేనట్లు శత్రుభీకరుడుగా పాలన సాగిస్తున్నాడు. కాని గణపతిదేవుడంటే అతనికి పుత్రవాత్సల్యం.

కారాగారంలో బంధించిన జైత్రపాలుని మెప్పించి కాకతీయ సింహాసనంపై గణపతిదేవుని తిరిగి ప్రతిష్టించినవాడాయన. గణపతిదేవుని విడిచి పుచ్చడమే కాదు పుత్రికనిచ్చి కాళ్లు కడిగి కన్యాదానం చేశాడంటే ఆ ప్రతిభ.

బల్లాలదేవునిదే. కాబట్టి పడమర నుండి తెలుగు గ్రామాలు, కన్నడ గ్రామాలు అనే విభజనకు ఎలాంటి అడ్డంకులు ఉండవు.

ఈశాన్యప్రాంతంలో కళింగులతోనూ వాయవ్యంలో యాదవులతోనూ పోరాటాలు తప్పక పోవచ్చు. మామగారి రాజ్యమే అయినా తరచి చూస్తే దేవగిరి శత్రురాజ్యమేనని గణపతిదేవుని ఊహ. ఇప్పటికిప్పుడు శత్రు భావనలు లేవు కానీ అతడెందుకో సింఘణదేవుని నమ్మలేకపోతున్నాడు. బావమరిదిగా కలసినప్పుడు ఆప్యాయంగా హత్తుకుని సకల గౌరవమర్యాదలు సమున్నతంగా జరిపిస్తాడు అయినా ఎక్కడో అపనమ్మకం. అందుకు కారణం కవ్వల కావచ్చు.

మిగిలింది ఈశాన్యంలోని కళింగరాజ్యం. ఎలాంటి మిత్రత్వం, బంధుత్వం లేదు. ఉన్నది కేవలనీ భాషా బంధుత్వం. లేదా భాషా శతృత్వం మాత్రమే.

అద్భుత ప్రతిభ, యుద్ధ నైపుణ్యాలు కలిగిన బావమరిది జాయచోడుడు ఇప్పుడు గణపతిదేవునికి అత్యంత ఆత్మీయుడు. కాకతీయ కొలువులోని మహా మహావీరులు, మంత్రాంగవేత్తలు అందరూ గణపతి దేవుని కంటే చాలా పెద్దవారు. కాబట్టి వారితో ఆత్మీయత అనురాగం ఉండొచ్చు కాని స్నేహం తక్కువ. సమ వయస్కుల మధ్య ఉండే స్నేహాన్ని ఆయన జాయవుని వద్ద చూస్తున్నాడు. తనకంటే పదేళ్లు చిన్నవాడయిన జాయవుని నాట్య ప్రతిభ, యుద్ధ కౌశలం గణపతిని బాగా ఆకట్టుకున్నాయి. జాయవునితో పాటు మరో ఇద్దరు యువవీరులను జత చేశాడు.

హాహాకారాలు చేయసాగాడు కులోత్తుంగచోళుడు.. మూడవ కులోత్తుంగుడు.. చిట్టచివరి చోళచక్రవర్తి!!

* * *

"ఇది చరిత్రలో తొలి భాషా యుద్ధం.. తెలుగు భాషా యుద్ధం.." ప్రకటించాడు గణపతిదేవుడు.

గణపతిదేవుని సమక్షంలో తిరిగి మనుమసిద్ధిని విక్రమసింహపురి రాజ్యానికి మహారాజుగా పట్టాభిషేకం సశాస్త్రీయంగా నిర్వహించాడు తిక్కనామాత్యుడు.

అంతకు ముందు కాకతీయ వీరయోధులు నెల్లూరు కోటలో వారి యోధుల సహాయంతో చోళని సహాయంతో మహారాజులుగా, చోళసామంతులుగా కులుకుతున్న నల్లసిద్ధి, తమ్మసిద్ధిలను వెదికి వెదికి వేటాడి ముక్కలు ముక్కలుగా నరికిచంపి వారి శిరస్సులను నెల్లూరుకోటకు వేలాడదీశారు. సహాయంగా వస్తామన్న చోళ సైన్యం ఎందుకు రాలేదో..! ఎవరు రాకుండా అడ్డుకున్నారో! తెలిసేలోగా అత్యంత కిరాతకంగా నరికివేయబడ్డారు.

హద్దులను మనం నిర్ణయించుకోవాలి. ఆ అంచుల లోని గ్రామాల వివరాలు సేకరించి మీకు అంద జేస్తాను ప్రభూ.." అన్నాడు మనుమసిద్ధి.

"రానురానూ కులోత్తుంగ చోళుడు బలహీన పడుతున్నాడు. అతనికి మరో చోళ వారసుడు.. మూడవ రాజరాజు చోళుని నుండి అంతర్గతంగా తీవ్ర వ్యతిరేకత ఉంది. ఆయనకు మంత్రులు, సామంతులు, సైనిక వర్గాలు కూడా సహకరించడం లేదు. పాండ్యులు రాను రానూ బలపడుతున్నారు. పాండ్యరాజు జటావర్మన్ కులశేఖర గట్టివాడు. ఘటనాఘటన సమర్థుడు. విక్రమసింహపురిని సాధించాలని ఆయన కూడా పట్టుదలగానే ఉన్నాడు. అది తెలిసి చోళుడు ముందుగా దాడి చేసి పరాభవం పాలయ్యాడు. అది పాండ్యునికి సహజంగా ఆనందమే కదా! ఆయన మనుమసిద్ధి మహారాజులకు అభినందనలు తెలియజేశాడు ప్రభూ.."

"మంచిది. మనకు ఎవ్వరూ మిత్రులూ కాదు.. శత్రువులు కాదు. మన తెలుగు భాష మాట్లాడే ఆఖరి

అద్భుత ప్రతిభ, యుద్ధ నైపుణ్యాలు కలిగిన బావమరిది జాయచోడుడు ఇప్పుడు గణపతిదేవునికి అత్యంత ఆత్మీయుడు. కాకతీయ కొలువులోని మహా మహావీరులు, మంత్రాంగవేత్తలు అందరూ గణపతి దేవుని కంటే చాలా పెద్దవారు. కాబట్టి వారితో ఆత్మీయత అనురాగం ఉండొచ్చు కాని స్నేహం తక్కువ. సమ వయస్కుల మధ్య ఉండే స్నేహాన్ని ఆయన జాయవుని వద్ద చూస్తున్నాడు. తనకంటే పదేళ్లు చిన్నవాడయిన జాయవుని నాట్య ప్రతిభ, యుద్ధ కౌశలం గణపతిని బాగా ఆకట్టుకున్నాయి.

జాయవునితో పాటు మరో ఇద్దరు యువవీరులను

జత చేశాడు.

"యుద్ధమో, స్నేహమో చేస్తూ వారి శక్తియుక్తులు గమనించండి. వాళ్లంతా మనరాజ్యంలోని సామంత మండలేశ్వరులు కావాలి కాని శత్రువులు కారు. బహుశా మన శత్రువు కళింగ మహారాజు కావచ్చు. ఎందుకంటే మన తెలుగురాజ్యాలను తన రాజ్యానికి సామంతులుగా ఉంచుకున్నాడు కాబట్టి. మనం మన తెలుగుభాషా రాజ్యాన్ని స్థాపించాలంటే కాళింగుని జాగ్రత్తగా గమనించాలి. ఏయే రాజ్యాలను ఆయన తన చెప్పుచేతలలో ఉంచుకున్నాడో పరిశీలించండి."

హితబోధ చేసి ఆ ముగ్గురిని ఈశాన్య రాజ్యాల పైకి పంపాడు. వాళ్లు తిరిగి వచ్చేవరకు తలగడదీవిలోనే అత్తవారింట ఉన్నాడు. మరో ఏడాదికి వాళ్లు ముగ్గురూ తిరిగి తలగడదీవి చేరారు. అప్పటికి గణపతిదేవునికి ఇద్దరు భార్యల ద్వారా ఇద్దరు మగపిల్లలు పుట్టారు. అయితే

ఒక భార్య పేరాంబ పురిటిలోనే మరణించింది. రెండవ భార్య నారాంబను, ఇద్దరు పిల్లలను, బావమరిది జాయచోడుని కలువుకుని తిరిగి అనుమకొండ రాజప్రాసాదానికి చేరాడు గణపతిదేవుడు.

* * *

రాజప్రాసాదం.. అనుమకొండ.

అంతఃపురంలో తన పడక గదిలోకి ప్రవేశించి తెల్లబోయాడు గణపతిదేవుడు.

అది పూర్తిగా పాడుబడి ఉంది. బూజుపట్టి.. గబ్బిలాలో మరేదో పురుగులు లాంటివి ఎగురుతున్నాయి.. పాకుతున్నాయి. కదలాడుతున్నాయి. ద్వారానివే వేలాడుతున్న చీనీపట్టు వస్త్రాలు గబ్బు పట్టి ఉన్నాయి. దూరానికే ముతకవాసన వేస్తున్నాయి. కింద కశ్మీరు తివాసీలు తడిసి ఎండి బిర్రబిగదీసుకుని ఉన్నాయి.

వాటిపై ఎలుకలు పరుగులు పెడుతున్నాయి.

భరించలేనట్లు చివ్వున తిరిగి బయటకు వచ్చేశాడు.

సాధారణంగా గణపతిదేవుడు అంతఃపురంలోని తన ఏకాంత మందిరాలు.. అంటే పడకగదిలాంటి లోలోపలి గదుల్లోకి వెళ్లేముందు పరిచారికలను, అంగరక్షకులను, ప్రతీహారి లాంటి లోపలి రక్షణ వలయాన్ని కూడా తొలి అంచెలోనే దూరం పెట్టేస్తాడు. పూర్తి ఒంటరిగా లోపలికి వెళతాడు.

అలాంటిది చివ్వున బయటకు వచ్చి క్రోధంతో జేవురించిన ముఖంతో గట్టిగా అరిచాడు..

"ప్రతీహారీ.. ఎవరు.. పరిచారికలు ఏరి.. ఎక్కడ చచ్చారు..??"

ఆయన అరుపులు దూరంగా ఎక్కడో మొదటి ద్వారం వద్ద నిలబడిపోయిన ప్రతిహారికి, పరిచారికలకు వినపడింది. అందరూ పరుగు పరుగున వచ్చారు. ఆయనను వాళ్లెవరూ ఎప్పుడూ అలా

సాధారణంగా గణపతిదేవుడు అంతఃపురంలోని తన ఏకాంత మందిరాలు.. అంటే పడకగదిలాంటి లోలోపలి గదుల్లోని వెళ్లేముందు పరిచారికలను, అంగరక్షకులను, ప్రతీహారి లాంటి లోపలి రక్షణ వలయాన్ని కూడా తొలి అంచెలోనే దూరం పెట్టేస్తాడు. పూర్తి ఒంటరిగా లోపలికి వెళతాడు.

అలాంటిది చివ్వున బయటకు వచ్చి క్రోధంతో జేవురించిన ముఖంతో గట్టిగా అరిచాడు..

చూసినవారు కాదు.

చేతులు కట్టుకుని బిక్కచచ్చిన ముఖాలతో వణుకుతూ తలలు వాల్చి నిలుచున్నారు.

"ఏవిటిది.. శయన మందిరాన్ని అలా నరక ప్రాయంగా వదలివేసింది ఎవరు??" గర్జించాడు.

ఎవ్వరూ జవాబివ్వడానికి ముందుకు రాలేదు. మళ్లీ గర్జించాడు. "చెప్పండి. ఏమి జరిగింది??"

నపునీసకుడైన ప్రతీహారి కాస్త తలెత్తి జవాబిచ్చాడు. "క్షమించాలి ప్రభూ.. ఎవ్వరిని శయన మందిరంలోకి వెళ్లవద్దని మహారాణి అమ్మగారి ఆజ్ఞ. శుభ్రం చేయవద్దని.. కనీసం ఊడ్చవద్దని తీవ్రంగా హెచ్చరించారు.."

అర్థమైంది గణపతిదేవునికి. ఇది సోమలదేవి నిర్వాకం.

కోటలోకి ప్రవేశించగానే వాకబు చేశాడు. ఆమె అసలు కోటలోనే లేదు. దేవగిరి వెళ్లిందట. పితాపుర యుద్ధం నుండి వెలనాడు రాజధాని ధనదుపురం వెళ్లడం.. అక్కడే పినచోడుని కుమార్తెలను వివాహం చేసుకోవడం.. ఆనక కంచియుద్ధం.. తర్వాత నారానీ, పేరంబ గర్భవతులై ఇద్దరూ మగపిల్లలను కనడం, కాన్పులోనే పేరాంబ మరణించడం.. ఇవన్నీ ఎప్పటికప్పుడు అనుమకొండలోని మహాప్రధానికి.. అదే సమయంలో సోమలదేవికి కూడా వార్తాహరుల ద్వారా తెలియపరుస్తూనే ఉన్నాడు.

సోమల మనస్తత్వం తెలిసిన భర్తగా తాను తలగడదీవిలో ఉన్నప్పుడు ఆమె కదలికలపై నిఘా వద్దన్నాడు.

అయితే సోమల ఎప్పుడూ తల్లితో మాటామంతీ నిర్వహిస్తూనే ఉంటుంది. ఇటీవల గణపతిదేవుని తల్లులు ఇద్దరూ మరణించాక, రెండో సంతానంగా బాబు పుట్టాక ఆమె పుట్టింటివారితో రాసుకుపూసుకు తిరుగడం మరింత ఎక్కువైంది. ఆమె తల్లి చిల్లాదేవి ఆరోగ్యం కూడా ఏమీ బావుండటం లేదని విన్నాడు.

స్త్రీగా సోమల సవతులను అంగీకరించలేని తత్వాన్ని గుర్తించినా ఆమె అతి ప్రవర్తన తెలిసిన గణపతిదేవుడు భయపడుతూనే వచ్చాడు. తమ శయన మందిరాన్ని వల్లకాడుగా భర్తకు చూపడమే ఆమె విజయం కావచ్చు. పెళ్లయిన నాటి నుండి ఆమె పొందే బీభత్స ఆనందాన్ని మౌనంగా భరించడం గణపతి వ్యక్తిగత జీవిత విజయం.

ఈసారి కూడా అలాగే ఆమె ఆనందాన్ని ఎందుకు కాదనాలి?! అనుకుని శయన మందిరాన్ని శుభ్రపరచమని పరిచారికలకు పురమాయించాడు.

తర్వాత సోమల దేవగిరినుండి వచ్చేలోగా అంతఃపురాన్ని రెండు భాగాలు చేసి రెండు వేరు వేరు ద్వారాలు ఏర్పాటు చేయించాడు. అందులో మొదటి ప్రాధాన్యం సోమలకే ఇచ్చి పక్క అంతఃపురాన్ని నారానీకు కేటాయించాడు. తన అంతఃపురాన్ని చూసుకుని మురిసిపోయింది నారాంబ. కారణం ఆమె గౌరవబందీగా ఆరేళ్లున్న అదే కోటలో ఇప్పుడు ఆమె ఓ మహారాణి.

రెండు అంతఃపురాలను చూసుకుని హమ్మయ్య అనుకుంటూ బయటకు కదులుతున్న గణపతిదేవుని ఓ పరిచారిక ఆపింది. "ప్రభూ.. ఏవో లేఖలు. సోమలమ్మ వారి మందిరంలో శుభ్రపరుస్తున్నప్పుడు దొరికాయి."

ఆశ్చర్యంగా అందుకుని ఆసక్తిగా చదివాడు. అవి తల్లి చిల్లాదేవికి కూతురు సోమలకు జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు. కబుర్ల రూపంలో తల్లి కూతుళ్లు రాసుకున్న ఆ లేఖల్లో గణపతికి తెలియని ఎన్నో విశేషాలున్నాయి. ఓ లేఖలో గిరిరాజమ్మ అనే ఓ దేవత గురించి రాసి ఉంది. అందులో చివరలో కనబడిన ఓ పేరు చూసి కంగు తిన్నాడు. మళ్లీమళ్లీ కళ్లు చికిలించి చూశాడు.

అక్కడ దొర్లిన పేరు "కవ్వల."

కవ్వల పేరు ఈ లేఖల్లో ఉన్నదేవిటి.. ఆ లేఖను మళ్లీమళ్లీ చదివాడు.

"కవ్వల కూడా ఈ మన కొత్తదేవత గిరిరాజమ్మ భక్తురాలు."

మతిపోయింది గణపతిదేవునికి.. కళ్లు చికిలించి మళ్లీ అక్షరమక్షరం చదివాడు. అన్ని లేఖలు మళ్లీ మళ్లీ చదివాడు. ప్రతి అక్షరం పట్టి పట్టి చూశాడు. ఊహు.. కేవలం ఓ లేఖలో కవ్వల కూడా ఆ దేవత భక్తురాలు అని మాత్రమే ఉంది.

'ఎవరైనా చంపిన మనిషిని ఆ దేవత తిరిగి బ్రతికిస్తుందట. అందుకే చచ్చిన తన సోదరిని ఆ అమ్మవారు తిరిగి బ్రతికిస్తుందని బాలకవ్వల ఆమెను భక్తితో కొలుస్తోశీదట. అంటే శత్రు పోరాటంలో చనిపోయిన అక్క కవ్వల ఆత్మశాంతి కోసం వీళ్లిద్దరూ పూజలు హోమాలు చేయిస్తున్నారన్నమాట.

(సశేషం)

రాజ్యాంగంతోనూ రాజ

దేశంలో రాజ్యాంగానికి ముప్పు ఏర్పడిందని, ప్రజాస్వామ్య వ్యవస్థ కుప్పకూలుతోందని, అధికార పక్షం నియంతృత్వ ధోరణులను ప్రదర్శిస్తోందని కొన్ని ప్రధాన ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతుండడం దాదాపు నిత్యకృత్యమైపోయింది. ఇటువంటి ఆరోపణలకు వంత పాడే విదేశీ పత్రికలు, విదేశీ సంస్థలకు కూడా కొదువ లేదు. అంత వరకూ రాజ్యాంగం గురించి అణుమాత్రంగా కూడా ఆలోచించనివారు 2014 తర్వాత మాత్రం నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, పౌర హక్కుల్ని క్రమంగా భూస్థాపితం చేస్తోందంటూ ప్రసంగాలు చేయడం, వ్యాసాలు రాయడం ఎక్కువైంది. దాదాపు అరవయ్యేళ్ల పాటు దేశంలో రాజ్యాంగం బలహీనపడుతున్నా, ప్రజాస్వామ్య విలువలు మట్టి కరుస్తున్నా, లౌకికవాదం తప్పుదోవ పడుతున్నా ఏమాత్రం పట్టించుకోని, కొద్దిగా కూడా నోరు మెదపని కాంగ్రెస్ పార్టీ, వామపక్షాలు, పౌరహక్కుల సంఘాలు, విదేశీ పత్రికలు ఇటీవలి పదేళ్ల పాలనకు సంబంధించి మాత్రం కళ్లకు గంతలు కట్టుకుని వక్ర భాష్యాలను కుమ్మరిస్తున్నాయి.

నిజానికి ఇంత ధైర్యంగా, ఇంత ధీమాగా, ఇంత ఎక్కువ మంది పాలక వ్యవస్థ మీద విమర్శలు, వ్యాఖ్యానాలు, ఆరోపణలు చేయడమంటే దేశంలో ప్రజాస్వామ్య విలువలు, సూత్రాలు పరిపుష్టం అవుతున్నాయనే అర్థం. కోవిడ్ సంక్షోభాన్ని ప్రభుత్వం విజయవంతంగా అదుపు చేసినప్పుడు, ప్రభుత్వం ఈ విషయంలో ఘోరంగా విఫలమైందంటూ విమర్శలు గుప్పించారు. తప్పుదోవ పట్టిన లౌకికవాదాన్ని తిరిగి పట్టాలెక్కించే ప్రయత్నం చేస్తున్నప్పుడు అల్ప సంఖ్యాక వర్గాలకు అన్యాయం జరిగిపోతోందంటూ గొంతులు చించుకున్నారు. రాజ్యాంగ వ్యవస్థలను ప్రక్షాళన చేస్తున్నప్పుడు వాటిని దుర్వినియోగం చేసే ప్రయత్నం జరుగుతోందంటూ గగ్గోలు పెట్టారు. ఇవన్నీ గురివింద గింజ సామెతను గుర్తు చేస్తున్నా అవేవీ పట్టించుకోలేదు. భారతదేశం బీజేపీ హయాంలో ప్రజాస్వామ్యం నుంచి నిరంకుశం వైపుగా దూసుకుపోతోందని విమర్శలు సాగించడం ఈ మధ్య కాలంలో మరీ ఎక్కువైంది.

అనవసర ప్రచారాలు

భారతదేశంలో రాజ్యాంగానికి ముప్పు ఏర్పడిందని, ప్రజాస్వామ్యం బలహీనపడుతోందని, పౌర హక్కులకు భంగం కలుగుతోందని చేస్తున్న ప్రచారాలు నిరాధారమైనవి, దురుద్దేశంతో కూడుకున్నవి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో రూపుదిద్దుకున్న రాజ్యాంగం ఇంతవరకూ చెక్కు చెదరలేదు. ఇటువంటి దుష్ప్రచారాలు ప్రమాదకరమైనవి. భారతదేశంలో ఏ ప్రజాస్వామిక సంస్థను చూసినా అది మరింత పటిష్ఠం కావడమే కనిపిస్తుంది. ఉదాహరణకు, న్యాయస్థానాలు ఇదివరకటి కంటే మెరుగ్గా, పటిష్ఠంగా, స్వతంత్రంగా పని చేస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలోనూ, ప్రాంతీయ స్థాయిలోనూ ప్రజాస్వామ్యం చైతన్యవంతంగానే కొనసాగుతోంది. అనేక రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికల్లోనే కాక, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రతిపక్షాలు అధికారంలోకి రావడం, పాలక పక్షం ఓడిపోవడం జరిగింది. భారతీయ సమాజం బహుళ జాతుల, బహుళ సంస్కృతుల సమాజంగానే కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా ఒకే పార్టీ ప్రభుత్వం ఏర్పడడం జరగలేదు.

రాష్ట్రస్థాయిలో ప్రజాస్వామ్యం పటిష్ఠంగానే కొనసాగుతోంది. కేంద్రంలో సరైన పోటీ లేనందువల్లే బీజేపీ అధికారంలో కొనసాగుతోంది. పాలక పక్షానికి సరైన పోటీ ఇవ్వలేని ప్రతిపక్షాలు బీజేపీ నిరంకుశ విధానాలను అవలంబిస్తోందంటూ విమర్శలు సాగించడం జరుగుతోంది తప్ప, కేంద్ర ప్రభుత్వంలో నిరంకుశ విధానాలను అనుసరిస్తున్నాయని చెప్పడానికి ఆధారాలేమీ లేవు. బీజేపీకి పోటీ ఇవ్వగలిగిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమస్యలతో అతలాకుతలం అవుతోంది. చర్వితచర్వణంగా ఈ పార్టీ బీజేపీ మీద మత ద్వేష పార్టీ అని, దేశాన్ని మతపరంగా విభజిస్తోందని విమర్శలు సాగిస్తోంది. పౌర హక్కులను బీజేపీ హరిస్తోందంటూ విమర్శించే నైతిక హక్కులేదు. నిజానికి ఈ పార్టీకి అధికార యంత్రాంగాన్ని తన గుప్పిట్లో ఉంచుకుందంటూ ప్రభుత్వం మీద ఆరోపణలు సాగించే హక్కు కూడా

కీయాలేనా?

లేదు. బీజేపీ కేవలం ధనవంతులు, పారిశ్రామికవేత్తల హక్కులను మాత్రమే కాపాడుతోందని విమర్శించే నైతిక హక్కు అసలే లేదు. ప్రజాస్వామిక విలువలను కాలరాస్తోందనే విమర్శలు కూడా ఈ పార్టీ నోటి వెంట రాకూడదు.

రాజకీయ దురుద్దేశాలు

కాంగ్రెస్ పార్టీ ఆరున్నర దశాబ్దాల పాలనలో ఇవన్నీ జరిగాయి. వారసత్వ పాలనకు అలవాటుపడిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడకపోవడం మంచిది. బీజేపీ హిందూ సిద్ధాంతాల ఆధారంగానో, మత ద్వేషం ఆధారంగానో అధికారంలోకి రాలేదు. అభివృద్ధి, సంక్షేమం, సమర్థ పాలన వంటి అంశాల ఆధారంగా అధికారంలోకి వచ్చింది. అభివృద్ధికి, సంక్షేమానికి పాటుపడుతూనే, ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగసూత్రాలను, లౌకికవాదాన్ని పట్టాల మీదకు ఎక్కించడానికి ప్రయత్నాలు సాగిస్తోంది. దేశాభివృద్ధి మీద దృష్టి కేంద్రీకరించడం వల్లే కాంగ్రెస్ పార్టీ నుంచి సైతం పలువురు సీనియర్ నాయకులు బీజేపీలోకి మారడం జరిగింది. భారతదేశం ఇదివరకటి మాదిరిగా కాకుండా, వడివడిగా అభివృద్ధి చెంది, ఒక అంతర్జాతీయ శక్తిగా ఎదగడంతో పాటు, ఒక అగ్రరాజ్యంగా దూసుకుపోవడానికి అభివృద్ధి మంత్రమే కారణం. కాంగ్రెస్ పార్టీ సహా ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలే నిజమైతే దేశం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.

కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న మిషతో దేశాన్ని ఇతర దేశాలలో చులకన చేసి మాట్లాడడం, ఈడీ, సీబీఐ, ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగబద్ధమైన సంస్థల మీద బురద చల్లడం, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఎంతకైనా దిగజారడం, కేవలం ఒక మతానికి అనుకూలంగా పది పన్నెండు చట్టాలు చేయడం, అత్యధిక సంఖ్యా ప్రజల హక్కులను, అధికారాలను కాలరాయడం ప్రజాస్వామ్య విలువలకు అనుగుణమైనవి కావు. ఇవి రాజ్యాంగబద్ధమైనవి కూడా కావు. అంబేద్కర్ ఆశయాలను, ఆయన ప్రవచించిన విలువలను కాలరాయడానికి జరిగిన ప్రయత్నాలు మాత్రమే. ఇక దేశంలో అత్యవసర పరిస్థితిని విధించి ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం, పౌర హక్కులను కాలరాయడం, రాజ్యాంగాన్ని స్తంభింపజేయడం, వేలాది మంది సిక్కులను ఊచకోత కోయడం వంటివి రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ఏమాత్రం అనుగుణమైనవి కావు.

సహజసిద్ధమైన ప్రజాస్వామ్యం

బహుళ జాతులు, బహుళ సంస్కృతులతో కూడుకున్న సమాజం సహజసిద్ధమైన ప్రజాస్వామ్య వ్యవస్థగానే కొనసాగుతుంది తప్ప, నిరంకుశానికి దారితీసే అవకాశం లేదు. ప్రజాస్వామ్య విలువలు భారతీయ సంస్కృతి, నాగరికతల్లో ఒక భాగమైపోయాయి. అనేక మతాలున్నా, అనేక కులాలున్నా వందలాది సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలు కలిసిమెలిసి జీవించడం, సహనం, సామరస్యాలతో వ్యవహరించడం సహజసిద్ధంగా వస్తున్నాయి. అనేక రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ, అనేక దేశాలకు మార్గదర్శకంగా మారిన భారతదేశంలో ప్రజాస్వామిక విలువలు, రాజ్యాంగ సూత్రాలు మరింతగా పటిష్ఠం కావడానికే అవకాశం ఉంది తప్ప కాంగ్రెస్ పార్టీ, వామపక్షాలు, విదేశీ పత్రికలు వ్యాఖ్యానిస్తున్నట్టుగా దేశం నిరంకుశం వైపుగా అడుగులు వేసే అవకాశం లేదు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని 96సార్లు సవరించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాజ్యాంగ విలువల గురించి మాట్లాడడంలో అర్థం లేదు.

దేశంలో రాజ్యాంగానికి ఎటువంటి ముప్పూ లేదు కానీ, దేశంలోని పలు ప్రతిపక్షాలు తమ సొంత రాజ్యాంగంతో పాలన సాగించడం మాత్రం దేశానికి తప్పకుండా ముప్పు తీసుకు వచ్చే అవకాశం ఉంది. కొందరు ప్రతిపక్ష నాయకులు రాజ్యాంగం ముప్పులో పడిందంటూ గావు కేకలు పెడుతుంటాయి. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ముప్పులో పడిందనడం వారి ఉద్దేశం కాదు. రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రతిపక్షాలు తమ సొంత రాజ్యాంగం గురించి ప్రస్తావిస్తున్నారని అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీనే తీసుకోండి. ఆమె ఉద్దేశంలో తన రాజ్యాంగం అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం కంటే ఉన్నతమైనది. సుమారు 20 లక్షల మంది బాంగ్లాదేశీయులకు పౌరసత్వం

ఇవ్వాలని మంకుపట్టు పట్టడం ఆమె రాజ్యాంగంలో భాగమే. తమ పార్టీవారు నేరానికి పాల్పడినా, అక్రమాలు సాగించినా ఆమె రాజ్యాంగం ప్రకారం వారు నిర్దోషుల కిందే లెక్క. రాష్ట్రంలో తమ మంత్రులు, తమ అధికారులు, తమ పార్టీవారి వల్ల ఏదైనా అవినీతి వ్యవహారం జరిగే పక్షంలో వారిని రాష్ట్ర పోలీసులు మాత్రమే విచారించాలనడం ఆమె రాజ్యాంగమే. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా ఆమె రాజ్యాంగం ప్రకారం లెక్క చేయాల్సిన అవసరం లేదు. అత్యాచారాలు, అవినీతి, అక్రమాలకు ఆమె రాజ్యాంగంలో శిక్షేమీ లేదు.

రాజ్యాంగాన్ని మరింత పటిష్ఠం చేయడం అనివార్యం అనడంలో సందేహం లేదు. అందుకు సంబంధించిన సూచనలు, సిఫార్సులు, సలహాలు, అభిప్రాయాలు ప్రస్తుత ప్రతిపక్షాల నుంచి వచ్చే అవకాశం లేదు. రాజ్యాంగాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడం తప్ప కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీకి మరో నిర్మాణాత్మక, ఆచరణాత్మక దృష్టేమీ లేదు. ఇతర దేశాల రాజ్యాంగాల్లో మాదిరిగా రాజ్యాంగంలోనే రాజ్యాంగానికి సరైన భద్రత కల్పించే వ్యవస్థలను, అంశాలను పొందుపరచవలసిన అవసరం ఉందని నానీ పాల్కీవాలా వంటి న్యాయ కోవిదులు అనేక పర్యాయాలు సూచించారు. రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేయకుండా, తప్పుడు అర్థాలు, భాష్యాలకు అవకాశం లేకుండా రాజ్యాంగంలో కొన్ని తిరుగులేని అంశాలను చేర్చవలసిన అవసరం ఉంది.

జి.రాజశేఖర్
సీనియర్ జర్నలిస్ట్

జనవరి 28-31 మేడారం జాతర

తెలంగాణలోని ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క-సారక్కల ద్వైవార్షిక జాతర ఆసియా ఖండంలోనే అతి పెద్దదిగా వినుతికెక్కింది. ఈ జాతర నిర్వహణ నేపథ్యంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కాకతీయ పాలకులు విధించే అన్యాయపు పన్నులకు వ్యతిరేకంగా, తమకు మద్దతుగా ప్రాణాలర్పించిన ఆ తల్లీ కూతురిని

ఈ నెల (జనవరి) 28 నుంచి నాలుగు రోజుల పాటు మేడారం జాతర నిర్వహిస్తారు. మొదటిరోజు సారలమ్మకు ప్రతి రూపంగా భావించే పసుపు భరిణను కన్నెపల్లి నుంచి తీసుకువస్తారు. ఆమెతో పాటు భర్త గోవింద రాజులు గద్దెపైకి చేరుకుంటారు. మరునాడు సమ్మక్కకు ప్రతిరూపంగా తలచే కుంకమ భరిణిని చిలకలగట్టు నుంచి తీసుకువస్తారు. వనదేవతలను గద్దె మీదకు చేర్చే సమయంలో పోలీసులు గౌరవ సూచకంగా గాలిలో కాల్పులు జరుపుతారు.. మూడవ నాడు ప్రధాన ఉత్సవానికి భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తారు. ఆ మరునాడు తల్లీకూతుళ్లు (సమ్మక్క, సారలమ్మ) వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది. ఈ నాలుగు రోజు అంబరాన్ని అంటే సంబరంతో ఆ ప్రాంతం జనసంద్రమే అవుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఇప్పటికే ముందస్తు మొక్కులు చెల్లించుకొంటున్నారు. ఈ మహాజాతర తరువాత వారం పాటు నిర్వహించే వేడుకలను 'తిరుగువారం' వేడుక అంటారు. మహా జాతరలో తెలిసో, తెలియకో అపరాధం, అపచారం చోటు చేసుకుంటే 'అమ్మల' మన్నింపును కోరుతూ ఈ వేడుక నిర్వహిస్తారు. వంశపారపర్యంగా గిరిజనులే ఇక్కడ పూజారులుగా కొనసాగుతున్నారు. కోయ తెగకు చెందిన 12 రకాల వారిలో రాచ కోయలు ఈ జాతర నిర్వహిస్తారు. ఈ పూజారులను 'వడ్డెలు' అంటారు.

కుంభ మేళ తర్వాత భారీగా భక్తజనం పాల్గొనే

ఈ జాతరను రాష్ట్ర ప్రభుత్వం 1996లో రాష్ట్ర పండుగగా ప్రకటించింది.

సమ్మక్క వృత్తాంతం

సమ్మక్క జననానికి సంబంధించి కొద్దిపాటి మార్పులతో కథలు ప్రచారంలో ఉన్నాయి. ఆమె భూమిలో ఒక పెట్టెలో లభ్యమైనట్లు ఒక కథ ప్రచారంలో ఉండగా, వేటకోసం వెళ్లిన కోయ దొరలకు, అడవిలో పెద్దపులుల కాపలా మధ్య దేదీప్య మానంగా వెలిగిపోతున్న పసిపాప దొరికినట్లు మరో కథనం. జనులను ఉద్ధరించేందుకు ఆదిశక్తి అవతారా లలో ఒక్కటైన వనదుర్గే సమ్మక్క రూపంలో కోయవారి ఇంటచేరిందనీ విశ్వసిస్తారు. సమ్మక్క పెద్దవుతున్న కొద్దీ మేడారంలో అనేక శుభపరిణామాలు చోటు చేసుకోవడం, ప్రజలు కోరినవి నెరవేరడంతో ఆమెను దేవతగా పూజించసాగారు. సంతానంలేని మేడ రాజుకు చిన్నారి అడవిలో దొరకగా, ఆమెను దైవప్రసా దంగా భావించి సమ్మక్క అనే పేరుతో గారాబంగా పెంచారు. సమ్మక్కను తన మేనల్లుడు పడిగిద్దరాజుతో వివాహం జరిపించగా, ఆ దంపతులకు కూతుళ్లు (సారలమ్మ, నాగులమ్మ) కుమారుడు జంపన కలిగారు. మేడారం ప్రాంతంలో మూడు నాలుగేళ్లు అనావృష్టి పరిస్థితి నెలకొని, ప్రజలు పన్నులు చెల్లించలేని దయనీయత. పగిడిద్దరాజు కూడా పన్నులు చెల్లించలేక అశక్తత వ్యక్తంచేశారు. సామంతు లను కట్టడి చేయడంతో సామ్రాజ్య విస్తరణ లక్ష్యంతో ప్రతామరుద్రుడు వారిపై యుద్ధం ప్రకటించాడు. ఆయన సైన్యాన్ని పగిడిద్దరాజు, కుటుంబసభ్యులు మేడారం సరిహద్దులోని సంపెంగ వాగు వద్ద నిలువ రించారు. పగిడిద్దరాజు, ఒక కూతురు నాగులమ్మ, అల్లుడు గోవిందరాజు మరణించారు. పరాజయాన్ని జీర్ణించుకోలేని జంపన్న ఆ వాగులో పడి ప్రాణ త్యాగం చేశారు. (నాటి నుంచి ఆ జలవనరు 'జంపన్న వాగు'గా ప్రాచుర్యంలోకి వచ్చింది). అయిన వారి అస్తమయ సమాచారం తెలిసి సమ్మక్క అపరకాళికే అయ్యింది. కూతురు సారలమ్మతో కలసి పోరుకు దిగింది. కాకతీయ సేనలకు ముచ్చెమటలు పట్టిం చింది. ఆ వీరవనిత చేతిలో ఓటమి తప్పదని భీతిల్లిన కాకతీయ సైనికుడు ఒకరు బల్లెంతో ఆమెను దొంగ దెబ్బ తీశాడు. రక్తసిక్తమైన దేహంతో ఆమె మేడారానికి ఈశాన్య దిశగా చిలకలగుట్టవైపు గల గుహలోకి వెళ్లి అదృశ్యమైంది. ఆమెను వెదకుతూ వెళ్లిన అనుచరు లకు ఒక నాగవృక్షం సమీపంలోని పుట్ట వద్ద పసుపు - కుంకుమలతో భరిణెగా కనిపించగా దానిని సమ్మక్కకు ప్రతిరూపంగా భావించారు. నాటి నుంచి ఆ భరిణతో ఏటా జాతర జరుపుకుంటున్నారు. మేడారానికి సుమారు పది కిలోమీటర్ల దూరంలోని బయ్యక్కపేట గ్రామానికి చెందిన గిరిజనుడి ఆధ్వర్యంలో మొదటి జాతర జరిగినట్లు తెలుస్తోంది. సుమారు 900 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ జాతరను 1940 వ సంవత్సరం వరకు చిలుకల గుట్టపై గిరిజనులు మాత్రమే జరుపుకునే వారు, కాని 1940 తర్వాత తెలంగాణ ప్రజలంతా కలిసి జరుపుకుంటున్నారు, ఏటేట జనం పెరుగుతుండడంతో జాతరను కొండ కింద జరపడం ప్రారంభించారు.

అశేష జనవాహినికి సమ్మక్కపై, ఆమె కుటుంబంపై గల ఆరాధనను, వారికి తన వల్ల కలిగిన అపరాధానికి చింతించిన ప్రతాపరుద్రుడు మేడారం చేరి, జరిగిన దానికి క్షమాపణ చెప్పుకుని మేడారంను కోయదొరల స్వతంత్ర రాజ్యంగా ప్రకటిస్తాడు. సమ్మక్క పేరున ప్రతి సంవత్సరం మాఘ పౌర్ణమి నాడు ముత్తయిదువుల పండుగగా, రెండేళ్లకు ఒకసారి జాతరను వైభవంగా జరుపుకునేలా ఆదేశం ఇచ్చి, అందుకు అవసరమైన నిధులు కేటాయించి, తాను కూడా భక్తుడయ్యాడని చారిత్రక కథనం.

మొక్కుబడులు-ప్రసాదం

భక్తులు, బంగారంగా పిలుచుకునే బెల్లాన్ని కానుక/ముడుపుగా చెల్లిస్తారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు బెల్లంను తులాభారంగా సమర్పించుకుంటారు. అలా నైవేద్యంగా పెట్టిన బెల్లాన్ని భక్తులందరికి పంచుతారు. వడిబాలు, బియ్యం, కొబ్బరికాయలు, పసుపు-కుంకుమలు, వస్త్రాలు,

స్మరించుకుంటూ అడవి పుత్రులు ఈ జాతర ప్రారంభించారని ఒక వాదన కాగా, తనవల్ల సమ్మక్క కుటుంబం బలైపోయిందన్న పశ్చాత్తాపంతో కాకతీయ చక్రవర్తి ప్రతాప రుద్రుడు ఈ జాతరకు శ్రీకారం చుట్టారని చెబుతారు. ఈసారి ఈ నెల (జనవరి) 28వ తేదీ నుంచి నాలుగురోజుల పాటు ఈ మహోత్సవం జరుగుతుంది.

దయాలయం

బోనాలు తదితరాలనూ సమర్పించుకుంటారు. కోడెలను కానుకగా సమర్పించడం ఈ జాతరలో మరో ప్రత్యేకత. గద్దెమీది బెల్లం స్వీకరిస్తే దీర్ఘకాల వ్యాధులు నయమవుతాయని, అక్కడి కుంకుమను పొందితే సంతానప్రాప్తి, మోక్షం కలుగుతాయని భక్తుల నమ్మకం. అమ్మవార్లు గద్దెలపైకి వస్తున్న సమయంలో మొక్కితే సంతానయోగం ఉంటుందని కూడా భావిస్తారు. సమ్మక్కను తీసుకువస్తున్న వారికి అడ్డంగా పడుకొని, పూజారులు తమ మీదుగా నడచివెళితే జన్మ తరించినట్లుగా విశ్వసిస్తారు. ఈ జాతరలో 'శివసత్తుల' పూనకాలు ఉత్కంఠ కలిగిస్తాయి. జాతర సమయంలో సారా తాగడాన్ని గిరిజనులు పవిత్ర కార్యంగా భావిస్తారు. మద్యపానం, మాంస భక్షణలకు మొక్కుబడులు చెల్లించేంత ప్రాధాన్యం ఉందని వారి వాదన.

శివశక్తులు-పూనకాలు

మేడారం జాతరలో శివశక్తులు (పూనకాలు) ప్రధాన ఆకర్షణగా ఉత్కంఠ కలిగిస్తారు. జంపన్న వాగులో స్నానం చేస్తుంటేనే వారికి పూనకం వస్తుంటుంది. కొత్తచీర, రెండు రవికలు ధరించి, చేతుల నిండా గాజులు, బొట్టు (మగవారు కూడా), ఒడి బియ్యంతో, తల వెంట్రుకలు విరబూసుకుని శివాలెత్తే దృశ్యం ఉత్కంఠ కలిగిస్తుంది. పూనకంతో ఊగే మహిళలు భవిష్యత్ గురించి, ప్రకృతి వైపరీత్యాల గురించి చెబుతుంటారు. భక్తులు ఆ పలుకులను సాక్షాత్తు సమ్మక్కవిగానే విశ్వసిస్తారు. వారిని తృప్తిపరచేందుకు పెద్ద సంఖ్యలో మేకలు, కోళ్లను బలి ఇస్తారు.

మేడారానికి మహర్దశ

ఈ జాతరను పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది రూ.251 కోట్లతో మేడారం సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. గద్దెల విస్తరణకే రూ 101 కోట్లు కేటాయించింది. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 4 వేల టన్నుల గ్రానైట్‌తో గద్దెల ప్రాంగణ నిర్మాణ పనులు చేపట్టారు. 46 స్తంభాలతో 271 చ.మీ విస్తీర్ణంలో ప్రాకారం. 8 స్తంభాలతో వృత్తాకార గద్దె నిర్మాణం చేపట్టారు. 40 అడుగుల వెడల్పుతో 3 స్వాగత తోరణాలు, 30 అడుగుల వెడల్పుతో 5 స్వాగత తోరణాలు, 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న చెట్లను తొలగించకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బండారి, మర్రి, వెదురు, వేప, ఇప్ప తదితర 12 రకాల పవిత్ర వృక్షాలు ఇక్కడ ఉన్నాయి. 46 స్తంభాలతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయి. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం నిర్మిస్తున్నారు.

శిలలపై 'తల్లుల' చరిత్ర

సమ్మక్క-సారక్క తల్లుల చరిత్ర అందరికీ తెలిసేలా శిలలపై చెక్కించారు. కోయల వద్ద దొరికిన 930 ఏండ్ల నాటి తాళపత్ర గ్రంథాల ఆధారంగా చెక్కించిన శిల్పాలు, చిహ్నాలు. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సమ్మక్క, సారక్క పగిడిద్దరాజు, గోవిందరాజు, కోయల ఇష్టదైవాలకు ప్రతిరూపంగా భావించే పులి, జింక, దుప్పి, పావురం, ఏనుగు, నెమలి, మొసలి, పశుపక్ష్యాదులతోపాటు కోయల జీవనశైలికి, ఆచార సంప్రదాయాలకు, గొట్టు గోత్రాలకు ప్రతిరూపంగా భావించే సూర్యచంద్రులు, త్రిశూలం, నెలవంక, బండి చక్రాలు, అడ్డ, నిలువు గీతలకు స్తంభాలపై చోటు దక్కింది.

కాకతీయుల కాలం నుంచి కొనసాగుతూ వస్తోన్న ఈ జాతర నిర్వహణ పర్యవేక్షణ బాధ్యతను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1961లో చేపట్టింది. 1996లో 'రాష్ట్ర ఉత్సవం' (స్టేట్ ఫెస్టివల్)'గా ప్రకటించింది. దీనిని జాతీయ ఉత్సవంగా గుర్తించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది.

- జంపన్నవాగులో స్నానమాడితే పాపపరిహారమై పునీతులవుతారని భక్తులు భావిస్తారు. జాతరకు వచ్చే భక్తులు అక్కడ స్నానం చేశాకే వన దేవతలను దర్శించుకోవడం ఆచారంగా వస్తోంది.
- సమ్మక్క తమను చల్లగా కాపాడుతుందని, దీర్ఘకాలంగా నయం కాని వ్యాధులను నివారిస్తుందని గిరిజనులతో పాటు గిరిజనేతరుల విశ్వసిస్తారు.
- సంతానం కోసం, వ్యాధుల నివారణకు, పురిట బిడ్డ నేలరాలకూడదని ఇలా... రకరకాల సంతానాన్ని కోరె మహిళలు కోర్కె తీరితే తల్లి గద్దెల వద్ద తొట్టెలు (ఊయల), చిలుకలు (పిట్టలు) కడతారు.
- గద్దె పక్కనే ఉన్న జువ్వి చెట్టుకు విశేష మహిమలు ఉన్నట్లు భావించి సమ్మక్కతో సమానంగా భక్తిశ్రద్ధలతో పూజిస్తారు.
- ఒక్కొక్క ఆదివాసి తెగకు ఒక్కో జంతువు లేదా పక్షి సంకేతంగా ఉంటాయి.వాటిని తమ వంశ మూలకర్తగా భావిస్తారు. సమ్మక్కకు నాగసర్పం, సారక్కకు పెద్దపులి, పగిడిద్ద రాజుకు తాబేలు సంకేతం. పూనకం వచ్చిన వారు పులి మాదిరిగా గాండ్రిస్తారు
- ఎదురు కోళ్ల పేరుతో ఆలయద్వారం ముందు కోళ్లను ఎగురవేసి మొక్కులు చెల్లిస్తారు.
- జాతర సమయంలో సారా తాగడాన్ని గిరిజనులు పవిత్ర కార్యంగానే భావిస్తారు.

డా॥ ఆరవెల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

తొలి ఇస్లామిక్ దండయాత్రకు వెయ్యేళ్లు: అయోధ్య ఉద్యమానికి ప్రేరణ

స్వాభిమాన సాగరం సోమనాథ్

సోమలింగం నరో దృష్ట్వా సర్వపాపైః ప్రముచ్యతే!
లభతే ఫలం మనోవాంఛితం మృతః స్వర్గం సమాశ్రయేత్!!..

(సోమనాథ్ శివలింగ దర్శనంతో జీవుడు పాప విముక్తుడై సదాశయాలను నెరవేర్చి, మరణానంతరం స్వర్గ ప్రాప్తి పొందుతాడు.)

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో మొదటిది సోమనాథ్. పశ్చిమ భారత తీరంలోని గుజరాత్ రాష్ట్రం ప్రభాస పట్టణంలోని ఈ దివ్యక్షేత్రం పేరు వినగానే మన హృదయాలు పులకరిస్తాయి. ఈ క్షేత్రం చరిత్రలో, ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంది. అనేకమార్లు విదేశీ దండయాత్రల్లో ధ్వంసమై తిరిగి నిలబడింది. 1026లో తొలిసారి దాడి జరిగి వేయి సంవత్సరాలు కాగా.. 1951లో ఆలయ పునరుద్ధరణ జరిగి 75 వసంతాలు పూర్తవుతున్నాయి. కోట్లాది భారతీయులు, హైందవుల ఆత్మగౌరవ పర్వం, అఖండ విశ్వాసాలకు ప్రతీకగా నిలిచింది సోమనాథ ఆలయం. సోమనాథ్ స్వాభిమాన్ పర్వం ఎంతో వైభవంగా నిర్వహించారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలలో మొదటిది సోమనాథ్. హిరణ్, కపిల, సరస్వతి మూడు నదులు కలిసే త్రివేణీ సంగమంలో చంద్రుడు అంటే సోముడు నిర్మించినందుకు సోమనాథ జ్యోతిర్లింగమనే పేరు వచ్చింది. శివపురాణం ప్రకారం దక్ష ప్రజాపతికి 27 మంది కుమార్తెలు. వీరే 27 నక్షత్రాలుగా విరాజిల్లుతున్నారు. చంద్రుడు వారిని వివాహం చేసుకుంటాడు. కానీ వారిలో రోహిణి పట్ల మాత్రమే అచంచల ప్రేమను ప్రదర్శిస్తుంటాడు. కలత చెందిన దక్షప్రజాపతి చంద్రుని కళలు క్షీణించిపోతాయని శపిస్తాడు. ఇందుకు అనుగ్రహించిన శివుడు చంద్రుడు తాను కోల్పోయిన కళలను తిరిగి ప్రసాదిస్తాడు. ఆనందభరితుడైన చంద్రుడు బంగారంతో దివ్య క్షేత్రాన్ని నిర్మించాడు. చంద్రుని విన్నపం మేరకు శివుడు అక్కడ స్వయంభువు సోమనాథుడిగా వెలిశాడు. త్రేతాయుగంలో రావణుడు వెండితో ఆలయాన్ని నిర్మిస్తే... ద్వాపరంలో శ్రీకృష్ణుడు చందనంతో, భీముడు రాతితో దివ్యమందిరాన్ని పునర్నిర్మించారని ఇతిహాసాల ద్వారా తెలుస్తోంది

సోమనాథ్ ఆలయంలో 'శ్యమంతకమణి' అనే అద్భుత రత్నం ఉందని చెబుతారు. వినాయక వ్రత కథ ప్రకారం శ్రీకృష్ణుని వద్ద ఉన్న శ్యమంతకమణి ఇదే. ఆ మణిని తాకిన ప్రతిదీ బంగారంగా మారిపోతుందని పురాణాలు చెబుతున్నాయి. ఆలయ పరిరక్షణలో భాగంగా ఈ మణిని జ్యోతిర్లింగం లోపల దాచారని తెలుస్తోంది.

సోమనాథ వైభవం

కాలక్రమంలో శిథిలమైన సోమనాథ ఆలయాన్ని తొలిసారిగా 649 సంవత్సరంలో యాదవ రాజైన వల్లభాయి పునర్నిర్మించారు. చాళుక్యుల కాలంలో ప్రభాస నగరం మంచి ఓడరేవుగా భాసిల్లింది. కనౌజ్ పాలకులైన ప్రతీహారుల కాలంలో ఈ క్షేత్రం కాశీతో సమానంగా విలసిల్లింది. మధ్య యుగాల నాటికే సోమనాథ ఆలయం గొప్ప ఆధ్యాత్మిక, విద్యా సాంస్కృతిక కేంద్రం. అద్భుత శిల్ప సంపదతో,ఆకాశాన్నంటే గొప్ప నిర్మాణమని చరిత్రకారులు అభివర్ణించారు. అత్యంత బరువైన 56 రాతిస్తంభాల పైకప్పు అపూర్వం. స్తంభాలు, కుడ్యాలు, తోరణాలకు వజ్రవైఢూర్యాలు, బంగారు, వెండి తాపడం చేశారు. ఆలయం మధ్యలో15 అడుగుల ఎత్తులో జ్యోతిర్లింగం ఉండేది. చిన్న దీపం మొత్తం గర్భగుడిని ప్రకాశింపజేసింది. ఈ ఆలయ నిర్వహణకోసం రెండు వేల గ్రామాల ఆదాయాన్ని కేటాయించారు. దాదాపు రెండు వేల మంది పూజారులు ఉండేవారు. ఇంతటి వైభవం, సంపద మరెక్కడా లేదు. దీనితో విదేశీ దురాక్రమణదారుల కన్ను కుట్టింది.

వెయ్యేళ్లనాటి విషాదం

భారతదేశం మీద మహ్మదీయుల దాడులు ప్రారంభమైన రోజులవి. వీరిలో అత్యంతక్రూరుడు



ఆలయం

అఫ్ఘానిస్తాన్‌కు చెంది టర్కీ సుల్తాన్ గజనీ మహమ్మద్. హైందవమతం, విగ్రహారాధన నిర్మూలించి, ఇస్లాం ఆధారిత సామ్రాజ్యాన్ని స్థాపించడం ఇతడి లక్ష్యం. ఆనాటి రాజుల అనైక్యత ఆధారంగా చేసుకొని అనేక రాజ్యాలను ఓడించి కొల్లగొడుతూ హత్యలు, అత్యాచారాలు, మత మార్పిడులు కొనసాగించాడు. 1000 సంవత్సరం నాటికి భారతదేశంలో ప్రవేశించాడు. మన దేశం మీద 17 సార్లు దండయాత్రలు సాగించిన గజనీ ప్రతీసారి పట్టణాలు, ఆలయాలతో సహా దోచుకొని తన దేశానికి తరలించాడు. మధురతోపాటు అనేక ఆలయాలను ధ్వంసం చేసి అపార సంపదను కొల్లగొడుతూ వచ్చాడు. గజనీ మహమ్మద్ దృష్టి సోమనాథ్ ఆలయం మీద పడింది.

గజనీ తొలిసారి దండయాత్రకు వచ్చినప్పుడు ఆ ప్రాంత ప్రజలు.. అక్కడి సామంత రాజులు కలిసికట్టుగా ప్రతిఘటించారు. రాజపుత్రరాజు భోజుడు భారీ సైన్యంతో వచ్చి విరుచుకుపడటంతో గజనీ సైన్యం పారిపోయింది. రెండోసారి గజనీ మార్గం మార్చాడు. సింధ్ ప్రాంతం మీదుగా ధార్ ఎడారి మార్గంలోనే దొంగచాటుగా దాడి చేశాడు. ఈ దాడిని ప్రతిఘటించిన 50 వేల మంది ప్రాణ త్యాగం చేశారు. గజనీ మహమ్మద్ స్వయంగా విగ్రహాన్ని ముక్కలు చేసి అపవిత్రం చేశాడు. జ్యోతిర్లింగాన్ని కాపాడటానికి అక్కడ పూజారులు బ్రాహ్మణులు చేయని ప్రయత్నం లేదు. పెద్ద ఎత్తున బంగారం ఇస్తామని... విగ్రహాన్ని మాత్రం ఏమీ చేయవద్దని ప్రాధేయపడ్డారు. గోడలను తొలిచి పొదిగిన రత్నాలు, బంగారు.. వెండి ఆభరణాలను దోచుకొన్నాడు. ఈ సంపదనంతా తన రాజ్యం గజనీకి తరలించాడు. ఆ రోజు జనవరి 6,1026.. (సోమనాథ క్షేత్రం మీద దండయాత్ర జరిగి 2026కి వేయి సంవత్సరాలు పూర్తయింది). సోమనాథ్ మందిరం ఏ విధంగా ముస్లిం దోపిడీదారుల దాడులకు గురైందో కె.ఎం మున్షీ 'జై సోమనాథ్' చారిత్రక నవలలో చూడవచ్చు (భండారు సదాశివరావు అదే పేరుతో తెనిగించారు).

సోమనాథ్ ఆలయ చరిత్రను గమనిస్తే ఇప్పటి వరకూ ఆరుసార్లు దాడులకు గురై మళ్లీ నిర్మాణం జరిగింది. మాల్వా రాజు భోజి, చోళంకి రాజు భీమ్‌దేవ్ 1026-1042ల మధ్య తిరిగి నిర్మించారు. కుమరపాలుడు చేత 1143-1172ల మధ్య కాలంలో కొయ్యతో పునర్నిర్మితమైంది. అతడు సోమనాథ్ ఆలయాన్ని, ప్రభాస పట్టణాన్ని పూర్తిగా పునరుద్ధరించాడు. 1296లో సుల్తాన్ అల్లాయుద్దీన్ ఖిల్జీ సైన్యాలు మరోసారి ఆలయాన్ని కూల్చేశాయి. 1308లో సౌరాష్ట్ర రాజు మహీపాదావ తిరిగి నిర్మించారు. 1326-1351 మధ్య ఈ ఆలయంలో లింగ ప్రతిష్ఠ జరిగింది. 1375లో ఈ ఆలయం మరొకసారి సుల్తాన్ మొదటి ముజాఫర్ షాహ్ కూల్చాడు. 1451లో ముహమ్మద్ మళ్లీ కూల్చి వేశాడు. మరమ్మతులకు వీలుకానంతగా ధ్వంసం చేయమంటూ మొగల్ చక్రవర్తి ఔరంగజేబు ఇచ్చిన ఆదేశాలతో 1701లో ఆఖరిసారి ధ్వంసం చేశారు. ఆ శిథిలాలతో ఔరంగజేబు మసీదును నిర్మించాడు. 1783లో ఇందోర్ రాణి అహల్యాబాయి హోల్కర్ సోమనాథ్ సమీపంలో తాత్కాలిక పూజల కోసం ఆలయం నిర్మించారు.

సగర్వంగా పునర్నిర్మాణం

1026లో మొదలైన దండయాత్ర, ఇతరులను కూడా ప్రేరేపించింది. దేశ ప్రజలను, సంస్కృతిని దాస్య శృంఖలాల్లో బంధించే ప్రయత్నాలకు నాంది పలికింది. కానీ, దాడి జరిగిన ప్రతి సందర్భంలోనూ రక్షణ కుడ్యంలా నిలిచి, ఆత్మార్పణకూ వెరవని వీరపుత్రులు, పుత్రికలు ఎందరో ఉన్నారు. స్వామి వివేకానంద 1890 దశకంలో సోమనాథ్‌ను సందర్శించినపుడు అనిర్వచనీయ అనుభూతికి లోనయ్యారు. సోమనాథ్ క్షేత్రం వంటివి మనకెంతో విజ్ఞానాన్ని అందిస్తాయని, పుస్తకాల్లో లేని చరిత్రను చెబుతాయని పేర్కొన్నారు. ఈ దేవాలయాలు అనేక దాడులను తట్టుకుని కూడా ఎలా తలెత్తుకు నిలిచి ఉన్నాయో గమనించడం ఒక అద్భుతం. అదే జాతీయ మనస్సు, అదే జాతీయ జీవన ప్రవాహం. దానిని అనుసరించండని సందేశం ఇచ్చారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కీలక పరిణామం చోటు చేసుకుంది. సోమనాథ్ జునాఘడ్

దురాక్రమణదారుల చేతిలో శిథిలమైన నాటి మందిరం

సంస్థానంలో ఉండేది. అక్కడి జనాభాలో 80 శాతానికి పైగా హిందువులున్నప్పటికీ సంస్థానాన్ని నవాబు పాకిస్తాన్‌లో కలిపేందుకు ప్రయత్నించారు. తొలి హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దీన్ని వమ్ముచేసి నవంబర్ 9,1947న భారత్‌లో విలీనం చేశారు. దీపావళి రోజున సర్దార్ పటేల్ సోమనాథ్‌లో పర్యటించారు. అక్కడి పరిస్థితులను చూసి చలించి పోయారు. పురాతన కాలంలో ఉన్న చారిత్రాత్మకమైన మందిరం ఉన్న స్థలంలో ఆలయాన్ని పునర్నిర్మిస్తామని, జ్యోతిర్లింగాన్ని పునఃప్రతిష్ఠింపజేస్తామని ప్రకటించారు. కానీ ప్రధాన మంత్రి ప్రతిఘటించారు. విద్యామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఈ మందిరాన్ని పురావస్తు శాఖకు ఇవ్వాలని సూచించారు. ఇందుకు పటేల్ అంగీకరించలేదు. 'ఈ మందిరానికి సంబంధించి హిందువుల మనోభావాలు బలంగా విస్తరించి ఉన్నాయి. కేవలం మందిరాన్ని పునరుద్ధరించడం ద్వారా ప్రజల మనోభావాలకు ఊరట కలగదు. ఈ మందిరంలో విగ్రహాన్ని పునరుద్ధరిస్తేనే హిందువుల గౌరవాన్ని, మనోభావాల్ని కాపాడినట్లు అవుతుంది' అన్నారు. మందిర పునర్నిర్మాణాన్ని మహాత్మాగాంధీ పూర్తిగా సమర్థించడమే కాక ఆశీర్వాదాలు కూడా అందజేశారు. అయితే మందిర పునర్నిర్మాణానికి నిధులు ప్రభుత్వం ఖజానానుండి కాక ప్రజలనుండి సేకరించాలని సూచించారు. పనులను పర్యవేక్షించేందుకు కేంద్రమంత్రిగా ఉన్న కేఎం మున్షీ ఆధ్వర్యంలో ఓ కమిటిని నియమించారు. ఇంతలో డిసెంబర్ 15,1950న సర్దార్ పటేల్ అకాల మరణంతో ఆటంకాలు మొదలయ్యాయి.

కొత్త మందిరాన్ని ప్రారంభించి, జ్యోతిర్లింగాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించేందుకు తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను మున్షీ ఆహ్వానించారు. నెహ్రూ మాత్రం రాష్ట్రపతి వెళ్లేందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికీ రాజేంద్ర ప్రసాద్ హాజరయ్యారు. 'నన్ను ఆహ్వానిస్తే ఒక మసీదుకైనా, చర్చికైనా వెళతా. భారతీయ లౌకిక వాదంలోని ఉద్దేశం అదే. మన రాజ్యం మత వ్యతిరేకం కాదు. మతం లేనిదీ కాదు' అని చెప్పారు. సోమనాథ మందిర పునర్నిర్మాణాన్ని జాతీయ విశ్వాసానికి ప్రతీకగా రాష్ట్రపతి అభివర్ణించారు. అలా మే11, 1951న సోమనాథ్‌లో భవ్యమైన ఆలయ ద్వారాలు 75 ఏళ్ల నాడు భక్తుల కోసం తెరచుకున్నాయి. సోమనాథ్ పునర్‌నిర్మాణం హైందవ చైతన్యం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. అయోధ్యలో రామమందిర పునర్నిర్మాణా నికి కూడా ప్రేరణ అయింది. అయోధ్య రథయాత్రను బీజేపీ నాటి అధ్యక్షుడు లాల్‌కృష్ణ ఆడ్వాణీ సెప్టెంబర్25, 1990న సోమనాథ ఆలయంలో పూజలు చేసి ప్రారంభించారు. అయోధ్య ఉద్యమం సోమనాథ్ స్ఫూర్తికి కొనసాగింపు అని వెల్లడించారు.

సోమనాథ్ ఆలయం మీద 1026లో మొదటి దాడి జరిగి వెయ్యేళ్లు గడిపోయాయి.. సోమనాథ్ వద్ద సాగరం నేటికీ అంతే గంభీరంగా గర్జిస్తోంది. సోమనాథ్ తీరాన్ని తాకే అలలు అద్భుతమైన కథలను చెబుతున్నాయి. నిరంతర దాడులను ఎదుర్కొన్న సోమనాథ ఆలయం మళ్లీ మళ్లీ సగర్వంగా నిలిచి నేడు కోట్లాది భారతీయులు, హిందువుల స్వాభిమానానికి, ధైర్యానికి నిర్వచనంగా నిలుస్తోంది.

నాటి దురాక్రమణదారులు గాలిలో కలిసిన ధూళి కణాలయ్యారు. కాలగర్భంలో కలిసి పోయారు. సోమనాథ్ క్షేత్రం మాత్రం దివ్యత్వానికి ప్రతీక. దిగంతాలకు అతీతంగా దేదీప్యమై వెలుగులు విరజిమ్ముతోంది. చారిత్రక వైభవానికి సాక్షీభూతంగా నిలిచిన సోమనాథ్ క్షేత్రాన్ని జనవరి 11 తేదీన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సందర్శించారు. ఆలయాన్ని ధ్వంసం చేసి వెయ్యేళ్లు అవుతున్న సందర్భంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ నిర్వహించారు.

క్రాంతిదేవ్ మిత్ర
సీనియర్ జర్నలిస్ట్

మరో వెయ్యే

ఎక్కడైనా దేవుడు మనకు అండగా ఉంటాడని భక్తులు అనుకోవడం పరిపాటి. అందుకని పూజలు, వ్రతాలు, నోములు ఇలా చెప్పుకుంటూ పోతే ఇలవేలుపును ప్రసన్నం చేసుకోవడానికి, ఇష్టకామ్యార్థ సిద్ధి కోసం భక్తులు తలనీలాల సమర్పణ నుంచి తులాభారం దాకా అనేక మార్గాలను అనుసరిస్తుంటారు. నాకు ఊహ తెలిశాక ఐదు దశాబ్దాల లౌకిక జీవనంలో జనవరి 10వ తేదీ వరకు అనుభవంలోకి వచ్చిన విషయాలు ఇవి. అదే రోజున సోమనాథ్ సందర్శనం నా ఇన్నేళ్ల అనుభవాలను నీటి మీద రాతల్లాగా మార్చేసింది.

అలాగని అక్కడేదో తపస్సంపన్నులు, జఠాధరులు, జంగమదేవరలు, అఘోరాలు, నాగ సాధువులు అనుచర గణంతో శిబిరాల్లో వేంచేసి భక్తజనకోటిని ఆశీర్వదిస్తూ, మంచి మాటలు చెబుతూ ఉంటారని కాదు. వీధికో గుడితో తెల్లవారకముందే భక్తిగీతాలతో పురజనులను మేల్కొలిపే వాతావరణం మచ్చుకైనా కనిపించ లేదు. భక్తుల నుదుటన అడ్డనామాలు, నిలువు నామాలు పెడతామంటూ వెంటపడేవారు ఒక్కరంటే ఒక్కరు లేరు. దేవుడి పేరును సొమ్ము చేసుకుందామనే ఆలోచన వారిలో లేదు. ఎందుకంటే అక్కడి వారికి మహాదేవుడైన సోమనాథుడు తన గూడును కాపాడుకోవడానికి పడిన కష్టాలు

్లకు భరోసా

ఎవరో చెబితే కాకుండా, ఏవో పుస్తకాల్లో చదివితే కాకుండా అనుభవపూర్వకంగా తెలుసు కాబట్టి. మన ఇళ్లల్లో(ఇప్పుడు చెబుతున్నారో లేదో తెలియదు కానీ) పసిపాపలకు చందమామను చూపిస్తూ గోరుముద్దలు తినిపిస్తే, సోమనాథ్‌లో అమ్మలు, అమ్మమ్మలు మహాదేవుడి గుడిని కాపాడుకోవడంలో తమ పూర్వికులు చేసిన త్యాగాలను చెబుతూ, ఆధ్యాత్మికతను, శౌర్యాన్ని రంగరించిన ఉగ్గుపాలను పిల్లలకు పడుతుంటారు. అక్కడి వారితో యథాలాపంగా మాట్లాడుతున్నప్పుడు నేను తెలుసుకున్న విషయాల్లో ఇది మొదటిది.

ఎవరిని కదిలించినా సరే, వారు సోమనాథ్ మందిరం రక్షణకు పూనుకున్న యోధుల్లో ఒకరికి వారసులై ఉండటం విశేషం. సోమనాథ్‌ను సందర్శించడం నాకిదే తొలిసారి. సోమనాథ ఆలయం మీద దురాక్రమణదారుల దాడి జరిగి వెయ్యేళ్లు అయిన సందర్భంగా జరిగిన పండుగను ప్రత్యక్షంగా చూద్దామని పాత్రికేయ పాత్రలో ఆ నగరంలోకి అడుగుపెట్టాను. ఆరుగురితో కూడుకున్న బృందంలో ఒకడిగా నేను జనవరి 10 సాయంత్రం అక్కడికి చేరుకున్నాను. డయ్యూ ద్వీపం నుంచి సోమనాథ్‌లోకి ప్రవేశిస్తుండగా నగరం మొదట్లో వేడుకలకు సంబంధించిన అతిపెద్ద సభావేదిక ఫ్లై ఓవర్ మీద నుంచి కనిపించింది. అదే రోజు మందిర ప్రాంగణంలో అనేక విశేష కార్యక్రమాలకు మేం హాజరుకావాల్సి ఉంది. అందుకని మాకు కేటాయించిన రిసార్టుకు చేరుకొని తయారై వెంటనే సోమనాథ్ మందిరానికి చేరుకున్నాం. దారిపొడుగునా కనిపించిన భక్తజన సందోహాన్ని చూసి మాలో ఒకరు “ఇదేదో మినీ కుంభమేళాలా ఉంది” అని అనడం బాగాగుర్తుంది. అంత మంది ఉన్నప్పటికీ ఎలాంటి అపశ్రుతికి చోటు లేకుండా జరిగిన ఏర్పాట్లను మనసులోనే మెచ్చుకుంటూ మందిర ప్రాంగణంలోకి అడుగుపెట్టాం. పసిడి వర్ణంలో మెరిసిపోతున్న మందిరానికి మరింత శోభను తెస్తున్నట్టుగా రంగురంగుల విద్యుత్ దీపాలతో యావత్ ప్రాంగణాన్ని అలంకరించారు. మేం నగరానికి చేరుకున్నప్పటి నుంచి మాకు ఓంకార ప్రణవనాదం వినిపిస్తూనే ఉంది. అందుకు కారణం మహాదేవుడికి నీరాజనాలు అర్పిస్తూ గుజరాత్ నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన సంస్కృత విద్యార్థులు నిరంతరాయంగా, అవిశ్రాంతంగా చేపట్టిన 72 గంటల సామూహిక ప్రణవనాద జపం. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పాల్గొనడం ద్వారా పరమశివుడికి ప్రీతిపాత్రమైన మహత్ కార్యక్రమాన్ని సంపూర్ణం చేశారు. సంస్కృత విద్యార్థుల్లో కొందరైతే ప్రధాని తమతో కలిసి జపం చేయడం, తమను ఆప్యాయంగా పలకరించడం ఒక మరపురాని అనుభవమని ఆనందంగా చెప్పారు. సంస్కృతం తోడుగా ఘనమైన మన సంస్కృతిని కాపాడుకోవడం తన లక్ష్యమని ఒక విద్యార్థి చెప్పాడు.

ఆ కార్యక్రమం ముగిసిన కాసేపటికే సంక్రాంతి పండుగ వేళ చీకట్లు కమ్ముకున్న ఆకాశంలో బియ్యపు పిండితో వెలుగు జిలుగుల చుక్కల ముగ్గులు పెడుతున్నట్టుగా వేలాదిగా డ్రోన్లు ప్రత్యక్షమయ్యాయి. ఓంకారం, సోమనాథ్ మందిరం, మహాదేవుడు, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఇలా రకరకాల రూపాలను సంతరించుకుంటూ మందిర పునర్నిర్మాణ విశేషాలను బొమ్మల పుస్తకంలో పేజీలను తిప్పుతున్న తీరుగా డ్రోన్లు వివరించాయి. ఆ తర్వాత తామేమీ తీసిపోలేదన్నట్టుగా ధ్వని ముందా? దృశ్యం ముందా? అన్న సందేహంతో చూస్తుండగానే గగనంలో బంతిపూలు విరబూసినట్టుగా బాణసంచా సందడి చేశాయి. ఈ కార్యక్రమాలు జరుగుతున్నంతసేపూ అక్కడ పెద్ద సంఖ్యలో చేరుకున్న ప్రజలు “హర్ హర్ మహాదేవ్” అని పెద్దగా అంటూ సోమనాథ్‌ను స్మరించుకుంటూనే ఉన్నారు. ఆ విధంగా వెయ్యేళ్ల వేడుక పట్ల వారి భక్తిపారవశ్యం ప్రత్యక్షంగా కనిపించింది, వినిపించింది. ప్రధాని వెళ్లిపోతున్నప్పుడు కూడా ఆయన్ను దగ్గరగా చూడాలనే ఆరాటం, ఆత్రుత, తొందరపాటును ప్రదర్శించకుండా అప్రకటిత క్రమశిక్షణను, సంయమనాన్ని వారు పాటించడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. సోమనాథ్ మందిర పరిరక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన హమీర్‌జీ గోహిల్ అశ్వారూఢుడై అతి పెద్ద ఆయుధాన్ని చేబూనిన భారీ విగ్రహం పట్ల ప్రజలు ప్రదర్శించిన భక్తి, శ్రద్ధలు అబ్బురపరిచాయి. ఆపైలతో కలిసి విగ్రహం ఎదుట సెల్ఫీలు దిగడం అక్కడ సర్వసాధారణమైన ఘట్టంగా మిగిలిపోయింది. ఆ విగ్రహం ఉన్న కూడలికి హమీర్‌జీ కూడలి అని పేరు.

జనవ10 (శనివారం) నాటి వేడుకలకు ఎంతమంది వచ్చిందీ కచ్చితంగా చెప్పలేను కాని మందిరం నుంచి ఏడు కి.మీ.ల దూరంలో ఉన్న మేం బస చేసిన రిసార్టుకు కారులో చేరుకోవడానికి దగ్గర దగ్గర మూడు గంటలు పట్టింది. అలా తిరిగి వస్తున్నప్పుడు గుజరాత్‌లో వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తాము వచ్చిన బస్సుల దగ్గర వంటలు చేసుకుంటూ కనిపించారు.

మర్నాడు ఆదివారం ఉదయాన్నే నగరంలో శంఖ్ కూడలి నుంచి హమీర్‌జీ కూడలి వరకు శౌర్యయాత్ర ఉంటుందనే సమాచారం మాకు అందింది. ఉదయం

మహేష్ ధూళిపాళ్ల

ఏడున్నర కల్లా అక్కడికి చేరుకున్నాం. ప్రధాని పాల్గొంటున్న కారణంగా శంఖ్ కూడలికి అర కిలో మీటరు దూరంలోనే ఫ్లై ఓవర్‌కు దగ్గరగా మా వాహనాన్ని ఆపివేశారు. పూర్తిగా తెల్లవారలేదు. ఈలోగా నడియాడ్‌లో బ్రహ్మర్షి సంస్కృత విద్యాలయకు చెందిన వందలాది విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలను, శంఖాన్ని, డమరుకాన్ని ధరించి మేం ఆగిన చోటుకు వరుసకట్టి వచ్చారు. వీరంతా 72 గంటల సామూహిక ఓంకార జపంలో పాల్గొన్నవారే. ఈ సందర్భంగా ఆ బృందానికి నోడల్ ఆఫీసర్, విద్యాలయ ప్రిన్సిపల్ సంజయ్ బ్రహ్మభట్‌తో మాట్లాడినప్పుడు, సంస్కృతంలో పట్టభద్రులైన వారికి ఉద్యోగావకాశాల గురించి ప్రస్తావించినప్పుడు పండితులు, అర్చకులు, అధ్యాపకులతో పాటుగా సైన్యంలో ధర్మ గురువు వంటి ఉద్యోగాలు ఉన్నాయని, ఇటీవల తమ విద్యాలయకు చెందిన విద్యార్థుల్లో కొందరు ధర్మగురువులుగా సైన్యం చేరారని ఆయన చెప్పడం విశేషం. ఆ తర్వాత వారంతా డమరుకాన్ని మోగిస్తూ, శంఖనాదం చేస్తూ శంఖ్ కూడలి వైపు సాగిపోయారు. వారిని దాటుకొని మా బృందం వెళుతుండగా కుడివైపున నిర్మాణ పనులు జరుగుతున్న సోమనాథ్ రైల్వే స్టేషన్ కనిపించింది. అక్కడివారిని అడిగినప్పుడు భక్తుల రద్దీకి తగ్గట్టుగా అయోధ్య రైల్వే స్టేషన్ తరహాలో అధునాతన సౌకర్యాలతో ఇక్కడ రైల్వే స్టేషన్‌ను తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. అలా నడుచుకుంటూ శంఖ్ కూడలికి చేరుకునేసరికి ఆ కూడలి నుంచి హమీర్ జీ కూడలి వరకు దేశంలో వేర్వేరు రాష్ట్రాలకు చెందిన కళాకారులు వారికి కేటాయించిన వేదికలపై కళారూపాల రిహార్సల్స్ చేస్తూ కనిపించారు. వారిలో గుజరాత్‌కు చెందినవారితో పాటుగా కేరళ, జమ్మూకశ్మీర్, ఒరిస్సా, తదితర రాష్ట్రాల వారు ఉన్నారు. యాత్రా మార్గానికి కుడివైపున బస్తీ ఉన్న కారణంగా భద్రత దృష్ట్యా అటువైపునకు అడ్డుగా మందపాటి పరదాలను అధికారులు కట్టారు. అయినప్పటికీ అటువైపున పరదాల మధ్య చిన్నపాటి కంతల నుంచి శౌర్య యాత్రను చూడటానికి బస్తీకి చెందిన పసిపిల్లలతో పాటుగా వృద్ధులు వేచి చూడటం కనిపించింది. యాత్రామార్గం మొత్తాన్ని ఒకసారి తిరిగి చూసిన తర్వాత శంఖ్ కూడలి దగ్గరకు చేరుకున్నాను. పులివేషాలు కట్టిన కేరళ కళాకారులు, స్థానిక వస్త్రధారణలో కనిపించిన కశ్మీర్ నాట్యకారులు ప్రజలను ఎక్కువగా ఆకర్షించారు. వారితో సెల్ఫీలు దిగారు. వారి ప్రదర్శనను కెమెరాల్లో బంధించారు. ఈలోగా శంఖ్ కూడలి వద్ద హడావిడి మొదలైంది. సోమనాథ్ పరిరక్షణకు బలిదానం చేసిన యోధులను తలపిస్తున్నట్టుగా అప్పటి సైనిక వస్త్రధారణలో చేతిలో ఆయుధాలను ధరించిన వందలాదిగా వ్యక్తులు అశ్వాలపై అక్కడికి చేరుకున్నారు. వారంతా గుజరాత్ రాష్ట్రంలోని పోలీస్ అకాడమీలలో శిక్షణ పొందిన అధికారులు. అలా వచ్చిన అశ్వికదళం రెండు జట్లుగా విడిపోయింది. ఈలోగా ఆదివారం అన్న విషయాన్ని పట్టించుకోకుండా వేర్వేరు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు అక్కడికి చేరుకున్నారు. వారిలో కొందరి గుప్పిట గులాబీ రేకులు ఉన్నాయి. మరి కొందరి చేతుల్లో విజయోత్సవానికి సంకేతంగా చిన్నపాటి పతాకాలు కనిపించాయి. విద్యార్థినీ విద్యార్థులంతా యాత్ర ఆరంభమయ్యే చోట కట్టిన బారికేడ్ల వద్ద ప్రధాని రాక కోసం ఎదురుచూస్తూ నిలబడ్డారు. పక్కనే ఖాళీగా ఉన్న వేదిక మీద కూర్చొని కొందరు యువకులు కనిపించారు. వారితో మాట్లాడినప్పుడు ఇంజినీరింగ్ పూర్తి చేసి సామాజిక సేవలో భాగంగా యాత్ర విధుల్లో పాల్గొంటున్న స్వచ్ఛంద సేవకులని తెలిసింది. ఆ పక్కనే గుజరాత్‌లోని ఒక పంచాయతీ నుంచి వచ్చిన పట్వారీ కనిపించారు. ఆయన మాటల్లో సోమనాథ్ పట్ల భక్తిభావన, యోధులపైన ఆరాధన వినిపించింది.

వారితో వీరితో మాట్లాడుతుండగానే మరోసారి హడావిడిగా మొదలైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి తోడురాగా ప్రధాని నరేంద్ర మోదీ అక్కడికి చేరుకున్నారు. యాత్రకు ఉద్దేశించిన టాప్ లేని ప్రత్యేక వాహనాన్ని అధిరోహించారు. అలా వాహనాన్ని ఎక్కడమే ఆలస్యం ఎవరో ఆయన చేతికి ధమరుకాన్ని అందించారు. ముందువైపున అశ్వికదళం, శంఖారావంతో సంస్కృత విద్యార్థులు సాగుతుండగా ధమరుకాన్ని మోగిస్తున్న మోదీతో వాహనం నెమ్మదిగా ముందుకు సాగింది. అక్కడి వాతావరణంలో ఒక్కసారిగా ఉత్సాహం నెలకొంది. విద్యార్థినీవిద్యార్థులు ప్రధానిపై పూలవర్షం కురిపించారు. యాత్ర మొదట్లో వేదికపై సీతారామ లక్ష్మణ రూపధారులైన కళాకారులను మోదీ పలకరించారు. కేరళ కళాకారుల నుంచి చండా వాయిద్యాన్ని తీసుకొని మోగించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలా 20 నిమిషాలపాటు సాగిన శౌర్యయాత్ర హమీర్ జీ కూడలికి చేరుకోగానే విజయానికి గుర్తుగా కాషాయ రంగులను ప్రధాని వెదజల్లారు. అనంతరం మోదీ పాల్గొన్న సభావేదిక వద్ద కూడా ఇలాంటి ఉత్సాహ పూరితమైన వాతావరణమే కనిపించింది. ప్రధాని తన ప్రసంగంలో సోమనాథ్ చరిత్ర ఓటమి చరిత్ర

కాదు. ఇది విజయం, పునర్నిర్మాణం చరిత్ర, మన పూర్వికుల ధైర్యం, త్యాగం, సంకల్ప బలం చాటే చరిత్ర. ఇప్పుడు ఆక్రమణదారులు ఖడ్గాలతో రాకపోయినా భారత్‌ను బలహీనపరిచే కుట్రలు జరుగుతున్నాయి. తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించి నప్పుడు సభికులంతా "హర్ హర్ మహదేవ్", "హర్ హర్ భోలే", "జై సోమనాథ్" అంటూ నినదించారు.

మోదీ చేసిన భావోద్వేగ ప్రసంగంలో వారికి సోమనాథ్ మందిరానికి మరో వెయ్యేళ్ల కాలానికి భరోసా వినిపించింది. సభ విజయవంతంగా ముగిసింది. సభ వెలుపల పోలీసుల ఏర్పాట్లు కూడా అంతే బేషుగ్గా ఉన్నాయి. ఉదాహరణకు సభా వేదిక దగ్గర్లో ఉన్న విరావల్ కూడలి వద్ద ఒక వృద్ధురాలు తప్పిపోయింది. గుజరాత్‌లో ఎక్కడో మారుమూల ప్రాంతం నుంచి తమవారితో కలిసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో సోమనాథ్ వేడుకల్లో పాల్గొనటానికి వచ్చింది. అక్కడ ఉన్న పోలీసులు వెంటనే స్పందించారు. ఆమెకు ధైర్యం చెప్పారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైర్‌లెస్ సెట్లకు పనిచెప్పారు. కొద్దిసేపటికి ఆమె ఎక్కాల్సిన బస్సు ఆమె ముందు వచ్చి ఆగింది. పోలీసులకు దండాలు పెడుతూ మరీ అయినవారు బస్సులో నుంచి చేయి అందించగా ఆమె నవ్వుతూ బస్సు ఎక్కింది. నాకు అనుభవంలోకి వచ్చింది ఇదొక్కటే. అంత పెద్ద కార్యక్రమంలో అందరి బాగోగులు చూసుకుంటూ, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమనేది కత్తి మీద సాము. ఈ విషయంలో గుజరాత్ పోలీసులు అభినందనీయులు. అప్పటికి మధ్యాహ్నం దాటిపోయింది. దక్షిణ భారత్ నుంచి వచ్చిన మా బృందంతో పాటుగా యావత్ దేశం నుంచి వచ్చిన 22 మందితో కూడిన పాత్రికేయ బృందానికి సోమనాథ్ వాయులింగ దర్శనాన్ని సాయంత్రం ఏడు గంటలకు కేటాయించారు. ఈ లోగా మా బృందంలో

ఒకరికి ఇంటర్నెట్ సెంటర్‌తో పనివడింది. ఆయనతోపాటుగా సెంటర్‌ను వెదికే పనిలో నేనూ చేరాను. అలా వెదుకుతుండగా ఒక టీ కొట్టు దగ్గర ముగ్గురు మిత్రులు కనిపించారు. వారి వయస్సు 50 ఏళ్లకు పైమాటే. సోమనాథ్ గురించి చెప్పుకుంటూ వచ్చారు. ఆ ముగ్గురు ఉండేది విరావల్‌లో. ఒకప్పుడు ఎనిమిది కి.మీ.ల దూరంలో ఉన్న సోమనాథ్ మందిరానికి కాళ్లకు చెప్పుల్లేకుండా నడుచుకుంటూ వచ్చి మరీ దర్శనం చేసుకునేవారట. కార్తికమాసం, ఇతర విశేషదినాల్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు బండ్లు కట్టుకొని వచ్చేవారట. పర్వదినానికి మూడు రోజుల ముందే అలా వచ్చే భక్తులు మందిరానికి సమీపంలో గుడారాల్లో విడిది చేసేవారు. జనవరి 12 (సోమవారం) సోమనాథుడి దర్శనం చేసుకొని తిరిగి వెళ్లేవారు. అలాంటి సమయాల్లో తాము మందిరం ఛాయలకు వెళ్లేవారం కాదని ఆ ముగ్గురు చెప్పారు. అప్పట్లా ఇప్పుడు నడిచి వెళ్లే వరిస్థితి లేదని, సోమనాథ్ చాలా మారిపోయిందని, రోడ్లు వెడల్పు అయ్యాయని, కొత్త కొత్త వ్యాపారాలు వచ్చాయని, భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగిందని చెప్పారు. ఆదివారం సాయంత్రమైంది. మా బృందానికి మందిరాన్ని సందర్శించుకునే సమయం ఆసన్నమైంది. మందిరం దగ్గర శనివారం అంత సందడి లేదు కానీ భక్తుల సంఖ్య బాగానే ఉంది. మందిర ప్రాంగణానికి ఒకవైపున భక్తులు వారి మొబైల్ ఫోన్లు భద్రపరచు కోవడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

మరోవైపు మెటల్ డిటెక్టర్ల మధ్య భక్తులను మందిరంలోకి పంపించే ఏర్పాటు ఉంది. మేమంతా ఆ ఏర్పాటు గుండా లోపలకు వెళ్లాం. మమ్మల్ని లోపలకు తీసుకొని వెళ్లిన వారు మాకు గంగాజలంతో కూడిన చిన్న డబ్బాను చేతికి అందించారు. మందిరంలోకి అడుగుపెట్టాం. లోపలకు వెళ్లగానే బూడిద రాసుకొని, శ్మశానం లో తిరిగేవాడికి ఇంత వైభోగం ఏమిటీ ముక్కంటి అని నాకైతే అనిపించింది. మందిరాకృతి, శిల్పకళా వైభవం అద్భుతమని పించింది. గర్భగుడి, ఆ చుట్టు పక్కల గోడలన్నీ బంగారు రేకులతో తాపడం చేసి ఉన్నాయి. కళ్లెదుట వాయులింగ రూపధారి శ్వేతవర్ణంలో మెరిసిపోతు న్నాడు. మహారాజులాగా వస్త్రంతో చేసిన గుజరాతీ సంప్రదాయ కిరీటంతో వెలిగిపోతున్నాడు. వాయులింగానికి అభిముఖంగా మూడు అడుగుల దూరంలో బంగారు తాపడం చేసిన గట్టు మీద ఏర్పాటుచేసిన రంధ్రాల్లో ఒక దాని నుంచి గంగాజలాన్ని సమర్పించుకున్నాను. మారేడు దళపు భక్త సులభుడు రాజకోట లాంటి సువిశాలమైన మందిరంలో కొలువు దీరి ఉండటాన్ని చూడటం నాకిదే మొదటిసారి. అది కూడా వెయ్యేళ్ల వేడుకల సమయంలో చూడటాన్ని మించిన అవకాశం ఇంకేమి ఉంటుంది. ఇంతటి మహోత్సవాన్ని చూసిన తర్వాత సోమనాథ్ మందిరానికి మరో వెయ్యేళ్ల వరకు ఢోకా లేదని నాకైతే అనిపించింది. ★



ఆర్ఎస్ఎస్‌కు, ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులకు వందనం

డా. హెడ్గెవార్ గురించి నాకు పెద్దగా తెలియదు. ఆయన జీవితం గురించి ఈ మధ్యనే చదవడం మొదలుపెట్టాను. కానీ ఆర్ఎస్ఎస్‌కు చెందిన కొందరు వ్యక్తుల గురించి నాకు తెలుసు. నాకు శ్రీ బాలాసాహెబ్ దేవరస్, శ్రీ హెచ్‌వీ శేషాద్రి, శ్రీ రామగోపాలన్, శ్రీ వీ రంగస్వామి, తదితరులు తెలుసు. మన దేశంలో ప్రతీ రాజకీయ పార్టీ ఓట్ల కోసమని సోషలిజమ్‌ను రకరకాల బ్రాండ్లతో జనం మధ్యకు అదే పనిగా వదులుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఒక పద్ధతి ప్రకారం దేశభక్తిని పాదుగొల్పుతున్న ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ మాత్రమే అని నేను చెప్పగలను. ఆర్ఎస్ఎస్‌లో ఉన్నవారు దేశభక్తిని మాటల్లో కాకుండా చేతల్లో కూడా చూపిస్తారు. వారిలోని నిస్వార్థాన్ని చూసి నేను సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. వ్యక్తిగత ప్రయోజనాలు లేదా గుర్తింపు కోసం ఆరాటపడే రాజకీయ పార్టీల కార్యకర్తలను నేను కలిశాను. కానీ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నాకు అలా కనిపించలేదు. అంతేకాకుండా ఉన్నత విద్యావంతులైన యువకులు సర్వం త్యజించి, అన్నింటికి తెగించి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలుగా రూపాంతరం చెందుతున్నారు. వారిలో ఎమ్మేలు, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, డాక్టరేట్ లర్లు ఉన్నారు. ఆర్ఎస్ఎస్‌కు అంకితం కావడం కోసం ఎంతో సంపాదించిపెట్టే పెద్ద పెద్ద ఉద్యోగాలను తోసిరాజన్నారు. నేను ఆసక్తి కొద్దీ కొంత మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను "మీకు మాత్రమే సాధ్యమైన పనిని ఇతర సంస్థలకు చెందినవారు ఎందుకని చేయలేకపోతున్నారు?" అని అడిగాను. అందుకు బదులిస్తూ వారు ఆ ఘనతను ఆర్ఎస్ఎస్ నుంచి పొందిన శిక్షణకు ఆపాదించారు. ప్రతీ ఇతర సంస్థ తన కార్యకర్తలకు శిక్షణ ఇస్తుంది. కానీ తేడా అల్లా దేశ సేవ కోసం సర్వస్వం త్యాగం చేసేందుకు స్ఫూర్తిని ఇచ్చే శిక్షణలోనే ఉంటుంది.

నేడు దేశం కోసం నిప్పుల మీద కూడా నడవడానికి సిద్ధంగా లక్షలాది మంది ఉన్నారు. అలాంటివారు మనకు ఆర్ఎస్ఎస్‌లో కనిపిస్తారు. అలాంటి సర్వోన్నతమైన, ఉత్తమమైన మానవులకు ఆలవాలమైనది మన భరత భూమి. అదే సమయంలో అలాంటివారిని ఒక పద్ధతి ప్రకారం తక్కువ చేసే రాజకీయ నాయకులు కూడా ఇదే గడ్డపై ఉన్నారు. ఈ దేశంలో ప్రతీ ఒక్కరు ఆర్ఎస్ఎస్ తరహాలో రాజీపడని దేశభక్తిని అణువణువునా కలిగి ఉన్న పక్షంలో మన దేశానికి సరితూగే దేశం ప్రపంచంలో ఉండదు కాక ఉండదు.

తమిళనాడులో రాజకీయ పార్టీలు "ఆత్మగౌరవం" అనే నినాదంతో అలమటించిపోతుంటాయి. కానీ వాటి నేతల్లో ఆత్మగౌరవం మచ్చుకైనా కనిపించదు. అసెంబ్లీలో మహిళలను వివస్త్రను చేయడం సహా అగౌరవకరమైన చర్యలకు పాల్పడుతుంటారు. ఎవరైనా ఇలాంటి చర్యలను ఆర్ఎస్ఎస్ కార్యకర్తల్లో రాతి వంటి నిశ్చలమైన ఆత్మగౌరవంతోనూ, ఆత్మవిశ్వాసంతోనూ పోల్చి చూడాలి. "మీ లక్ష్యాన్ని ఎప్పటికి సాధించగలరని అనుకుంటున్నారు? మీ దృక్కోణం ప్రకారం సామాజిక పరివర్తన సాధించడానికి ఎంత కాలం పడుతుంది?" అని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను అడిగాను. "మా లక్ష్య సాధనకు ఇప్పటి నుంచి మరో 50 సంవత్సరాలు పట్టినా సరే ఆ దిశగా పనిచేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని వారు బదులిచ్చారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మునిసిపాలిటీలు, అసెంబ్లీలు, పార్లమెంట్‌ను ఆక్రమించుకోవడం కోసం రాజకీయ పార్టీలు పీకల్లోతు పనుల్లో నిమగ్నమై ఉన్న తరుణంలో తన లక్ష్య సాధన కోసం 50 ఏళ్ల కాల వ్యవధిని ఏర్పరుచుకొని, నిశ్చలమైన విశ్వాసంతో ఆర్ఎస్ఎస్ ముందుకు సాగుతున్నది. "యావత్ జాతి పూర్తిగా పరివర్తన చెందడాన్ని చూడాలని అనుకుంటున్నాం" అని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అన్నారు. ఈ హిమోన్నత శిఖరాలను నేను ఆరాధిస్తున్నాను. కానీ వ్యక్తిగతంగా నేను నిస్సహాయుడ్ని. తగినంత క్రమశిక్షణ లేని నేను ఆర్ఎస్ఎస్‌లో చేరలేను. ఆర్ఎస్ఎస్ కార్యకర్తల్లో కనిపించే క్రమశిక్షణ అనూహ్యమైనది. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు చేరుకున్న శిఖరాలను ప్రస్తుత పరిస్థితితో పోల్చి చూసినప్పుడు నాకు సంతృప్తి కలుగుతుంది.

కొన్నేళ్ల క్రితం సేలంలో ఆర్ఎస్ఎస్ శిక్షణశిబిరానికి వెళ్లాను. అక్కడ కులాల మధ్య తేడాలు మచ్చుకైనా కనిపించలేదు. కులతత్వం లేని ఏకైక సంస్థగా ఆర్ఎస్ఎస్ ఉంది. అదే తమిళనాడులో చూస్తే కుల సంఘాలకు చెందిన పోస్టర్లు , కార్యాలయాలు అడుగడుగునా కనిపిస్తాయి. రాజకీయ పార్టీల కారణంగా ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైంది. ప్రజలు కూడా కులం వెనుక పడిపోతుంటారు. కానీ ఆర్ఎస్ఎస్



అలాంటి పనులకు పాల్పడిందనే సంగతిని ఎవరైనా విన్నారా? ఆర్ఎస్ఎస్‌లో మీ కులం ఏమిటని ఏ ఒక్కరూ మిమ్మల్ని అడగరు. ఈ విషయంలో ఎంతో విశాల హృదయాన్ని కలిగి ఉన్న ఆర్ఎస్ఎస్ అంటే నాకెంతో గౌరవం. ఆర్ఎస్ఎస్‌ను సమర్థించడం అంటే సెక్యులరిజానికి వ్యతిరేకమని కొందరు భావిస్తారు. కానీ దానర్థం ఎవరైనా ఒకరు తాను హిందువు అని గర్వించడమంటే అది సెక్యులరిజానికి వ్యతిరేకమని అనుకోవాలా? ఇది అసంబద్ధమైనది. నన్ను నేను ఒక హిందువు అని చెప్పుకోవడానికి నేనెంతో గర్విస్తాను.

ఒక హిందువు హృదయం ఒక్క మానవాళినే కాకుండా యావత్ సృష్టిని తనదిగా చేసుకుంటుంది. అతడు లేదా ఆమె మానవాళి కోసమే కాకుండా ద్విపాద జీవులు, చతుష్పాద జీవులు, పక్షులు, భూమండలం ఇలా యావత్ సృష్టి యోగక్షేమాల కోసం ప్రార్థిస్తారు. మన మంత్రాల్లో కూడా అదే ఉంది. హిందువు ఎప్పుడూ కూడా తన స్వార్థం కోసం ప్రార్థించడు. యావత్ మానవాళి సంక్షేమం కోసం, సకల జీవరాశుల బాగోగుల కోసం ప్రార్థిస్తాడు. అలాంటి ఒక గొప్ప ధర్మాన్ని ఆజన్మాంతం ఆచరించే వ్యక్తి సెక్యూలరిస్టును అని పిలిపించుకోవడం కోసం తనను తాను హిందువు అని చెప్పుకోవడానికి సిగ్గుపడటం అనేది సెక్యులరిజం అనిపించుకోదు. అది కేవలం ఆత్మవంచన తప్ప మరొకటి కాదు. అలాగని చెప్పి ఇతర మత విశ్వాసాలను తక్కువ చేసి చూడాల్సిన అవసరం లేదు. పైన పేర్కొన్న భావాలన్నింటినీ ఆర్ఎస్ఎస్ పుణికిపుచ్చుకున్నదని నాకు తెలుసు. అయినప్పటికీ జాతి వ్యతిరేకి అంటూ ఆర్ఎస్ఎస్ గురించి కొందరు వ్యక్తులు చెడుగా మాట్లాడుతుంటారు. ప్రజల్లో దేశభక్తిని పాదుగొల్పుతూ, అంతర్జాతీయ సమాజంలో భారత్‌ను అగ్రనేతగా నిలిపే లక్ష్యంతో పనిచేస్తున్న ఈ సంస్థ ప్రతిష్టను మసకబార్చడానికి ప్రయత్నిస్తుంటారు. ఇది అత్యంత అభ్యంతరకరమైనది. మరికొందరైతే ఎలాంటి కారణం లేకుండా ఆర్ఎస్ఎస్‌ను బహిరంగంగా విమర్శిస్తుంటారు. కానీ వ్యక్తిగతంగా ఆర్ఎస్ఎస్‌కు కరడుగట్టిన మద్దతుదారులుగా ఉంటారు. అలాంటి ఒక గొప్ప సంస్థను స్థాపించిన మహోన్నత వ్యక్తికి అత్యంత వినమ్రతతో శిరసు వంచి నమస్కరిస్తున్నాను. ఆయన ఒక యోగి, తత్వవేత్త, సమర్థమంతమైన నిర్వాహకులు, సర్వలక్షణ శోభితులు.

– చో ఎస్.రామస్వామి (దివంగత పాత్రికేయులు)

గళమెత్తి గతం

ఏ యుద్ధం, ఎందుకు జరిగింది? ఏ రాజ్యం ఎన్నాళ్లుంది? రాణుల ప్రేమ పురాణాలు.. ఇవి మాత్రమే చరిత్రా? కాదు! ప్రాచీన భారత శాస్త్రసాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధనలు, వాటి ఫలితాలు చరిత్రపుటలకు ఎందుకు చేరకూడదు? క్యాలుక్‌లస్ కనిపెట్టింది ఐజాక్ న్యూటన్ (1643-1721) అని చదువుతాం. కానీ సంగమ గ్రామానికి (కేరళ) చెందిన మాధవుడు (1340-1425) అనే గణిత శాస్త్రవేత్త క్యాలుక్‌లస్ మూలకర్త అని ఇటీవలి గణితశాస్త్ర సమాజం అంగీకరిస్తున్నది. క్యాలుక్‌లస్‌కు మూలమైన 'అవకలన, వ్యవకలనాలను' నిర్వచించి, ఎలా ప్రయోగించాలో వర్ణించారాయన. అందుకే టేలర్ సీరిస్‌ను ఇంటర్ మీడియట్ గణిత పుస్తకాల్లో ఇప్పుడు మాధవ-టేలర్ సిరీస్ అని పిలుస్తున్నారు.

అనంతం.. మన వైజ్ఞానిక మేధో చరితం

ఒక్క గణితంలోనే కాదు, ఖగోళ, లోహ విజ్ఞానం, భాషాశాస్త్రం, జీవ, వైద్య శాస్త్రాల్లో సైతం ప్రాచీన భారతీయులు సాధించిన పురోగతిని చరిత్రకారులు జన సామాన్యానికి చేర్చాలి. సుదీర్ఘ అంతర్జాతీయ వైజ్ఞానిక మేధో చరిత్రలో భారతీయుల స్థానాన్ని నిరూపించాలి.

కేరళలోని ఇరింజలకుడ సమీపంలోని సంగమ గ్రామంలో మాధవుడు (1340-1425) జన్మించాడు. మధ్యయుగ భారతదేశపు గొప్ప గణిత, ఖగోళ శాస్త్రవేత్తలలో ఒకరు. ఆయనను కేరళ ఖగోళ గణితశాస్త్ర చింతనకు వ్యవస్థాపకునిగా పరిగణిస్తారు. క్యాలుక్‌లస్ పితామహులు అని చెబుతున్న న్యూటన్, లైబ్నిజ్‌ల కంటే సుమారు 250 సంవత్సరాలకు ముందే ఆ పరికరం ప్రాథమిక సూత్రాలను, ముఖ్యంగా ఇన్ఫినిట్ సీరీస్ గురించి మాధవుడు వివరించాడు. త్రికోణమితి ప్రమేయాలైన సైన్, కోసైన్, టాంజెంట్‌లకు సంబంధించిన విస్తరణలను (పవర్ సీరీస్)ను ఆయన కనుగొన్నాడు. వీటిని టేలర్ సీరీస్ అని ఇప్పుడు పిలుస్తున్నారు. వృత్త పరిధిని లెక్కించడానికి మాధవుడు ఒక అంతులేని శ్రేణిని ఉపయోగించి "π" పై విలువను 11 దశాంశ స్థానాల వరకు కచ్చితంగా లెక్కించాడు. (π = 3.14159265359). గ్రహగమనాన్ని, చంద్రుడి స్థానాలను లెక్కించడానికి కచ్చితమైన పద్ధతులకు ఆయన అభివృద్ధి చేశాడు. దురదృష్టవశాత్తూ ఆయన గ్రంథాలలో చాలావరకు కాలగర్భంలో కలిసిపోయినప్పటికి 'వేణు వారోహం', 'స్ఫుట చంద్రాపి' వంటివి మిగిలాయి. ఆయన శిష్యులు నీలకంఠ సోమయాజి, పరమేశ్వర, జేష్ఠదేవ లాంటివారు మాధవుని గణితసూత్రాలను తమ గ్రంథాలలో ఉదహరించి, ఆయన గొప్పతనం ప్రపంచానికి వెల్లడించారు. నీలకంఠ 'తంత్ర సంగ్రహ', జేష్ఠదేవ 'యుక్తి భాస' (మలయాళంలో) రాశారు.



జి.జి.జోసఫ్ 'ది క్రెస్ట్ ఆఫ్ ది పీకాక్: నాన్ యూరోపియన్ రూట్స్ ఆఫ్ మేథమేటిక్స్' అనే గ్రంథంలో, 'మాధవుడు మెథమెటికల్ ఎనాలసిస్‌కు మూల పురుషుడు. బహుశ ఆయన వేయి సంవత్సరాలకు పూర్వమే ఇక్కడ మరో గణిత శాస్త్రవేత్త పుడతాడని ఊహించాడేమో! అందుకే శ్రీనివాస రామానుజన్ కుంభకోణంలో పుట్టాడు. ఈ ఊరు మాధవుడి పుట్టిన ఊరుకు దగ్గర్లోనే ఉంది.' అని రాశారు. గణితశాస్త్రంలోని కాలిక్యులేషన్స్ వలన ప్రయోజనం ఏమిటి? ఎక్కడ పనికి వస్తాయి? అన్న ప్రశ్నకు సమాధానం 7వ తరగతి గణితశాస్త్ర పాఠ్యపుస్తకం ముందు మాటలో, 'విశ్వాంతరాళంలోని రెండు వస్తువుల మధ్య దూరాన్ని, ఆ రెండిటి మధ్య పనిచేసే బలాలను లెక్క గట్టడానికి గణితశాస్త్రం పనికి వస్తుంది' అని రాశారు.

గణితం గురించి అసాధారణమైన అంచనాలు ఉండడం సహజమే. ఆచార్య పుదూరు విశ్వనాథ అరుణాచలం (1935-2020) గణితశాస్త్ర ప్రయోజనాన్ని తన గ్రంథం 'సంగవిద' (సంక్షిప్త గణిత విశ్వదర్శిని)లో పద్యరూపంలో చెప్పారు.

'విశాలవిశ్వమున భూరి రహస్యములెల్ల విప్ప/ ఈ మానవ జాతి మనుగడకు మంచి యుగున్ గణితము వల్లనే/ గణితము సౌందర్యమునకు వినియోగమునకు నెలవని వివరింపదగున్/ వినియోగము సేవక వృత్తిని సౌందర్యమ్ముదాత్త తేజము'. అన్నారు. గణితం ప్రయోజనాన్ని, గణితానికుండే సేవక స్వభావాన్ని, సౌందర్య ఉదాత్తతను గురించి స్పష్టం చేశారు. గణిత శాస్త్రానికి సంబంధించి అబ్జర్వేషన్, పరిశోధనలలో మేథమెటికల్ మోడల్ ఎలా దోహదపడతాయో వివరించాడు.

మరొక పద్యం: **'టి.సి.ఎన్., ఏ.ఐ.లను బాసిల్లగజేసి తనదు పరిశోధనలన్**
వాసిగని అలాన్ టూరింగ్ నూసైడుకు పాల్పడియెను క్షోభమిగిల్చెన్'

ఇందులో థీరిటికల్ కంప్యూటర్ (టి.సి.యస్), ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏ.ఐ) ఇంకా, టూరింగ్ సూసైడ్ వంటి పదాలు వాడారు. టూరింగ్ (1912-1954) బ్రిటిష్ గణిత శాస్త్రవేత్త, కంప్యూటర్ పితామహుడు. రెండవ ప్రపంచ యుద్ధంలో 'ఎనిగ్మామిషన్' ద్వారా కోడింగ్ సంకేతాలను ఛేదించి తద్వారా జర్మన్ యుద్ధ వ్యూహాలను ముందుగా తెలుసుకోవడం ద్వారా ఆ యుద్ధానికి ముందుగానే ముగింపు పలికాడు. తద్వారా ఆధునిక కంప్యూటింగ్, కృత్రిమ మేధకు పునాదులు వేశాడు. ఇంగ్లండ్‌లో స్వలింగ సంపర్కం నిషిద్ధం. అలెన్‌పై ఆ నేరం మోపి జైలు శిక్ష వేశారు. అది భరించలేక యాపిల్ ముక్కను పొటాషియం సైనైడ్‌లో ముంచుకొని తిని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని శతజయంతి సందర్భంగా 2012లో 48 ఏళ్ల తరువాత బ్రిటిష్ ప్రభుత్వం క్షమాభిక్ష ఇచ్చింది.

ఇంతకీ గణితం శాస్త్రమా? కళా? దీనికి సమాధానం కీ॥పూ॥ 1200 కాలానికి చెందిన 'లగధ ముని', ***'మనకీ మీమాంస వలదు మహిలో/ శాస్త్రమ్మున కాత్మాయగున్, కళకు ఘన భూషణమై చెలంగు'*** అని చెప్పాడు. బోధాయనుడు (కీ॥పూ॥ 800-740) సమకోణ త్రిభుజపు సూత్రం (పైథాగరస్ థీరమ్) ప్రతిపాదించినా, ఆ కీర్తి అతనికి దక్కలేదు. ఆర్యభట్ట-1, ఆర్యభట్ట-2, వరహ మిహిరుడు, భాస్కర, బ్రహ్మగుప్త, పావులూరి మల్లన, విరహాంక, హేమచంద్ర, గోపాల, నారాయణ పండితుడు, పరమేశ్వర పింగళాచార్యుడు, ఎల్లయ్య మంత్రి, శ్రీధర, వేదం లక్ష్మీనారాయణ, తడకమళ్ల వేంకటకృష్ణారావు, మల్లికార్జున సూరి, వల్ల భామాత్యుడు, హరిశ్చంద్ర, పిడపర్తి కృష్ణమూర్తి, తెన్నేటి వేంకట సుబ్బారావు, శ్రీనివాసరామానుజన్, ఆర్.సి.గుప్తా, ఆర్. వైద్య స్వామినాథన్, సి.టి.రాజ గోపాల్, గోవిందస్వామి, ఒమ్మి రామస్వామి, ఎస్.మీనాక్షి సుందరం, శ్రీపతి, పి.సి.మహల్నోబిస్, దత్తాత్రేయ రామచంద్ర కాప్రేకర్, శంకర నారాయణ, లక్కోజు సంజీవరాయ శర్మ, పి.ఎస్. శేషాద్రి, శకుంతలాదేవి, మహావీరాచార్యుడు, వంటి భారతీయుల గురించి వారి గొప్పతనం గురించి ఖణేల్, ఖణేల్‌మని పూదూరు రాశారు. ఆంధ్రప్రదేశ్, కడప ప్రాంతానికి ప్రొద్దుటూరుకు చెందిన లక్కోజు సంజీవరాయశర్మ గురించి ***'పుట్టుకతో లేవు కనులు/దిట్ట గణిత లేఖనమున/ తికమక పరిచే గట్టి సమస్యలనెన్నో అట్టే/ఎదుర్కొనెను శర్మ అతనిని దలతున్'*** అన్నారాయన.

12వ శతాబ్దానికి చెందిన ఎలుగంటి పెద్దన గురించి, ***'తెలుగున గణిత గ్రంథంబులు రచియించుట సకృతు పూర్వము/ ధృతితో వెలుగంటి పెద్దనార్యుడు వెలయించే నొక/ గణిత కృతి వినతుల తనికిన్.'*** అని పూదూరు రాశారు. కెనడాలో గణితవేత్తగా రాణించిన తిరుపతి వాసి మతుకుమల్లి వేంకట సుబ్బారావు (1921-2006) గురించి కూడా పద్యం చెప్పారాయన. దాదాపు వేయేళ్లపాటు మతం గుప్పిట్లో నలిగిన శాస్త్ర విజ్ఞానం ఐరోపాలో చచ్చుబడింది. కానీ వారిని గెలీలియో మేల్కొల్పాడు అని చెపుతారు పూదూరు. ఈ కాలానికి మధ్యయుగం (అంధయుగం) అని పేరు పెట్టారు.

విశ్వంలో ప్రాథమికమైన నాలుగు బలాల్లో గురుత్వాకర్షణ శక్తి ఒకటి. మిగతావి విద్యుదయస్కాంత శక్తి, బలహీన అణుశక్తి, బలమైన అణుశక్తి. ద్రవ్యరాశి లేదా శక్తి కలిగిన రెండు వస్తువుల మధ్య ఆకర్షణ గుణమే గురుత్వాకర్షణ. వస్తువు నేల మీద పడటమే కాదు, నక్షత్రాల చుట్టూ గ్రహాలు తిరగటం, చంద్రుడి మూలంగా సముద్రాల్లో అలలు రావడం వంటివన్నీ దీని ఫలితమే. వస్తువులు క్రింద ఎందుకు పడతాయి అనే దానిపై ప్రాచీన శాస్త్రవేత్తలు రకరకాలుగా అభిప్రాయపడ్డారు. ఏ వస్తువులైనా విశ్వకేంద్రం వైపు ఆకర్షితమవుతాయన్నది గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ భావన. విశ్వానికి కేంద్రం భూమి, మధ్యలో ఉంది. కాబట్టి వస్తువులు కిందపడతాయని నమ్మకం, తరువాత ఈ భావనకు కాలం చెల్లింది. గ్రహాలు సంచరించే మార్గాలను బట్టి సౌర

శ్రీనివాస రామానుజన్

సంజీవరాయ శర్మ


నికోలస్ కోపర్నికస్


గెలీలియో

ఆర్యభట్టు

ఆదిశంకర

భాస్కరాచార్యుడు

మండలానికి సూర్యుడే కేంద్రమని తోస్తుందని కోపర్నికస్ (1473–1543) సూత్రీకరించాడు.

గెలీలియో కాలం వరకు (16వ శతాబ్దం) గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ సిద్ధాంతమే ప్రాచుర్యంలో ఉండేది. గెలీలియో గెలిలో (1564–1642) ఒక విప్లవాత్మక ఇటాలియన్ ఖగోళ శాస్త్రవేత్త. టెలిస్కోప్‌ను ఆవిష్కరించాడు. సూర్యకేంద్ర నమూనా (సూర్య కేంద్రీకృత విశ్వం) ను సమర్థించి, ప్రయోగాత్మక శాస్త్రీయ పద్ధతిని స్థాపించినందుకు "ఆధునిక శాస్త్ర పితామహుడు"గా అభివర్ణించారు. ఇది కాథలిక్ చర్చితో వివాదానికి, గృహ నిర్బంధానికి దారి తీసింది. కాబట్టి శాస్త్ర ఆవిష్కరణలను చర్చి స్వాగతించలేదని గ్రహించాలి.

అరిస్టాటిల్ సిద్ధాంతాన్ని తప్పు అని నిరూపించడానికి పిసా ప్రయోగం చేశాడు. వేరు వేరు ద్రవ్య రాశులు గల వస్తువులు వాటి ద్రవ్యరాశితో సంబంధం లేకుండా ఒకే వేగంతో కింద పడతాయని నిరూపించడానికి పిసా నగరంలో (ప్రసిద్ధ కథ) వాలు టవర్ పైనుండి వస్తువులను (ఒకటి పెద్దది, మరొకటి చిన్నది) జార విడువగా అవి ఒకేసారి కింద పడతాయని, బరువైన వస్తువులు, తేలికైన వాటి కంటే ముందు పడతాయనే అరిస్టాటిల్ సిద్ధాంతాన్ని తోసిపుచ్చాడు.

సూర్య–కేంద్రీకృత సౌరవ్యవస్థకు మద్దతు ఇవ్వడంపై గెలీలియోను కాథలిక్ చర్చి 'మత విశ్వాసాలను తీవ్రంగా అవమానించాడని' నిర్ధారించి, జీవితాంతం గృహ నిర్బంధం చేసింది. కోపర్నికస్ సూర్యకేంద్ర వాదానికి మద్దతునిచ్చాడని తేల్చారు. 1642లో 77 ఏళ్ల వయసులో మరణించాడు. మతద్రోహిగా పరిగణించడం వలన ఆయనకు స్మారక చిహ్నం నిర్మించడాన్ని వ్యతిరేకించారు. కానీ చర్చిని ప్రశ్నించి శాస్త్రాన్ని నిలబెట్టినందుకు గుర్తుగా అభిమానులు ఆయన బొటనవేలును, ఒక పన్నును, మధ్యవేలును మరణానంతరం సేకరించి ఒక గాజుకుప్పిలో భద్రపరిచారు. 1992లో పోప్ జాన్‌పాల్ గెలీలియో సిద్ధాంతాలు సరైనవని, చర్చి తప్పు చేసిందని అధికారికంగా ప్రకటించారు. గెలీలియో సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని న్యూటన్ (1643–1727) గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని మరో కోణంలో విశదీకరించాడు.

మధ్య యుగకాలం భారతదేశంలో వైజ్ఞానిక రంగంలో ఎన్నో అద్భుతాలు జరిగాయి. ఆర్యభట్టు (475–555) రాసిన 'ఆర్యభట్టీయం' గొప్ప గణిత గ్రంథం. భూమి తన అక్షం మీద తాను పరిభ్రమిస్తుందని ఆనాడే ప్రతిపాదించాడు. ఈ సృష్టికే మూల బిందువు 'సున్న'. అటువంటి దాన్ని వాడి సంఖ్యల స్థాన విలువలను సిద్ధాంతపరంగా రూపొందించిన మహనీయుడు ఆర్యభట్టు. ఆయన (920– 1000) కాలంలో జీవించిన ఆర్యభట్టు అనే మరో గణితశాస్త్రజ్ఞుడు ఉన్నాడు. ఈయన 'మహా సిద్ధాంతం లేక ఆర్య సిద్ధాంతం' అనే గ్రంథం రాశాడు. అందులో అక్షరాలు, పద్యాలలో సంఖ్యలను వ్యక్తం చేయడానికి 'కపటయాది' అనే పద్ధతి సూచించాడు. గ్రంథంలోని మొదటి12 అధ్యాయాలలో దీర్ఘకాలం గ్రహాల గమనం, చంద్రుడు, చంద్రవంక, ఉదయించడం, అస్తమించడం, గ్రహాల కలయిక, ప్రతి దానితో గ్రహాల అనుబంధం, నక్షత్రాలు మొదలైనవి, తదుపరి ఆరు అధ్యాయాలు జ్యామితి, భౌగోళిక శాస్త్రం, బీజగణితం, గ్రహాల రేఖాంశాలను లెక్కించడం మొదలైన విషయాలు ఉంటాయి.'పై' విలువ 'గోపీ భాగ్య మధువ్రాత' అనే శ్లోకంలో పొందుపరిచారు.

గురుత్వాకర్షణ సిద్ధాంతకర్త న్యూటన్ అన్న ఖ్యాతి ఉన్నా, ప్రాచీన భారతీయ గ్రంథాలలో ఆ సిద్ధాంతం గురించి ప్రస్తావనలు ఉన్నాయి. 'సూర్య సిద్ధాంతం' ఆర్యభట్టు విరచితమని ప్రసిద్ధి. కాని ఇది ఆయన శిష్యురాలు లతాదేవి రాశారన్న మాట కూడా ఉంది. దానిలో 12వ అధ్యాయం 32వ శ్లోకం ఇలా చెబుతున్నది–"ధారణాత్మక శక్తి కారణంగా భూమి ఆకాశంలో పడిపోకుండా నిలబడి ఉన్నది' అని చెప్పాడు.

వరహమిహిరుడు (505) తన "పంచ సిద్ధాంత గ్రంథంలో 'భూతలంలోని ఏ భాగంలో అయినా అన్ని జ్వాలలు పైకి ఎగసివస్తాయి. పై నుండి వేసిన వస్తువు కింద పడుతుంది. ఈ అనుభవం అందరికి తెలిసినది, సమానమైనదే' అంటాడు (13అ–11 శ్లో).

భాస్కరాచార్యుడు (కీ॥శ॥1114) 'సిద్ధాంత శిరోమణి' అనే గ్రంథంలోని భువనకోశం సర్గలో 'భూమి గురుత్వాకర్షణ శక్తి కలిగి ఉంది. ఖగోళంలో గ్రహాల ఆకర్షణ శక్తి వల్ల ఉన్నాయ'ని వివరించాడు. అదే అధ్యాయం, 6వ శ్లోకంలో, 'భూమి ఆకాశంలోని వస్తువులను సహజంగా, స్వశక్తితో.... తన వైపునకు ఆకర్షిస్తుంది. ఈ ఆకర్షణ వలన అన్ని వస్తువులు భూమి మీద పడతాయి.' అంటాడు. నిజమే, ఆకాశంలోని వివిధ గ్రహాల మధ్య సమాన ఆకర్షణ శక్తి ఉన్నప్పుడు అవి ఎక్కడ పడతాయి, పడవు.

బ్రహ్మగుప్తుడు (కీ.శ.591) రచించిన 'బ్రహ్మ స్ఫుట' సిద్ధాంతంలో 'వస్తువులు భూమి వైపు ఆకర్షితమవుతాయి. నీటికి ఎలా సహజ ప్రవాహశక్తి ఉందో, అలా భూమికి సహజమైన ఆకర్షణ శక్తి ఉంది' అని చెప్పారు. జగద్గురు ఆదిశంకరులు 'ప్రశ్నోపనిషత్ భాష్యం'లో 'అపాన' శక్తిని గురించి, 'ఒక వస్తువు పైకి ఎగురవేస్తే దానిని ఎట్లు భూమి ఆకర్షిస్తుందో... అటులనే పైకిలాగబడే ప్రాణశక్తిని అపానశక్తి కిందకు లాగుతుంది (3 అ 8శ్లో) అన్నారు.

కాబట్టి ఈ సుదీర్ఘ విజ్ఞాన శాస్త్ర చరిత్రలో భారతీయులకు సముచిత స్థానం ఉన్న సంగతి విశ్వానికి తెలియాలి.

మూలం:

1) Madhava of Sangamagrama - (1)J.J.O. Commor and (2) F Robertson. 2) A History of the Kerala School of Hindu Astronomy - K.V. Sharma.

డా. కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

కథ

జూన్ నెల ఎండలు మిటమిట మంటూ పేట్రేగిపోసాగాయి. పెద్దసారు బడిబాటలో భాగంగా ఉదయమే మన హాబిటేషన్‌లో కాన్వాసింగ్ చేద్దామని చెప్పిండు. నేను, బయోసైన్సు సారు, పెద్దసారు ఆరోజు ముగ్గురం మా ఉన్నత పాఠశాలకు దగ్గర్లోని సందుగొందుల్లో, ఇరుకుగల్లీలలో తిరగసాగాం. అక్కడక్కడ మా స్కూల్ పిల్లలు కన్పిస్తుంటే ఆరవ తరగతి అడ్మిషన్లకొరకై కొత్త పిల్లల ఇండ్ల జాడ చెప్పమంటూ ఆ ఊరి పిల్లల సహాయం తీసుకుంటూ ముందుకెళ్లసాగాం.

బయోసైన్సు సారు యస్‌సిఇఆర్‌టిలో గత ఇరవై ఐదేండ్లుగా రిసోర్స్ పర్సన్. నెలలో దాదాపు పదిహేను రోజులు హైదరాబాదులోనే ఆన్ డ్యూటీ ఉంటుంది అతనికి. అభ్యాస దీపికలు,పాఠ్యపుస్తకాల రచయితగా బిజీ అతను. దానికి తోడు మా పెద్ద సారుది కూడా బయోసైన్స్ సబ్జెక్టే గనుక ఆయన తనకూ పన్నెండు పీరియడ్స్ టైంటేబుల్లో కేటాయించుకొని పాఠాలు చెప్పవట్టి గనుక బతికిపోయాం లేకుంటే మాకు నో లీజర్.

బడికి వచ్చినపుడు మాత్రం ఆయన క్లాసులకు తప్పకుండా వెళ్తాడు. బోధనకు దూరం కాని అతడి ప్రవర్తన మాకెంతో నచ్చుతుంది.“ఇదేమిటి సార్? ఇంత ఘోరమైన పరిస్థితి దాపురించింది ప్రభుత్వ బడులకి..ఇల్లిల్లూ తిరుగుతూ మీ పిల్లల్ని మాబడిలో చేర్పించండి అని బిచ్చమెత్తుకున్నట్టు ఉంది.ఎనభైలలో ప్రభుత్వ బడులు నిండా విద్యార్థులతో ఎంత కళకళలాడుతూ ఉండేవని..! ఇప్పుడిలా లీస్ట్ స్ట్రెంత్‌తో కొనఊపిరి రోగిలా కొట్టుమిట్టాడవట్టే..” అన్నాడు దిగులుగా.

హైదరాబాద్ రిసోర్స్ పర్సన్‌గా బడి సాధక బాధకాలు ఎరిగిన వ్యక్తిగా అతని సీనియారిటీ సిన్సియర్‌గా గొంతులో ప్రతిధ్వనించింది. “తప్పదు కదా! మన డీఈవో గారి ఆదేశాల మేరకు ప్రతిఏటా బడి పునఃప్రారంభ సన్నాహాలలో భాగంగా ఈ వారం రోజులు అడ్మిషన్ల కొరకు వచ్చే కొత్త పిల్లల్ని కనిపెట్టాలి. అటుపిమ్మట మండల కేంద్రంలో టెక్స్ట్ బుక్స్ తీసుకోవాలి. యూనిఫాంలు, రైసుబ్యాగుల నిల్వలు సరి పోల్చుకోవాలి. ఎంత హెచ్ఎం ఐనా మాకూ తప్పని తిప్పలే.. !పిల్లల సంఖ్యతో బడి నిండాలి.

విద్యార్థుల సంఖ్య పెరిగితేనే. రేపు మన ఉద్యోగాలకు కొంత భద్రత. లేకుంటే ఉన్న పోస్టులు పోయే ప్రమాదం. రాబోయే జెనరేషన్లకు ఉపాధ్యాయ ఉద్యోగాలు దొరకవు..!” అన్నాడు విజ్ఞతగా.

మెచ్చుకోలుగా చూశాను ఆయన వంక.

వచ్చే ఎండాకాలం ఆయన ఉద్యోగ విరమణ. ఆదర్శ మార్గదర్శకుడిగా..కొన్ని బరువులు, బాధ్యతలు హెచ్ ఎంలకు తప్పవు కదా. ఓ ఇంటి మందు ఉన్న ఇద్దరు తల్లులు ఆ పక్కనే ఆడుకుంటున్న పది పన్నెండేళ్ల పిల్లలను పిల్చి.. “మన ఊరిలోని మన ప్రభుత్వ బడిలో చేరాలి. గవర్నమెంట్ స్కూలల్ల మంచిగ సదువు చెప్పే టీచర్లు ఉంటరు. మేమంతా మంచిగ చదివిపిస్తం. మీరంతా మా బడిల్నే అడ్మిషన్ తీసుకోవాలి..!” అంటూ ఆయన ముందే తయారు చేసి ప్రింటు తీయించిన పాంప్లెటును అక్కడున్న ఓ తల్లి చేతిలో పెట్టాడు.

అంతే ఆవిడ గయ్యిమంటూ లేచింది “ ఓ మస్తు జెప్తున్నరు.. ఏందీ మీ సర్కారు బడిల మా పిల్లల్ని ఎయ్యాల్నా?అక్కడ సదువు మంచిగ అస్తలేదనే మొన్ననే నా బిడ్డను ప్రైవేట్ బడిల ఏశిన. మీ బడి పిల్ల గాండ్లయి నోటుబుక్కులు చినిగిపోయి



అన్నీ నావాళ్ళే

బి.కళాగోపాల్

ఉంటాయి. సమయానికి పుస్తకాలు ఇయ్యరు. మీరు మా దగ్గర అన్ని ఉన్నాయి అని చెప్తరు. కంప్యూటర్లు ఉన్నాయి, యూనిఫామ్ లిస్తం, ఆటలాడిస్తాం, వారానికి మూడు కోడిగుడ్లతో భోజనం పెడ్తం, రాగుల జావ రోజూ ఇస్తాం.. అని అంటారు.. కాని వంట ఏజెన్సీలోళ్లకు దగ్గర సాలినన్ని పైసల్లేక గివన్నీ పెట్టనే పెట్టరు. నేను సుత సర్కారు బడిల్నే గప్పట్ల వంట జేసిన. పిల్లలు తక్కువనీ బర్కత్ వడతలేదని నేనే బంజేషిన మీరు రాక ముందులెండ్రి. పైసలు సరిపోక నాసిరకం పప్పులు, నూనెలు వాడతరు. కూరగాయలు సరిపోయినంత వేయక.. పోరగాండ్లకు పల్సటి పిండి పప్పుచారుతో అన్నం బెడ్తరు. వాంతులైతయి. విరోచనాలైతయి. పిల్లలకు సరిగ్గా మూత్రశాలలు లేవు. కాంపౌండ్ గోడ కూలిపోయి ఉంది, పైకప్పులు గట్టివాన పడకముందే ఊరుస్తయి. గదులల్ల బండలు ఊడిపోయి ఉంటాయి. మీ దగ్గర అటెండర్ లేడు మాకు తెల్సు. మాది గిదే ఊరు. నేను కూడా సూసిన అమ్మో! మా పొల్లగాండ్లు మీరు రాక ముందు ఊడ్సుడు, కంకర రాళ్లు ఏరుడు. ఎన్నిసార్ల పేపరోల్లు అచ్చి ఫోటోలు కొట్టుకొని పోలే. గీ నడుమ జెర నయమైంది. ఒక ఆడా మెను పెట్టినట్టుండ్రు. మా నుట్టాలామెనే ఆమె. ఇగ మీరిచ్చేగా యూనిఫాంలు ఐతే నాలుగు ఉతుకులకే రంగు ఎల్సిపోయి పల్సవడి షినిగి పోవట్టినయి. గా బట్టలు ఎన్ని రోజులు ఆగవు. చినిగితే కుట్లు ఏపిచ్చుడు, కాంటలు వెడితే పొక్కులు వడి బట్టలు ఖరాబు.గిన్ని పరేషాన్లు ఎందుకని.. అబ్బో! నా బిడ్డను దగ్గర్లోని ప్రైవేటు బడికే పంపి సదివించుకున్నది పోపు (మంచిది)..” అంటూ ఏకబిగిన మమ్మల్ని ఏకిపారేసింది.

ఎంతైనా సర్కారు బడి అంటే అందరికీ అలుసే! ఇక అంతే! మా బడి గురించీ మాకున్న ప్రతిభా ప్రావీణ్యాల గురించి, మా బోధనలోని నాణ్యత గురించి చెప్పుకునే అవకాశం ఇవ్వలేదా మహాఇల్లాలు, మా ముగ్గురి ముఖాలు ఘ్రాస్పడి పోయాయి.ఆవిడ తిట్ల దండకానికి తోడు సూర్యుడి ఎండతీవ్రతా హెచ్చసాగింది. ఎండ మొహం నుండి నడినెత్తి దాకా పాకసాగింది.

ఓ ఇంటి అరుగు మీద కాసింత చెట్టు నీడ కనిపిస్తుంటే కుర్చొన్నాం.

పాపం ..పెద్ద సారు ముఖంలో కత్తి వేటుకు నెత్తురు చుక్కలేదు. నాకూ బాధగా అన్పించింది. మా వివరణ వినకుండానే ఆమె అలా నలుగురి ముందు మమ్మల్ని అన్నేసి మాటలు అన్నందుకు ఇంకా చెప్పాలంటే ఆమె చెప్పిన సత్యవాక్కుల ముందు మేం మా బడిలో ఇవన్నీ ఉన్నాయి అని గట్టిగా వత్తాసు పల్కలేని మా నిస్సహాయతకు లోలోన మేమెంతో సిగ్గు పడిపోతున్నాం.

తెచ్చుకున్న నీళ్ల బాటిల్‌తో జెరంత గొంతు తడుపుకొని పరేషాన్ అవుతూ కర్చీఫ్‌తో ముఖం తుడ్సుకుంటున్న మా పెద్దసార్ తోటి”సార్ గిదేంది?గా తల్లి గింత గానం తిట్ల పురాణం ఇన్పిస్తుంటే అట్లాగాదమ్మ అని సర్ది చెప్పుకోకపోతమి? మరి, నేను, మీరూ, మన బళ్ల అందరం గీ సర్కార్ బడిల్నే గదా .. ఇగో గిదే తెలుగు మీడియం సదువుకొని, ట్రైనింగ్ లు, యం.ఏలు చేసి అచ్చినం. మన బడిల ముందే పిల్లలు తక్కువ. పైగా సక్సెస్ స్కూల్ కాదు. కొన ఊపిరి మీన ఉన్న తెలుగు మీడియం ఉన్నత పాఠశాల. ఏది ఏమైనా మనల్ని మనం సమర్థించుకోలేమా సార్? పక్కపొంటే ఉన్న ప్రైమరీ స్కూల్ పిల్లలు కూడా మనకెందుకు అస్తలేరు?” ఆవేశం, ఆక్రోశం కలగలిసిన గొంతుతో ప్రశ్నించాను.

“అవును మేడం, మీరన్నది నిజమే. అందరం ప్రభుత్వ బడి, వీధిబడిలో చదువుకొని వచ్చినవారమే. కాని నేటి సమాజానికి సర్కారు బడి అంటేనే ఒక రకమైన పలచనైన భావన ఏర్పడిపోయింది. అందుకు ఎన్నో కారణాలున్నాయనుకోండి. అవన్నీ మనకు తెలిసినవే. ఆమె ప్రశ్నల్లో సత్యం ఉంది.మనమంతా బడి మొదలైనా కొత్త పాఠ్యపుస్తకాలు రాక పాత పుస్తకాలతో నెట్టుకొస్తున్నవారమే. వివిధ యాప్‌లలో రోజూ సమాచారాన్ని నింపుతున్నాం. ఇక మాకైతే చెప్పతరం గాని మీటింగులు, నోడల్ పర్యవేక్షణలు, బిల్లుల కొరకై డిటిఓల చుట్టూ ప్రదక్షిణ, వివిధ జబ్బులతో బాధపడుతున్న ఉపాధ్యాయులు, మెటర్నిటీ లీవ్లో ఉన్న ఉపాధ్యాయినిల స్థానంలో అడిగినా డిప్యుటేషన్ ఇవ్వని అధికారులు, మధ్యాహ్న భోజన రికార్డుల నిర్వహణ, పాఠశాల పనివేళల్లో వచ్చి పడుతున్న జూమ్ మీటింగులు, కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్సులు.. గిన్ని పరేషాన్లతో సతమతమవుతుంటే ఇక సబ్జెక్టులల్లకు క్లాసులెలా జరిగేవి? బడిలో అకడమిక్ విషయాలపై పురోగతి ఎపుడని ముందుకు వెళ్లేది? “అన్నాడు నా ప్రశ్నకు తన ప్రశ్నలను అదనంగా జోడించి.

మా బయోసారు మరో బాంబు లాంటి ప్రశ్నను పేల్చాడు. “మేడం! ఈ తల్లులు ఇంకా ముందుకెళ్లి మీ పిల్లల్ని మీరు ఎక్కడ చదివించిండ్రు. మీ పిల్లలేమో డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు కావాలాయే, మరి మా పిల్లలో అడ్డా మీద కూలి బతుకు, మెకానిక్కుల పని చేసుకోవాల్నా, అంటే అవేం తక్కువ పనులని గాకున్నా.. మీ పిల్లల్ని ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం బడిలకెందుకని పంపుతుండ్రు? వాళ్లనూ గదే గవర్న మెంటు బడిలల్ల,కాలేజీలల్ల సదివిపియ్యొచ్చుగదా?

మీకేమో పైసలున్నయన్న షోకులు, మేం గూడా మాపిల్లగాండ్లను గట్లనే అద్దాల బస్సులల్ల, సూటు బూటు యూనిఫాంలల్ల పంపిస్తం.. అని బాణాలు సంధిస్తే ఏమని సమర్థించుకుందాం? వ్యవస్థను ఎలా చక్కదిద్దుతాం? చెప్పండి” అన్నాడు సూటిగా నన్నే చూస్తూ.

ఆయన ప్రశ్నలు నాకు మింగుడుపడటం లేదు. తీవ్రమైన ఉక్కపోతతో నిలువెల్లా చెమటలు పట్ట సాగాయి. అవమానంగా ఫీలయ్యానో ఏమోగానీ మొహమంతా ఎర్రగా జేవురించింది. మా పరిస్థితి గమనించిన పెద్దసారు “సరే ఈరోజుకు కాన్వాసింగ్ చాలిద్దాం. రేపు మనం ముగ్గురం మనకు దగ్గర్లోని ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్లకు వెళ్లి, ఆ అడ్మిషన్ల వివరాలను సేకరిద్దాం. ఎండకాక ముందే వెళ్తాం. పొద్దున ఆయా గ్రామాల్లో తల్లితండ్రులు ఉంటారు. వివరాలు రాసుకోవచ్చు” అంటూ లేచాడు. రేపు మళ్లీ ఎన్ని మొట్టికాయలో దేవుడా! అనుకొని నిట్టూర్చాను.. “సార్ ఈ రోజటి వివరాలు గూగుల్ ఫాంలలో నింపి, కాన్వాసింగ్ ఫోటోలు అప్లోడ్ చేయాలి” అంటూ బయోసారు మిగిలిపోయిన పనిని మా పెద్ద సారు

చెవిన వేశాడు. తెలుసన్నట్టుగా తలాడించాడు పెద్దసారు.

* * *

ఉదయం బంగారు భానుడి లేత కిరణాలు గోరువెచ్చగా స్పృశిస్తుంటే బస్సు దిగి మాకు పొరుగునే ఉన్న యూపిఎస్ పాఠశాల గల పల్లెలో అడుగు పెట్టాం. ఇక్కడెన్ని యమగండాలో అని బిక్కు బిక్కుమనుకుంటూ ఆ మాధ్యమిక పాఠశాల ఆవరణను సమీపించాం. అశోక్ సారు సాదరంగా ఆహ్వానించాడు..'' సార్ మా బడిలో ఏడవ తరగతిలో కేవలం పదిమందే ఉన్నారు. అందులో ఆడపిల్లల్ని కెజీ బీవీల్లో వేస్తామంటున్నారు. మరి కొందరు గిరిజన హాస్టల్స్, గురుకులాలకు పంపుతా మని అంటున్నారు. ఈసారి మీ బడికి వచ్చే పిల్లల సంఖ్య తగ్గితుందేమోనండి" అంటూ ఒక ధర్మ సందేహాన్ని వెలిబుచ్చాడు.

"వాళ్ల ఫోన్ నెంబర్లు, డీటైల్స్ ఇవ్వండి. ఓసారి మాట్లాడతాం. ఇప్పుడే వెళ్లి కలుస్తాం" అన్నాడు పెద్ద సారు. ఆ వివరాలన్ని రాసుకున్నాడు బయోసారు. మా వెంబడి ఆ బడి మరో విద్యార్థిని వెంటబెట్టుకొని

అందరం విధిలేక వెనుదిరిగాం. ఇంతలో పెద్దసారు ఫోను మోగింది. ఎవరితోనో సంభాషించి, ఫోను పెట్టేశాడు. "మేడం మీరు అర్జంటుగా బడికి చేరుకోండి. మన పక్కనే ఉన్న ప్రైమరీ స్కూల్ ఎల్ ఎఫ్ఎల్ హెచ్ఎం బడికి వస్తున్నారంట, మీకు తనదగ్గరున్న కొద్దిమంది ఐదవ తరగతి విద్యార్థుల వివరాలు, రికార్డ్ షీట్స్ ఇస్తానంటున్నాడు. మీరెళ్లి ఆ పని చూడండి" అంటూ నన్ను బయల్దేరదీసాడు.

దగ్గర్లోని పొలాల్లో పని చేసుకుంటున్న ఓ తండ్రి దగ్గరకు వెళ్లి ఆయన బిడ్డల వివరాలను అడగసాగాడు పెద్దసారు.ఆ పెద్దాయన నవ్వి "గిదేంది సార్లు గిట్ల తోట లెంబడి, పొలాలెంబడి వడి బళ్లకు పిల్లలు కావాలని తిరుగుతున్నారా? మా పిల్లాడిని ఈ యేడు హాస్టల్లో వేస్తాను. పొలం పనుల్లో పడి సాయంత్రాలు ఆలీశమయితే మా పిల్లలను ఎవలు చూడాలి? ఇంటిపక్క బడి ఐతే జెల్ది అస్తున్నరు. రాంగనే ఆటలు, సదువుకోరా నాయనా! రాసుకోరా కొడుకా! అంటే ఇంటున్నరా ఈళ్లు? పొద్దుగుత్తా ఫోన్లు బట్టుకొని షోకులు, ఫోటోలు దిగుడు. సారూ! మీరు ఏమంటే గా కరోనా కాలంల ఫోన్లల్ల పాఠాలు చెప్పుడు షురు చేసిండ్రో ఇగ మా పోరగాండ్లు పదివేలకు తక్కువగాని ఫోన్లను కొనియ్యమని పానం తింటుండ్రు. అడిగిన ఫోన్లను కొనిస్తలేమని అలిగి ఉరివెట్టక సచ్చి పోతమని బెదిరిస్తుండ్రు. అప్పులు తెచ్చి ఫోన్లు కొనిస్తే, సదువుడు తక్కువ గేములాడుడు ఎక్కువయింది. ఇప్పటి కాలం మంచిగలేదు. గీ ఫోన్ ఖరాబైంది ఇంకో ఫోన్ కొనమని అన్నా అంటరు. లవు జిద్దు పోరగాండ్లు జమైండ్రు.ఈళ్ల ఫోన్ల బాధకు ఉన్న గోంతంత ఎవుసాన్ని పశువులను అమ్ముకోవద్దనుకుంటే నా కొడుకు, బిడ్డను పక్క మండలంలోని సంక్షేమ హాస్టల్లల్ల మెల్లగ బుదరకించుకుంట పరీక్షలు రాయించు కోవాలి. ఫోన్లు జేసుకుంట బడికి రమ్మని పిలవాలి. నిన్న మొన్న ఏం జెప్పకుంట ఎందుకు బడికి రాలేదో అడగాలి. పొద్దుగాల్నే వచ్చిన పిల్లలకు ఫేషియల్ అటెండెన్స్ వేయాలి. గిన్ని పనుల నడుమ బి.పీలు, షుగర్లూ కంట్రోల్ల వెట్టుకుంట నయనా భయానా బుజ్జగించుకుంట గీ మొండి పోరగాండ్లకు సదువు చెప్పుకోవాల్సిందే తప్పదు. మొన్ననే ఓ పెద్దసారుకు బియ్యంల పురుగు వచ్చిందని సప్లైండ్ ఆర్డర్ వచ్చిందనగానే బి.పీ ఎక్కువై ఆడ్నే పడిపోయిన ఫోట్వ పనివడ అన్ని పేపర్లల్ల స్కూల్ వాట్సాపులల్ల చక్కర్లు గొట్టింది. ఇంకో సంవత్సరం వరకు నా డ్యూటీ ఎలాంటి వివాదాలకు గురి కాకుండా ముగించు కోవాలని చిరు ఆశ నాది..! మంచి స్టాఫ్ ఉంది మనబడిలో. కానీ వీళ్లకు ఎంత చెప్పినా అర్థం అవదులెండి.మనమే సంయమనం వహించాలి" అన్నాడు సముదాయింపుగా.

అందరం విధిలేక వెనుదిరిగాం. ఇంతలో పెద్దసారు ఫోను మోగింది. ఎవరితోనో సంభాషించి, ఫోను పెట్టేశాడు. "మేడం మీరు అర్జంటుగా బడికి చేరుకోండి. మన పక్కనే ఉన్న ప్రైమరీ స్కూల్ ఎల్ ఎఫ్ఎల్ హెచ్ఎం బడికి వస్తున్నారంట, మీకు తనదగ్గరున్న కొద్దిమంది ఐదవ తరగతి విద్యార్థుల వివరాలు, రికార్డ్ షీట్స్ ఇస్తానంటున్నాడు. మీరెళ్లి ఆ పని చూడండి" అంటూ నన్ను బయల్దేరదీసాడు.

ఆ పల్లెబాట వెంబడి రెండు కిలోమీటర్ల దూరం నడిచి, మెయిన్ రోడ్‌పై రిక్వెస్ట్ బస్టాపులో బస్సు పట్టుకొని మా స్కూల్‌కు వచ్చి పడేసరికి గంట గడిచింది. నేను వచ్చేసరికే గోవర్ధన్ సారు చెట్టుకింద బండి ఆపుకొని రికార్డు షీట్లు పట్టుకొని ఎదురుచూస్తూ కన్పించాడు. "మేడం ఇవన్నీ మా బడి నుండి మీకు వచ్చే అడ్మిషన్స్" అంటూ కొన్ని బోనఫైడ్ లు, రికార్డు షీట్లను నాకందించాడు. ఎంతో అపురూపంగా అందు కున్నాను. అవన్నీ ఆఫీసుగదిలోని కొత్త ఫైళ్లలో సర్దు కుంటుంటే గోవర్ధన్ సారు ఒకింత బాధగా "మేడం! ఇపుడు మీకిచ్చిన న్యూఅడ్మిషన్లలో ఇద్దరు పిల్లలు స్లోలెర్నర్స్ మానసిక వైకల్యంగల పిల్లలు. రుచితకేమో స్పీచ్ డిజార్డర్, అక్షితకేమో మెదడు ఎదుగుదల లోపం. తమ పేర్లు కూడా పలకలేరు వీళ్లు. తరగతి గదిలో నిశ్శబ్దంగా కూర్చుంటారు" అన్నాడు.

"మన ఊరికి కేవలం ఒక్కటంటే ఒకే కిలో మీటరు దూరంలో భవిత స్కూల్ ఉందని, వాళ్ల తల్లితండ్రులకు తెలియదా? మండల కేంద్రంలోని భవితకు పంపొచ్చుగా ?"అన్నాన్నేను సందేహంగా.." అయ్యో!మేడం మన బడులల్ల పిల్లలు జేరకుండ గదే పెద్ద దెబ్బగొట్టే కదా! అట్లా దగ్గర ఉన్న మండల కేంద్రమనే గదా మేడం! నేడు మీ పాఠశాల మా ప్రాథమిక పాఠశాలల పిల్లలు ఇక్కడికి రాకుండా అక్కడున్న బళ్ళకే పోవట్టిరి. ఐనా మనం చెప్తనే ఉన్నం.ఈ ఊరి పిల్లలు ఇదే ఊర్ల సదవాలి గాని మీరెట్ల షరీఖు జేసుకుంటరని ఆ స్కూల్లోల్లనూ అడగనే వడ్తిమి?!కూతవేటు దూరంలో బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, అటు ఉర్దూ మీడియం హైస్కూల్, పైపెచ్చు, మూడు దీటైన ప్రైవేట్ హైస్కూల్స్ ఉన్నాక ఇక మన దగ్గర పిల్లల సంఖ్య ఎలా పెరుగుతుంది చెప్పండి? ఇదిగో ఇలాంటి పిల్లల్ని మన బళ్లలో చేర్పించి ఇక మీరే దిక్కయ్యా అని కూడా అంటారు. మనం కూడా సహితవిద్యను రెగ్యులర్ పాఠశాలల్లో అందించాల్సిందే కదా మేడం. అందరికీ విద్య అందాలిగా! ఆ తల్లి తండ్రులకు బోలెడు పనులు. ఈ పిల్లలకు ప్రభుత్వం రవాణా డబ్బులు ఇస్తున్నా, అవి సరిగా రాక రోజువారీ వ్యవసాయ పనులను వదిలి వీళ్లు ఆ భవితకు వెళ్లరు. పైగా మరీ ఆటిజం, డిజార్డర్స్ ఎక్కువ ఉన్న పిల్లలుంటారని భయం కూడా కావచ్చు ఏం చేస్తాం మేడం? మన రెగ్యులర్ పాఠశాలలో చేర్పించుకోక తప్పదు. ఆ పిల్లలు వచ్చినపుడు హాజరు వేయడం, లేనపుడు లేదు. పరీక్షల్లో కొంత సడలింపు మెర్సి మార్కులతో పాసు చేయించటం ఏ ప్రభుత్వ బడిలోనైనా అమలు చేసే పనులేగా" అంటూ నాకు తెల్సినవే ఐనా కొత్త సత్యాలు ఇవిగోనంటూ

ముందుంచాడు.

మరో వారం రోజుల తర్వాత బడిబాట ముగిసిన పిమ్మట పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రార్థన లైనులో రుచిత, అక్షితలను తొందరగానే పోల్చుకున్నాను.

న్యూ అడ్మిషన్ నంబర్లతో వారు ఆయా తరగతి రిజిష్టర్లలో ఎన్ రోల్ అయ్యారు. ఇలాంటివారిని మెయిన్ స్ట్రీం పాఠశాలలో చేర్చుకుంటే బోధన ఎలా? అన్నది ఓ సందేహం. మా తెలుగు టీచర్ హరిప్రియ నైతే "అసలు ఇలాంటి పిల్లల్ని చేర్పించుకోవటం ద్వారా వాళ్లకు ఎలా పరీక్షలు పెడతాం? ఫార్మాటీవ్ మార్కులు ఎలా వేయాలి? ప్రాజెక్టు పని ఎలా పూర్తి చేయిస్తాం? ఈ పిల్లలతో ఎవరూ కలవరు, పైపెచ్చు మనం తరగతి గదిలో లేకుంటే వీళ్లను టీజ్ చేస్తారు. వీళ్లు బడికి సరిగ్గా రారు. ఎప్పుడు వస్తే అప్పుడు అటెండెన్స్ వేయడం. మెర్సీ మార్కులతో పాస్ చేయించటం. ఎంతైనా సర్కారు బళ్లంటే అందరికీ అలుసే..!" అని పొద్దుటి ఇంటర్వెల్ లో ధ్వజమెత్తింది.

"అవునుకదా పెద్ద సారు బడిలో తక్కువమంది పిల్లలున్నారు. ఎన్ రోల్మెంట్ డ్రైవ్ అంటూ వారం రోజుల పాటు మనల్ని కాచ్ మెంట్ ఏరియాలోనూ, ఫీడింగ్ యూపియస్ పాఠశాలల్లోను తిప్పారు, ఏం సాధించాం!ఎవర్ని ఉద్ధరించాం? పిల్లలేరి? ఎక్కడి కెళ్లినా మా పిల్లల్ని గురుకుల హాస్టల్లో వేస్తున్నాం అనో ప్రైవేట్ బడికి పంపుకుంటాం అనో పైపెచ్చు మనల్ని చులకన చేస్తూ మాట్లాడటం. వస్తే గిస్తే ఇదిగో ఇప్పుడు ఇలాంటి పిల్లల్ని కూడా అడ్మిట్ చేసుకోవాల్సిన దుస్థితి దాపురించింది మన బడికి.జెర్ర పైసలు కట్టే తల్లితండ్రులుంటే సాలు కొద్దిగ హుషారున్న పిల్లలంతా ప్రైవేట్ బడులల్లకు పోతుంటే ఇగో మన స్కూలుకు ఇసొంటి పిల్లలు రావట్టే.బేసిక్స్ లేని పిల్లలకు చదువెలా చెప్పేది?ఎక్కడుందీ లోపం?" అంది సోషల్ టీచర్ సుమతి కాస్త ఆవేశంగా.

నాకెంతో బాధ అన్పించింది. "దుస్థితి అని ఎందుకు అనుకోవాలి మేడం? మనమూ వారిపట్ల కాస్త ఓర్పుతోనూ, సానుభూతితోనూ, ప్రేమగా వ్యవహరించ వచ్చు కదా !పై పెచ్చు మనకు తరగతి గదికి సింగిల్ డిజిట్ స్ట్రెంత్ మాత్రమే ఉంది .బడి అందరిది. చదువుకుంటాను అని వచ్చిన విద్యార్థు లందరికీ సమాన విద్య అందించాల్సిందే కదా..!" అన్నాన్నేను ఆమె మాటల్ని ఖండిస్తూ. ఇంతలో మూడవ పీరియడ్ బెల్ మోగింది. "ఓ! చెప్పొచ్చా వులే!" అన్నట్టు అందరూ నన్నే చూస్తూ ఎవరి తరగతి గదుల్లోకి వాళ్లు విసురుగా వెళ్లి పోయారు.

* * *

ఇంటికెళ్లాక ఫోను తీసి చూసుకుందును కదా, కరుణ మిస్డ్ కాల్స్. కరుణ వాళ్ల అమ్మాయి డెఫ్ అండ్ డంబ్. ఎందుకై ఉంటుదబ్బా?? అనుకొని కాల్ కలిపాను. అవతలి నుండి కరుణ కంఠం గొంతులో కాస్త ఆహ్లాదం, ఉత్తేజం రంగరించగా" దేవీ! మా అమ్మాయి కీర్తికి అడ్మిషన్ జిల్లా కేంద్రం లోనిగర్ల్స్ హైస్కూల్లో దొరికింది. అక్కడే మీ కజిన్ కూడా కల్సింది. ఈ పదిహేను రోజుల్లో అమ్మాయిలో చాలా బిహేవియరల్ మార్పులు సంభవించాయి.

చిన్నగా మాట్లాడటం వచ్చింది. మొన్న బయో మేడం పార్ట్ ఆఫ్ ప్లాంట్ అడిగితే చెప్పింది. బొమ్మలు వేస్తుంది. రంగుల్ని గుర్తించి చెప్పగలుగుతుంది. టీచర్ల పేర్లను, పలుకుతుంది. రోజు బడికెళ్లడం మూలంగా మంచి మార్పు వచ్చింది. అదీ గాక ఆ తరగతి టీచర్లు కూడా వారి పీరియడ్ టైంలో ఓ ఐదు, పది నిమిషాలు మా అమ్మాయి ఫీడ్ బ్యాక్ కొరకు ఇవ్వడం గొప్ప సానుకూల చర్య. నేనడిగితే చెప్పదుగానీ, టీచర్ల ప్రశ్నకైతే నా బిడ్డ సమాధానమిస్తుందని తెల్సి చాలా సంతోషించాను. టీచర్ల దృక్పథం ఇలాంటి పిల్లల పట్ల మరింత ప్రేమపూర్వకంగా, సానుకూలంగా ఉంది ఇదో గొప్ప విజయం. జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాల పైపెచ్చు తరగతికి యాభైకి తక్కువ గాని స్ట్రెంత్ ఉన్నప్పటికిని ఇలా మా అమ్మాయికి ఎట్ లీస్ట్ ఐదు నిమిషాలు కేటాయించి చదువుపట్ల శ్రద్ధ చూపడం నిజంగా గ్రేట్..!"అంది.

"నిజమే కరుణా! టీచర్లు తల్చుకుంటే ఏదైనా సాధిస్తారు. అబ్దుల్ కలాం గారు కూడా తన టీచర్ను ఎంతగా గుర్తు చేసుకుంటారు, టీచర్ల ప్రోత్సాహం ఉంటే పిల్లాడి సామర్థ్యాలు ఎంతగానో వెలుగు చూస్తాయి.అవునూ! ఈ మధ్య స్పీచ్ థెరపీకి, హియరింగ్ ఎయిడ్కి ఢిల్లీ వెళ్లానన్నావు ఏమైంది?" అని అడిగాను. "లక్షల ఖరీదు పోసి హియరింగ్ ఎయిడ్ కొన్నాము. స్పీచ్ థెరపీలో భాగంగా ఇంటి వద్ద ఒక ట్యూటర్ని ఏర్పాటుచేశా. లిప్ మూవ్ మెంట్తోబాటు పదాల ఉచ్ఛారణ, పలకడం స్పష్టంగా పదేపదే చెప్పించడం వంటివి చేయిస్తుంది ట్యూటర్. ఎంతైనా భగవంతుడు ఇలాంటి బిడ్డల్ని మాకివ్వడం, వాళ్ల పెంపకం మాకో సవాల్, ఎంతో ఓపికగా, సహనంగా ఉండాలి. డబ్బు ఖర్చు ఉండనే ఉంటుంది. అయ్యో! ఇలాంటి స్పెషల్ నీడ్ పిల్లలున్నారే..! అని మమ్మల్ని మేం డౌన్ చేసుకోము కూడా, ఏం చేస్తాం, కాల గమనంతో మనమూ ముందుకు సాగాల్సిందే, ఉంటాను" అంటూ పెట్టేసింది.

తెల్లారి నేను బడికి వెళ్లేసరికి పేరెంట్స్తో బాటు ఇద్దరు మగపిల్లలు కొత్త అడ్మిషన్ కొరకై వేచి చూస్తు న్నారు. లీజర్ పీరియడ్లో వారి డీటెయిల్స్ రాసుకో సాగాను. హరినాథ్ పదహారేళ్ల పిల్లాడు. విజువల్లీ ఛాలెంజ్డ్. కంటిచూపు సరిగా లేదు. నాలుగో తరగతి జిల్లా కేంద్రంలో చదివి మూడేండ్లు ఇంటి వద్దనే ఉండిపోయాడు. అతడి ట్రీట్మెంట్ కొరకై ఆ తండ్రి లక్షలు ఖర్చు చేశాడు.

నిజం చెప్పొద్దూ నాకు హృదయమంతా బరువెక్కింది. అప్పుడెపుడో కొఠారి కమీషన్ చెప్పినట్లు ఎలాంటి పిల్లలకైనా బడిలో అడ్మిషన్ ఇవ్వాల్సిందే నంటూ ఒక ఆవాస ప్రాంతంలోని విద్యార్థులందరూ ఒకే పాఠశాలలో చదువుకోవాల్సిన అవసరాన్ని గమనించి చేసిన కామన్ స్కూల్ సిఫారసు గనుక అమలు అవుతే సర్కారు బడులు ఎంత బాగుపడతా యని అన్పించింది.ఆ సిఫారసులు ఇలా స్ట్రెంత్ తక్కువ ఉన్న మా బోటి పాఠశాలలకు వరదాయినిలాంటివి.

తెల్లారి నేను బడికి వెళ్లేసరికి పేరెంట్స్తో బాటు ఇద్దరు మగపిల్లలు కొత్త అడ్మిషన్ కొరకై వేచి చూస్తు న్నారు. లీజర్ పీరియడ్లో వారి డీటెయిల్స్ రాసుకో సాగాను. హరినాథ్ పదహారేళ్ల పిల్లాడు. విజువల్లీ ఛాలెంజ్డ్. కంటిచూపు సరిగా లేదు. నాలుగో తరగతి జిల్లా కేంద్రంలో చదివి మూడేండ్లు ఇంటి వద్దనే ఉండిపోయాడు. అతడి ట్రీట్మెంట్ కొరకై ఆ తండ్రి లక్షలు ఖర్చు చేశాడు. ఆ మందుల ప్రభావంతో పిల్లాడిలో నిస్త్రాణ, మెదడులో చురుకుదనం లోపించింది. ఒక కన్ను మాత్రమే పాక్షికంగా కనిపిస్తుంది. మరో పిల్లాడు ఉదయ్ వారి బిడ్డడే. ఇటీవలే హెర్నియా ఆపరేషన్ ఐంది.

"నేను అందరి లెక్క బడికి పోయి చదువు కుంటానని మారాం చేస్తాడు. బడికి పోతానని ఏడుస్తడు అమ్మ" అంది హరినాథ్ తల్లి నీళ్లు నిండిన కళ్ళతో.

"మా పిల్లాడిని ఏజ్ ప్రకారం ఎనిమిదవ తరగతిలో అడ్మిషన్ ఇప్పించలేరా మేడం, అన్నదమ్ము లిద్దరు ఒకటే క్లాసైతే నామోషీగ ఫీలయితడు" అన్నాడు తండ్రి నసుగుతూ.. "అలా ఇప్పటికైతే వీలుపడదు, ప్రభుత్వం క్లాస్ ఛేంజ్కు సెప్టెంబర్ లో అవకాశం ఇస్తుంది. అప్పుడు పై తరగతికి ప్రమోట్ చేద్దాం"అని సముదాయించి అడ్మిషన్ ఫాంలో తండ్రి సంతకం తీసుకున్నాను, అతడు ఓ షాపింగ్ మాల్లో చిరుద్యోగి, తనతో బాటే తన కొడుకులిద్దర్ని జిల్లా కేంద్రానికి తీసికెళ్లి తీసుకొచ్చేవాడు, ఖర్చులు తట్టుకోలేక ఉన్న ఊర్లోని ప్రభుత్వ బడే బెటర్ అనుకొని అక్కడి నుండి రికార్డు షీటు పట్టుకొని వచ్చేశాడు.

మొదట్లో హరినాథ్ను తరగతి గదిలో అందరూ వింతగా చూసేవారు. కొన్ని రోజులు పోయాక బడి వాతావరణం వారికీ అలవాటైంది. క్లాస్ పిల్లలంతా అతడితో ఎంతో స్నేహంగా ఎంతో సాధారణంగా వ్యవహరించేవారు. హరినాథ్ ఎన్నో కబుర్లు చెప్తాడు. అతడి దస్తూరీ కూడా ఎంతో అందంగా బాగుంటుంది. నేను అన్నట్లే క్లాసు ప్రమోషన్కు అవకాశం

వచ్చింది. ఇటీవలే హరినాథ్‌కు డబుల్ ప్రమోషన్ ఇప్పించి ఎనిమిదవ తరగతిలోకి ప్రమోట్ చేశాం.

వారం రోజుల క్రితమే మండల కేంద్రంలోని భవిత కోఆర్డినేటర్ అమ్మాయి వచ్చి మా పాఠశాల లోని స్లోలెర్నర్స్ స్పెషల్ నీడ్ విద్యార్థుల లిస్టు తీసికెళ్లింది.

త్వరలోనే మళ్లీ రెగ్యులర్ పాఠశాలల ఉపాధ్యా యులకు మరో శిక్షణ ఉంటుందని చెప్పీచెప్పని దేవరహస్యాన్ని మరీ చెప్పి వెళ్లింది.మరో రెండు రోజుల్లో రానున్న వసంత పంచమి సందర్భంగా మాబడిలో సరస్వతీ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన మాజీ వార్డ్ మెంబర్ పులిసాయిలు ఆ విగ్రహానికి రంగులు వేయిస్తానంటూ రంగు డబ్బాలతో బాటు తన వెంబడే ఒక పెయింటర్‌ని తీస్కోని వచ్చాడు.

ఆయనొచ్చారని మర్యాదగా విష్ చేయడానికని మా అందర్నీ పిలిపించారు మా పెద్ద సారు. ఆయన్ని మర్యాదలవీ చేసి కూర్చోబెట్టి "మన ఊర్లోని మనబడిలో పిల్లల సంఖ్య పెరగాలి. ముందు ఆ ప్రైవేట్ స్కూల్స్ బస్సుల్ని రానీయకండి. మేమెంత కాళ్లావేళ్లా పడి ప్రాధేయపడినా ఎవ్వరూ మాబడికి తమ పిల్లల్ని పంపటం లేదు. వృత్తి పట్ల అంకితభావం, విద్యా ప్రమాణాలు పెంచాలన్న తపన ఉంది గానీ, ఇదిగో ఇలా స్పెషల్ నీడ్ పిల్లలతో అటు మన బడి తెలుగు మీడియం అవటంతోటి పిల్లల సంఖ్య పెరగట్లేదండి, సర్పంచ్ గారితోనూ మాట్లాడాను. ఆయన ఎన్నికల హడావిడిలో ఉన్నారు.

పేరెంట్స్ సంతకాలతో, మనబడిని సక్సెస్ స్కూల్‌గా మార్చాలని ప్రపోజల్స్ ఐతే పోయిన ఏడే పంపాము. ఈ విద్యాసంవత్సరమైనా అప్రూవ్ కావాలి. ఈ బడిని మీ ఊరివాళ్లే మెల్లమెల్లిగా అప్ గ్రేడ్ చేస్తూ చేస్తూ హైస్కూల్ దాకా లాక్కొచ్చారు. ఇకముందు ఎన్నెన్ని పరీక్షలకు తలఒగ్గాల్సివస్తుందో ఈ బడి అసలు ఉంటుందో? లేక దగ్గర్లోని మండల కేంద్రంలో విలీనం అవుతుందో తెలీదు "అంటూ బడి భారాన్ని ఆయన ముందుంచారు.

నల్లని నుదుటిపై దిద్దుకున్న ఎర్రటి తిలకం, చేతికి వెండి కడియం, ఖద్దరు చొక్కాలో హుందాగా వెలిగి పోతున్న పులిసాయిలు తాను తెచ్చిన పూజా సామానును పక్కన బెట్టి కండువా సవరించుకున్నాడు.

"అవును సార్, మీరు పాఠాలు బాగానే చెప్తారు.అందరూ గవర్నమెంటు టీచర్లే. నేను సుత గిదే బడిల పదోది పాసైన. ఇప్పుడు నా బిడ్డా ఈడ్నే సదువుతుంది కదా. గప్పట్ల మా బడి తడికెల గదులలెక్క ఉండేది. వానవడ్డా ఎండగొట్టినా ఓర్సుకొని సదువుకున్నం. అప్పట్ల ఇప్పుడున్నట్లు గింత మంచి అద్దాల బీరువాలల్ల సదుకోనికి మస్తు పుస్తకాలు లేకుండే.ఐనా మాకు చదువు అబ్బింది.మా ఊరోల్లం పట్టువట్టి ఒక్కోయేడూ ఒక్కో తరగతి పెంచుకుంటూ పెంచుకుంటూ దాదాపు పదిహేనేళ్లకు పైగానే ఐంది

టీచరంటేనే పాఠశాలకు తల్లివేరు అసంటోడు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా చైతన్యవంతుడైన టీచర్ తన స్నేహంతో పిల్లలను ప్రభావితం చేయగలుగుతాడు. ఆ పసిహృదయాలపై ఎప్పుడు విజేత కాగలడో వాళ్ల సహాయంతో తాను పని చేస్తున్న ఊరి ప్రజల జీవితాలతో మమేకం కాగలు తాడు. తన జీతం, జీవితం పేద ప్రజల చెమట చుక్కలతో తడిసినవని అతనికి ఎర్మైతది. ఇగో ఇప్పుడిట్లా ఉపాధ్యాయవృత్తి పవిత్రతను ప్రశ్నించే విధంగా ప్రజల నుండి వస్తున్న నిందలను పరిశీ లించి సరిదిద్దుకోక తప్పదు సారూ!

పదో తరగతి వచ్చి. సార్ గప్పట్ల మా ఊరి ఆడపిల్లలకు కిలోమీటర్ దూరం బోయి సదువుడు కష్టమైతదనే మా బడిని పెద్దబడి జేసుకున్నం.మస్తు మంది పిల్లలతో బడంతా కళకళలాడేది.గీ మోడల్ స్కూల్లూ గురుకులాలూ సంక్షేమ హాస్టల్లూ కెజీబీవీలు ఏం లేకుండే.ఇంకో ముఖ్యమైన సంగతేందంటే మా మండల కేంద్రంలో ప్రైవేట్ స్కూల్ ఏదీ లేకుండే. సుట్టుముట్టు గివన్నీ ఉన్నాక ఈడ పిల్లలేకుండా గావట్టే.

అందరికీ సమానంగా అందాల్సిన విద్య బడిపొల్లగాండ్ల నడుమ విభజనరేఖను సృష్టించింది. అద్దాలబస్సుల్లల్ల రంగ్ బి రంగ్ యూనిఫాంలల్ల సదువుకొనవోయే పొల్లగాడు ఒకడైతే..అవ్వ వెట్టిన సద్దన్నం బుక్క తిని నున్నటి తలతో లగాయించి ఉర్కచ్చే మన తెలుగు మీడియం పొల్లగాడు ఇంకోలు. మీకు బడి పిల్లల సంఖ్య పెంచాలనే గట్టి సంకల్పం ఉంది కాబట్టే గింతగానం తండ్లాట వడుతున్నరు.ఎవరు ఎంత చులకన చేసి మాట్లాడుతున్నా ఓపికతోటి ముందుకేవోతున్నరు.

టీచరంటేనే పాఠశాలకు తల్లివేరు అసంటోడు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా చైతన్యవంతుడైన టీచర్ తన స్నేహంతో పిల్లలను ప్రభావితం చేయగలుగు తాడు. ఆ పసిహృదయాలపై ఎప్పుడు విజేత కాగలడో వాళ్ల సహాయంతో తాను పనిచేస్తున్న ఊరి ప్రజల జీవితాలతో మమేకం కాగలుతాడు. తన జీతం, జీవితం పేద ప్రజల చెమటచుక్కలతో తడిసినవని అతనికి ఎర్మైతది. ఇగో ఇప్పుడిట్లా ఉపాధ్యాయవృత్తి పవిత్రతను ప్రశ్నించే విధంగా ప్రజల నుండి వస్తున్న నిందలను పరిశీలించి సరిదిద్దుకోక తప్పదు సారూ!

నాక్కూడా తెల్సు పైసల్లేక తిప్పలు వడుతున్నరని. విరాళాలతోటి, మీరంతా తలోచేయి వేసి సేకరించిన ఫండ్‌తో సక్కదిద్దిన పనులెన్నో. అసలు కాంపౌండ్ వాల్ లేక మస్తు అవస్థలు పడుతున్నమని మొన్ననే ఎమ్మెల్యే ఫండ్ తోటి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టినం. మెల్లమెల్లగా పనులు చేపించు కుందాం. ముందు ప్రభుత్వ బడిల పిల్లల సంఖ్య ఎట్లైతే పెరుగుతదో ఆలోచించాలే..దాదాపు బయట సమాజానికి ప్రభుత్వ ఉద్యోగం అంటే మోజే. ప్రభుత్వ ఉద్యోగులనూ గౌరవిస్తారు.

అబ్బో! వాడికేం గవర్నమెంట్ జాబ్ కదరా! అంటూ ఆకాశానికి ఎత్తేస్తారు. కానీ వాళ్లకు ప్రభుత్వబడి వద్దు. ప్రభుత్వ కాలేజీ వద్దు. తన బిడ్డ ఐఐటి,ఐఐయం, నీట్, జెఇఇ పరీక్షల్లో ర్యాంకులు కొట్టాలి అని ఆశపడతారు. లక్షలు పోసి సీట్లను కొనుక్కుంటారు.వాళ్లు తమ బిడ్డలకు మూడవ తరగతి నుండే ఐఐటి ఫౌండేషన్ కోర్సుల్ని అందిస్తుంటే ఇక ప్రభుత్వ బడి, కాలేజీల్లో చదివిన బడుగు విద్యార్థి వాళ్ళతో ఎలా పోటి పడగలుగుతాడు?

అందుకే ప్రభుత్వ బడిలోను, కాలేజీల్లోను చదివే విద్యార్థులకు డెబ్భై శాతం వివిధ ఎంట్రన్స్‌లలో వెయిటేజి ఇవ్వాలి. అలా ఇస్తే డాక్టర్ల పిల్లలూ,అటు పేదోడి కూలీ పిల్లలు కల్సి సదువుకోగల్గుతారు. మనకుంటున్న సమానత్వం సాధ్యమవుతుంది.

కూలీ తల్లి తండ్రులు ప్రభుత్వ బడిలోని సౌకర్యాల తీరు గురించి ప్రశ్నించి ప్రశ్నించి వారి అసహనాన్ని దిగమింగుకున్నా.. ఉన్నతవర్గాల పిల్లలు వాటిని కలెక్టర్ల దాక తీసుకెళ్తారు, బడి బాగుపడు తుంది. అందరికీ సమాన విద్యా అవకాశాలు రావా లంటే, సంపన్న పిల్లలు, సగటు నిరుపేద పిల్లలు సమానంగా కల్సి కూచుని చదువుకొనే అవకాశం రావాలి. ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేస్తున్న నా ఎజెండా ఇదే.

మన ఊర్లోని మన బడిని నిలుపుకోవాలే. వంకరలేళ్ల లెక్క పెరిగిపోతున్న ప్రైవేటు స్కూల్లను నిలువరీయాలి. కడుపు కట్టుకొనియాజమాన్యం అడిగిన ఫీజులను వాయిదాలలో చెల్లించే తల్లి తండ్రులు తమ బిడ్డలను సక్కగ సదువులు నేర్పే మన బడిలనే వేయాలి. గిట్లాంటి వెయిటేజీ ఉంటే..ఈ వెయిటేజీ కారణంగా వివిధ హోదాల్లో ఉన్న అధికారుల పిల్లలు మధ్యాహ్న భోజనం బాగా లేకున్నా, నాణ్యత లేకున్నా గొంతెత్తుతారు.

పర్యవేక్షణకోసం పై అధికారుల్ని సంప్రదిస్తారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పిల్లలకు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల్లో, ప్రభుత్వ ఉన్నత విద్యలో అవకాశాలను వెయిటేజీలను కల్పించగలిగిన పుడే కదా దేశంలో విద్యారంగం బాగుపడేది. దేశభక్తుల ఆత్మలు ఆనందపడేది. మళ్లీ బడులు గప్పట్ల మీరు సూసే వందలాది విద్యార్థులతో కళకళలాడేది. చదువులతల్లి సరస్వతమ్మ జ్ఞానయోధు లైన తన బిడ్డలను జూసి మురిసేది" అని చెబుతూ అమ్మవైపుగా తిరిగి చేతులెత్తి మొక్కాడు. ఆ సమయంలో నిజంగా మాకు పులిసాయిలులో భవిష్యత్ ఫూలే అగుపించారు..!! రంగు వెలసిన సరస్వతికి తన నవీన భావాలతో రంగులద్దుతున్న అతని విజనరీని మనస్ఫూర్తిగా అభినందించాం మేమంతా. ★

ప్రపంచీకరణతో మనదేశానికి మేలు స్థాయిలోనే కీడూ జరుగుతోంది. ఇప్పటి వరకూ పాశ్చాత్య దేశాలను మాత్రమే పట్టి పీడిస్తూ వచ్చిన అధిక బరువు, ఊబకాయం లాంటి సమస్య అభివృద్ధి చెందుతున్న భారత్‌కు సైతం తలనొప్పిగా మారింది. ప్రధానంగా.. చిన్నారులలో అధికబరువు, ఊబకాయం.. ఫ్యాటీ లివర్ వ్యాధికి దారితీయడం ఆందోళన కలిగిస్తోంది.

అటకెక్కిన ఆటలు.. 'బొద్దు' బారిన బాల్యం!

పాశ్చాత్యీకరణ, పట్టణీకరణతో జీవనశైలి, ఆహారపు అలవాట్లు అనూహ్యంగా మార్పులకు లోనుకావటం నేటితరం బాల్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. లేగదూడల్లా చెంగుచెంగున ఎగురుతూ, గెంతుతూ ఉండాల్సిన బాలలు తగిన శారీరక శ్రమ లేక నాలుగు గోడలకే పరిమితం కావాల్సి వస్తోంది.

పాఠశాల స్థాయి నుంచే ఆటలకు దూరమవుతున్న చిన్నారులు టీవీలకు, సెల్ ఫోన్లకు అతుక్కుపోతూ నాలుగుగోడల నడుమ బందీలుగా మారిపోతూ పలురకాల రుగ్మతల బారిన పడుతున్నారు. బాల్యంలో ఓ ప్రధాన భాగమైన సాంప్రదాయ (కోతికొమ్మచ్చి, తొక్కుడు బిళ్ల, కర్రాబిళ్ళా, బెచ్చాలు, గోళీ లాంటి)ఆటలకు నోచుకోలేకపోతున్నారు.

విద్యారంగంలో ప్రభుత్వ భాగస్వామ్యం తగ్గి ప్రైవేటు భాగస్వామ్యం రానురాను పెరిగిపోవడంతో ఆటలు అటకెక్కాయి. చదువే ప్రధాన వ్యాపకంగా మారిపోయింది. విద్య.. ప్రభుత్వ బాధ్యతగా ఉన్నంత కాలం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల స్థాయిలో క్రీడలకు తగిన సదుపాయాలు ఉండేవి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలకు సువిశాలమైన ఆటస్థలాలతో పాటు తగిన సంఖ్యలో వ్యాయామ ఉపాధ్యాయులు ఉండటం ఒకప్పుడు సాధారణ విషయమైతే ఇప్పుడు అసాధారణ విషయంగా మారిపోయింది.

ఉభయ తెలుగు రాష్ట్రాలలోని పలు నగరాలలో సింగిల్ బెడ్ రూమ్ పాఠశాలలు, డబుల్ బెడ్ రూమ్ కళాశాలలు మనకు ఇప్పుడు దర్శనమిస్తున్నాయి. ఈ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా సదుపాయాలు, మైదానాలు మచ్చుకైనా కనిపించవు. ఇలాంటి పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆటలంటే ఏమిటో తెలియకుండా అమూల్యమైన తమ బాల్యాన్ని, విద్యార్థి దశను ముగించడాన్ని మించిన విషాదం మరొకటి లేదు.

ఆటపాటలతో అపురూపంగా సాగాల్సిన బాల్యం.. పుస్తకాల మయంగా, సెల్‌ఫోన్ బానిసల విలయంగా, మానసిక రుగ్మతల నిలయంగా మారిపోతోంది. దీనికి ఆధునిక విద్యావిధానం, జీవన శైలితో పాటు.. తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి కూడా తోడవుతోంది. 'క్రీడలు కూటికా గుడ్డకా' అన్న భావన, ఆటలు చదువుకు ఆటంకం అన్న విపరీత ధోరణితో తమ పిల్లలకు అమూల్యమైన బాల్యాన్ని లేకుండా చేస్తున్నారు. పాఠశాల దశ నుంచే ఆటలకు, క్రీడా సంస్కృతికి దూరమైన చిన్నారులు ఆ తరువాతి కాలంలో శారీరకంగా, మానసికంగా పలు రకాల సమస్యలను ఎదుర్కొనాల్సి వస్తోంది.

దేశంలో ఈ మధ్యకాలంలో నిర్వహించిన పలు అధ్యయనాల ప్రకారం ఆటపాటలకు దూరమైన చిన్నారులు అధిక బరువుతో పాటు ఫ్యాటీ లివర్ (నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్) వ్యాధి బారిన పడుతున్నట్లు తేలింది. పిల్లలు ఆటలకు దూరం కావడం అంటే శారీరకంగా, మానసికంగా ఎదుగుదలకు దూరంకావటమేనని నిపుణులు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన తాజా అధ్యయనాల ప్రకారం దేశజనాభాలో 60 శాతం మంది అధిక బరువు సమస్యను ఎదుర్కొంటుంటే.. 30 శాతం మంది ఊబకాయం సమస్యతో నానాపాట్లు పడుతున్నారు. బాలల్లో 40 శాతంమంది ఫ్యాటీ లివర్ తో బాధపడుతున్నారని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి సైతం హెచ్చరిస్తున్నారు.

ఆధునిక జీవనశైలి, ఆటలకు ఏ మాత్రం ప్రాధాన్యంలేని విద్యావిధానం కారణంగా ఆరోగ్యవంతమైన భావిభారత పౌరులుగా తయారు కావాల్సిన వారు శారీరకంగా, మానసికంగా చెల్లిస్తున్న మూల్యం అంతా ఇంతా కాదని ఆరోగ్యరంగ నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాల కాలమైనా ఇప్పటికీ తెలుగు రాష్ట్రాలలోని 30 శాతం ప్రభుత్వ పాఠశాలలకే తగిన క్రీడామైదానాలు, సదుపాయాలు లేవని కేంద్రప్రభుత్వ గణంకాలే చెబుతుంటే ఇక ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఆటస్థలాలు, క్రీడాసదుపాయాలు ఉండాలని కోరుకోడం అత్యాశే అవుతుంది.

పిల్లలకు చదువు ఎంత ముఖ్యమో బాల్యంలో ఆటలూ అంతే ముఖ్యమని తల్లి దండ్రులు... ఆరోగ్యవంతమైన, ఆహ్లాదభరితమైన బాల్యాన్ని అందించాల్సిన బాధ్యత తమపైనే ఉందని పాలకులూ, పాఠశాలల యాజమాన్యాలు గ్రహించిన రోజే బాల్యం అమూల్యం.. అపురూపమవుతుంది.

కృష్ణారావు చాప్పిరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

ఆంధ్రప్రదేశ్‌లో హిందూ సమ్మేళనాలు (జనవరి, 2026)

తిరుపతి : బైరాగిపట్టెడ బస్తీ సమ్మేళనంలో శ్రీనివాసమంగాపురం స్వామి శ్రీశ్రీశ్రీ స్వస్వరూపానందగిరి ఆశీఃప్రసంగం చేశారు. ప్రాంత సద్భావన ప్రముఖ్ ఓలేటి సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. ఈ సమ్మేళనానికి 817 మంది హాజరయ్యారు.

అన్నమయ్య జిల్లా : ఓదివేడు ఉపమండల సమ్మేళనంలో అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి(తెలంగాణ) శ్రీశ్రీశ్రీ ఆదిత్యపరాశ్రీస్వామి ఆశీఃప్రసంగం చేశారు. ప్రాంత సహ సంపర్క ప్రముఖ్ ఆలూరు రాఘవేంద్ర ప్రసంగించారు. ఈ సమ్మేళనంలో 4478 మంది పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లా – రేవూరు గ్రామంలో జరిగిన సమ్మేళనంలో నిర్వహణ సమితి అధ్యక్షులు బోయళ్ల జనార్దనరెడ్డి, వైద్యుల మాలతి, విభాగ్ ప్రచారక్ రాళ్లబండి నవీన్ పాల్గొన్నారు. ఇందులో 912 మంది ఉపస్థితులైనారు.

నెల్లూరు జిల్లా:
బెడుసుపల్లి గ్రామంలో 2000 వేల మంది ఉపస్థితులైన సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా శ్రీశ్రీశ్రీ శ్రీనివాసనంద స్వామి, ప్రధాన వక్త నెల్లూరు జిల్లా సహ కార్యవాహ గడ్డం తిరుమల ప్రసంగించారు.

కాకినాడ నగరంలో తిలక్‌బస్తీ సమ్మేళనంలో కాకినాడ గీతాశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ దివ్యానంద భారతిస్వామి మార్గదర్శనం చేయగా, ముఖ్యఅతిథిగా కాకినాడ ఆర్‌డిఓ మల్లిబాబు, సేవికాసమితి విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ రేవతి పాల్గొన్నారు. ప్రాంత కార్యవాహ వేణుగోపాల్ నాయుడు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 1100 మంది పాల్గొన్నారు.

కాకినాడ నగరం దుమ్ములపేట బస్తీ సమ్మేళనంలో శ్రీ రవీంద్ర చైతన్య దాస్ ప్రభు మార్గదర్శనం చేశారు. సేవికాసమితి విభాగ్ కార్యవాహిక శ్రీమతి కమల గారు, విభాగ్ ప్రచారక్ సోము ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్ని ప్రలోభాలు పెట్టినా, లొంగకుండా, మతం మారకుండా ఉన్న పెద్దలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో 2500 మంది పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా బీరంగి కొత్తకోట సమ్మేళనంలో చిన్మయా మిషన్ పీలేరు, స్వామీజీ శ్రీశ్రీశ్రీ కృష్ణానంద సరస్వతి అనుగ్రహ భాషణం చేయగా జిల్లా సహ కార్యవాహ వేణుగోపాల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పురవీధులలో 650 మంది యువకులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సమ్మేళనానికి 1120 మంది హాజరైనారు.

భాగ్యనగర్ : రాష్ట్ర సేవికాసమితి, భాగ్యనగర్ విభాగ్ ఆధ్వర్యంలో జనవరి 11న షేక్‌పేటలోని సక్కుబాయి మెమోరియల్ స్కూల్‌లో జరిగిన సంక్రాంతి ఉత్సవంలో అధ్యక్షులుగా న్యూరాలజిస్ట్ (స్టార్ హాస్పిటల్) డాక్టర్ అనిత పాల్గొన్నారు. విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ నాగశ్రీ శారదాంబ ప్రసంగించారు. ప్రారంభంలో పురవీధులలో జరిగిన సేవికల పద సంచలన్ ప్రజలు పూలవర్షంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విభాగ్ కార్యవాహిక గోవర్ధనం ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

భక్తాగ్రేసరులు

అవ్వైయార్

తమిళనాడులో ఒక బ్రాహ్మణుడు, నిమ్న జాతి మహిళకు జన్మించిన అవ్వైయార్ సంగీత సాహిత్య నృత్యాల్లో నిపుణురాలు. ఆమెకు చిన్నతనంలోనే దైవకృప లభించడంతో లౌకిక సుఖాల పట్ల విముఖత కలిగింది. పెళ్లి తప్పించుకునేందుకు తనను వృద్ధురాలిగా మార్చాలని ఆరాధ్యదైవం గణపతిని ప్రార్థించి, తన కోరికను నెరవేర్చుకొంది. వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ, ఆధ్యాత్మిక, నీతి బోధ చేసింది. తగదూర్ (ధర్మపురి) రాజు నెడుమారన్ అంజి ఆస్థానంలో సుదీర్ఘ కాలం సేవలు అందించింది. 'వినాయకర్ అగవల్'లో విఘ్నేశ్వరుడి దివ్య స్వరూపాన్ని, కుండలినీ యోగాన్ని వివరించింది. ప్రకృతి శోభతో ఆనందాతిశయంలో మునిగితేలిన అవ్వైయార్ రాజప్రాసాదాల నుంచి పంట పొలాల్లో శ్రమజీవుల జీవితం దాకా ఎన్నో అంశాలపై నీతిగీతాలు పలికారు. ఎంతో సరళంగా రాసిన వాటిని తమిళనాడులో పిల్లలు నేటికీ చదువుతుంటారు. అవి యావత్ తమిళజాతికి మార్గదర్శకంగా ఆనందాన్ని పంచుతున్నాయి.

కథ

గుర్రం - గాడిద

ఒక వర్తకునికి ఒక గుర్రం, ఒక గాడిద ఉన్నాయి. ఆ వర్తకుడు ప్రతిరోజూ వాటిపై సరకు మూటలు వేసి మార్కెట్‌కు తోలుకుని పోతుండేవాడు. ఒక రోజున ఎక్కువ సరకులు లేనందున కొన్ని మూటల్ని గాడిదపైన మాత్రమే వేసి మార్కెట్‌కి తోలుకొని వెళ్తున్నాడు.

అలవాటు ప్రకారం గుర్రం కూడా వీరి పక్కనే నడుస్తోంది. ఆ రోజున ఎండ చాలా ఎక్కువగా ఉంది. సరకులు మోయలేక గాడిద ఆయాసపడి పోతోంది.

చివరకది మెల్లగా గుర్రం చెవిలో 'మిత్రమా! ఈ బరువును కొంచెంసేపు నీవు మోసుకొనివస్తే, ఆయాసం తీరిన తర్వాత మళ్లీ నేనే మోసుకొస్తాను. దయచేసి ఈ సహాయం చేయి!" అని అడిగింది.

దానికి గుర్రం కోపంగా "ఎవరి బరువును వాళ్లే మోయాలి. నేనెందుకు మోస్తానూ?" అంది.

ఆ మాటలతో గాడిదకు చాలా బాధ కలిగింది. కానీ అది గుర్రాన్ని ఏమీ

పద్యం

కులములోన నొకడు గుణవంతుడుండెనా
కులము వెలయు వాని గుణము చేత
వెలయు వనములోన మలయజంబున్నట్లు
విశ్వదాభిరామ వినురవేమ.

భావం : అడవిలో మంచి గంధపు చెట్టు ఉంటే, దాని సుగంధం ఆ అడవి అంతా వ్యాపిస్తుంది. అలాగే, ఒక వంశంలో గుణవంతుడు కలిగితే ఆతని వల్ల ఆ వంశానికి వెలుగు కలుగుతుంది.

శ్లోకం

యత్ర పర్యటతే దేశాన్
యస్తు సేవేత పండితాన్
తస్య విస్తారితా బుద్ధిః
తైల బిందు రివాంభసి!!

భావం : దేశాటన చేసే వారి, పండితులను సేవించే వారి బుద్ధి వికసిస్తుంది. అది నీటిలో నూనె బిందువులా సర్వత్రా విస్తరిస్తుంది. వారు అన్ని విషయాలను అర్థం చేసుకోగలుగుతారని భావం.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

తగ్గించు	పర
తన	చేదు
తడి	పెంచు
తీపి	పాగడ్త
విమర్శ	పాడి

క్లిష్ట-క్లిష్ట ; గ్ర-ర్గ ; ఇష్ట-ఇష్ట ; ర్ణ-ర్ణ ; ర్ణం-ర్ణం : జవాబులు

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

సీహెచ్. మోహనరావు



ప్రముఖ జీవ వైద్య పరిశోధకుడు. తెలంగాణలోని హుజూరాబాద్‌లో జనవరి 19, 1954న జన్మించిన ఆయన జీవ-వైద్యశాస్త్రానికి సంబంధించి ఎన్నో పరిశోధనలు చేశారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) డైరెక్టర్‌గా సేవలందించారు. శాస్త్ర సాంకేతిక రంగంలో అత్యున్నతమైన శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారంతో పాటు అనేక జాతీయ పురస్కారాలు అందుకున్నారు.



అనలేదు. కొంచెంసేపు నడిచి, వడదెబ్బకు తట్టుకోలేక గాడిద మూర్ఛబోయింది.

ఎట్లాగైనా తన సరుకును తొందరగా మార్కెట్ చేర్చాలి అనే తలంపుతో ఆ వర్తకుడు మూటలన్నిటినీ తీసి గుర్రం నడ్డిపైన వేసి బయలుదేరాడు. దీంతో కొంచెం దూరం మోయడానికి బదులు పూర్తి దూరం ఆ సరుకునంతటినీ మోయవల్సి వచ్చింది ఆ గుర్రానికి. అయ్యో..! గాడిద చెప్పినప్పుడే మోసి ఉంటే సగం దూరమే మోసేదాన్ని, ఇప్పుడేమో పూర్తి దూరం మోయాల్సి వస్తుంది అని బాధపడింది. ★

జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలో తొలి రైల్వే మార్గం ఏది?
2. ప్రపంచంలో అత్యంత పొడవైన నది ఏది?
3. భారతదేశంలో 'పింక్ సిటీ'గా ప్రసిద్ధి చెందిన నగరం ఏది?

జవాబులు : 1. థానే – ముంబై; 2. నైలు; 3. జైపూర్

మెదడుకు మేత

తోలు నలుపు,
తింటే పులుపు..
ఏమిటది?

జవాబు : ఉమ్మెత్త

మంచిమాట

అహంకారం సృష్టించే
చీకటిని ఛేదించడం
ఎవరికీ సాధ్యం కాదు

వారఫలాలు

26 జనవరి-01 ఫిబ్రవరి 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంటారు. ఆశించిన రాబడి దక్కి అవసరాలు తీరతాయి. కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. వ్యాపారస్తులకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. ఉద్యోగస్తులకు ప్రమోషన్లు. పారిశ్రామికవేత్తల కృషి ఫలిస్తుంది. క్రీడాకారులు, రచయితలకు ప్రత్యేక ఆహ్వానాలు. 31, ఫిబ్రవరి1 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ధననష్టం. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

కుటుంబానికి సంబంధించిన కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. విద్యార్థుల నైపుణ్యానికి తగిన గుర్తింపు లభిస్తుంది. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారులు మరింత ప్రగతి సాధిస్తారు. ఉద్యోగస్తులకు విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. పరిశోధకులు, కళాకారులకు ఊహించని అవకాశాలు. 26,27 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. బంధువిరోధాలు. గణేశాష్టకం పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

అనుకున్న ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. మనస్సులోని భావాలను కుటుంబసభ్యులతో పంచుకుంటారు. వ్యాపారులు మరింత లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగస్తులకు సమస్యలు తీరి ఊరట చెందుతారు. రాజకీయ వేత్తలకు అనుకోని పదవీయోగం. కళాకారులు, రచయితలకు అనుకోని ఆహ్వానాలు రావచ్చు. 28,29 తేదీలలో అనారోగ్యం. ఆకస్మిక ప్రయాణాలు. దేవాలయ దర్శనాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

నిరుద్యోగులకు ముఖ్య సమాచారం అందుతుంది. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. తండ్రి తరఫు వారితో వివాదాలు సర్దుబాటు కాగలవు. స్నేహితుల నుంచి ఆహ్వానాలు రాగలవు. సమాజంలో కీర్తి ప్రతిష్ఠలు మరింత పెరుగుతాయి. వ్యాపారులు మరింతగా లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగస్తులకు సమస్యలు తీరి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య సమస్యలు. బంధువులతో తగాదాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

బంధువులు అన్నింటా చేదోడుగా నిలుస్తారు. పలుకుబడి, హోదాలు కలిగిన వారితో పరిచయాలు. ఆస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. వ్యాపారులకు అనూహ్యమైన లాభాలు. ఉద్యోగస్తులకు కోరుకున్న మార్పులు తథ్యం. కళాకారులకు సన్మానాలు. రచయితలు, పరిశోధకులకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. 27,28 తేదీల్లో బంధువులతో విభేదాలు. శారీరక రుగ్మతలు. కనకధారాస్తోత్రాలు పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

వివాహ, ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. శత్రువులు కూడా స్నేహితులుగా మారవచ్చు. స్థిరాస్తి వివాదాలు కొలిక్కివస్తాయి. వ్యాపారస్తులు ఆశించిన లాభాలు పొందుతారు. ఉద్యోగస్తులకు ఉన్నతపోస్టులు. రాజకీయవేత్తలకు కొత్త పదవులురావచ్చు. రచయితలకు శుభవార్తలు. 28,29 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ముఖ్యమైన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తిచేస్తారు. అందరిలోనూ మీ సత్తా చాటుకుంటారు. వ్యాపారులకు నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగస్తులకు ఉన్నత పోస్టులు. రాజకీయవేత్తల కృషి ఫలిస్తుంది. రచయితలు, పరిశోధకులకు ఆహ్వానాలు. 30,31 తేదీల్లో ధననష్టం. శారీరక రుగ్మతలు. దూరప్రయాణాలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

భూ,గృహయోగాలు. అందర్నీ ఆశ్చర్యపరిచేలా కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. శుభకార్యాల రీత్యా ఖర్చులు అధికం. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగుల విధి నిర్వహణలో అనుకూల మార్పులు ఉంటాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు ఆహ్వానాలు అందుతాయి. 31, ఫిబ్రవరి1 తేదీలలో దూరప్రయాణాలు. వృథా ఖర్చులు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

అందరిలోనూ ప్రత్యేకతను నిలుపుకుంటారు. దేవాలయ దర్శనాలు. గృహ నిర్మాణ యత్నాలు కలసివస్తాయి. వ్యాపారాలు నూతన పెట్టుబడులతో సజావుగా సాగుతాయి. పారిశ్రామికవేత్తలకు అరుదైన అవకాశాలు. పరిశోధకులు, రచయితలకు మంచి గుర్తింపు లభిస్తుంది. 30, 31 తేదీల్లో దూర ప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. వృథా ఖర్చులు. ఆంజనేయ దండకం పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఇంటి నిర్మాణయత్నాలు ముమ్మరం చేస్తారు. సమాజసేవలో భాగస్వాములవుతారు. వ్యాపారులకు చిక్కులు తొలగుతాయి. నూతన భాగస్వాములు సైతం జతకడతారు. రాజకీయవర్గాలకు కొత్త పదవులు. రచయితలు, కళాకారులకు మరింత ఉత్సాహం. 26,27 తేదీల్లో ఆరోగ్య, కుటుంబ సమస్యలు. ఆకస్మిక ప్రయాణాలు. మానసిక అశాంతి. శ్రీరామరక్షా స్తోత్రాలు పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ప్రయాణాల్లో నూతన పరిచయాలు. ఇంటిలో శుభకార్యాలపై చర్చలు. పరిచయాలు మరింత విస్తరిస్తాయి. వ్యాపారులు అనుకున్న లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగస్తులకు నూతనోత్సాహం, కళాకారులకు పురస్కారాలు. క్రీడాకారులు, పరిశోధకులకు మంచి గుర్తింపు లభిస్తుంది. 29,30 తేదీల్లో అనుకోని ఖర్చులు. సోదరులతో వివాదాలు. ఆదిత్య హృదయం పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

నిరుద్యోగుల కృషి కొంతమేర ఫలిస్తుంది. సన్నిహితులతో అకస్మాత్తుగా వివాదాలు. ఆస్తుల విషయంలో కొద్దిపాటి చికాకులు తప్పవు. ఇంటి నిర్మాణయత్నాలు వాయిదా పడతాయి. వ్యాపారాలలో ఒడిదుడుకులు. ఉద్యోగస్తులకు మరిన్ని బాధ్యతలు. కళాకారులకు అవకాశాలు చేజారవచ్చు. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులకు ఒత్తిడులు, శ్రమ తప్పదు. 29,30 తేదీల్లో శుభవర్తమానాలు. ఆకస్మిక ధనలాభం. అంగారక స్తోత్రాలు పఠించండి.

పదరసం-548



ఆధారాలు

అడ్డం

1. పల్లకి లాంటిదే (2)
2. మావటి చేతిలోని ఆయుధం (3)
4. కోరిక, అభిలాష (3)
6. శబరిమలై వద్ద నది (2)
7. కుండలాంటిదే (3)
8. ఒక అప్సరస...అరటి (2)
10. కేశాల అల్లిక...అటునుంచి (2)
12. శబ్దం, ధ్వని (2)
15. జరిగిపోయిన కాలం (2)
16. వ్యాపారంలో మొదటి బేరం (2)
17. ఆడశిశువు (2)
18. బద్దెన శతకం (3)
20. ఆర్జన (4)
22. కీలెరిగి పెట్టాలట (2)
24. బురద (2)
26. కథలన్నీ అక్కడికే చేరతాయట (2)
28. రెండు భాషలు తెలిసినవాడు (3)
30. రథంలో ఆసీనుడు (2)
31. పాపం, అపరాధం (3)
33. సుందరమైన, భోజనంలో ద్రవపదార్థం (2)

నిలువు

1. సమ్మక్క సారమ్మల జాతర చోటు (3)
2. ఆకాశం (3)
3. శంకరసతి (3)
4. పెరుగు గారె (3)
5. సహనం, ఓర్పు (2)
9. రెండవ నక్షత్రం (3)
11. ప్రపంచం, జగమే (3)
13. కష్టాలు, అపాయాలు (4)
14. పూజ్యం...కింద నుంచి (2)
16. బుద్ధుడి జ్ఞానోదయకారక వృక్షం (2)
17. అడ్డం 17ను పిలవండి (2)
19. భూమి (2)
20. చేవ్రాలు (3)
21. అధ్యాయం, ఒడి (2)
23. ఒట్టే...తలకిందులుగా (2)
25. సేతువు (3)
27. లేలేత ఆకు (3)
28. ఇది దుఃఖానికి చేటట (3)
29. సైనికుడు (3)
32. రంధ్రం, చిల్లు (2)

పదరసం - 547 సమాధానాలు



శర్వా సంక్రాంతి హ్యాట్రిక్ 'నారీ నారీ నడుమ మురారి'

సినిమా రంగానికి సంబంధించి ఈ సంక్రాంతి సీజన్ గొప్ప ఆనందాన్ని పొందిన కథానాయకుడు శర్వానంద్! కొన్నేళ్లుగా తను మంచి విజయం కోసం తపిస్తున్నాడు. భిన్నమైన కథలను ఎంపిక చేసుకుని సినిమాలు చేస్తున్నా, నటుడిగా అతడిని ప్రేక్షకులు అభినందిస్తున్నారు తప్పితే, విజయాన్ని మాత్రం అందించడం లేదు.శర్వానంద్ తాజా చిత్రం 'నారీ నారీ నడుమ మురారి' ఆ లోటును తీర్చేసింది. సంక్రాంతికి విడుదలైన ఐదు సినిమాల్లో ఇది కూడా మంచి విజయాన్ని నమోదు చేసుకుంది.

ఈ సంక్రాంతికి ఆరేడు సినిమాలైనా వస్తాయని అంతా అనుకున్నారు. అయితే విజయ్ తమిళ అనువాద చిత్రం 'జన నాయగన్' విడుదల ఆగిపోగా, శివ కార్తికేయన్ 'పరాశక్తి' కేవలం తమిళంలోనే విడుద లైంది. 'ది రాజా సాబ్'తో మొదలైన సంక్రాంతి సందడి 'నారీనారీ నడుమ మురారి'తో పూర్తయ్యింది. ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కించిన 'ది రాజా సాబ్'కు ఫ్లాప్ టాక్ వచ్చినా మంచి ఆదరణే లభించింది. 'మన శంకర్ వరప్రసాద్' సంక్రాంతి విజేతగా నిలిచింది. రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' వినోదాత్మక చిత్రం, ఆయన గత చిత్రాలతో పోల్చితే బాగుంది. కానీ టాక్‌కు తగ్గ కలెక్షన్స్ లేవు. నవీన్ పోలిశెట్టి 'అనగనగా ఒక రాజు' కూడా ఎంటర్ టైన్‌మెంట్ సినిమాను, ఓ చిన్న పాయింట్‌ను తీసుకుని తెరకెక్కించడం టాక్‌తో నిమిత్తం లేకుండా మంచి విజయాన్ని అందుకొంది. 'నారీ నారీ నడుమ మురారి' అందరి అంచనాలను తల్లకిందులు చేసి, విజయాన్ని సాధించింది.

కథ విషయానికి వస్తే, యుక్తవయసులో తెలిసీ తెలియక ఓ యువకుడు చేసిన పొరపాటు అతని వైవాహిక జీవితానికి ఎలా ప్రతిబంధకంగా మారిందనే అంశంతో తెరకెక్కిన సినిమా. కాలేజీలో చదువుతున్న సమయంలో దియా (సంయుక్త)తో గౌతమ్ (శర్వానంద్) ప్రేమలో పడగా, ఆమె తండ్రి వారి పెళ్లికి అంగీకరించడు. దాంతో గౌతమ్ ఆవేశంగా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటాడు. కానీ సంసార జీవితాన్ని మొదలు పెట్టకముందే బ్రేకప్ అయిపోతారు. ఆ తర్వాత నిత్య (సాక్షి వైద్య)తో ప్రేమలో పడతాడు. తనకు దియాతో పెళ్లి అయ్యిందనే విషయం చెప్పడు. వారి పెళ్లికి నిత్య తండ్రి రామ లింగం (సంపత్ రాజ్) అంగీకరిస్తాడు. తీరా రిజిస్టర్ ఆఫీస్‌కు వెళ్లిన తర్వాత గౌతమ్ మొదటి పెళ్లి వ్యవహారం బయటపడుతుంది. అయినా నిత్యకు తెలియకుండా గౌతమ్ జాగ్రత్త పడతాడు. దియా నుంచి విడాకుల పత్రం తీసుకొస్తేనే ఈ పెళ్లి జరుగుతుందని రిజిస్ట్రార్ (సునీల్) చెబుతాడు. దియా నుండి గౌతమ్ విడాకుల పత్రం పొందాడా? అందు కోసం అతను ఏం చేయాల్సి వచ్చింది? అప్పట్లో గౌతమ్‌కు బ్రేకప్ చెప్పిన దియా ఇప్పుడు హఠాత్తుగా తిరిగి అతని జీవితంలోకి టీమ్ మేనేజర్ రూపంలో వస్తే ఏం జరిగిందనేదే కథ.

నిజానికి... ఈ కథలో ఎలాంటి లాజిక్కులూ లేవు. సరదాగా కొన్ని పాత్రలను సృష్టించి, వాటి స్వభావాలను నన్నివేశాలుగా మలిచి తీశారు. భార్య చనిపోయిన దాదాపు ఇరవై యేళ్ల తర్వాత హీరో తండ్రి మళ్లీ పెళ్లి చేసుకోవడం, ఆ పెళ్లి కోసం హీరో ఛేజ్ చేయడం, హీరో తన గతాన్ని హీరోయిన్ వద్ద దాచడం, తన కూతురు తాను గీసిన గీత దాటదని హీరోయిన్ తండ్రి భ్రమించడం, హీరో తన ప్రేమను కాపాడుకోవడానికి తండ్రి విడాకుల డ్రామా ఆడటం...వంటి సన్నివేశాల నేపథ్యంలో, ప్రేక్షకుడు ఈ లాజిక్కుల జోలికి పోకుండా దర్శకుడు రామ్ అబ్బరాజు బాగా మ్యానేజ్ చేశాడు. గతంలో జంధ్యాల దర్శకత్వంలో రూపు దిద్దుకున్న సినిమాల్లో ప్రతి క్యారెక్టర్‌కూ ఓ ప్రత్యేక గుర్తింపు ఉండేది. అది ఒకే ఒక్క సన్నివేశంలో కనిపించే పాత్ర అయినా సరే!

గౌతమ్ పాత్రలోనే కాదు దియా పాత్రలోనూ చాలా వేరియేషన్స్ ఉన్నాయి. వాటిని చాలా స్మూత్‌గా తెర మీద చూపించాడు. చివరి క్షణం వరకూ కథ ఎలాంటి మలుపు తిరుగుతుందా? అనే ఉత్సుకత ప్రేక్షకులలో కలిగించేలా చేశాడు దర్శకుడు. సినిమాలో పంచ్ డైలాగ్స్ చాలానే ఉన్నాయి. అలానే ప్రతి సన్నివేశం ఎంటర్ టైనింగ్‌గా ఉంది. 'సామజ వర గమన' మూవీతో దర్శకుడిగా మారిన రామ్ అబ్బరాజు, ఆ సినిమాలోనూ లాజిక్కుల జోలికి పోకుండా కేవలం వినోదానికే పెద్ద పీట వేశాడు.

శర్వానంద్ సునాయాసంగా గౌతమ్ పాత్రను పోషించాడు. 'ఏజెంట్' సినిమాతో తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టిన సాక్షి వైద్యకు ఆ తర్వాత వచ్చిన 'గాండీవధారి అర్జున' మూవీ కూడా విజయాన్ని అందించలేదు. ఈ సినిమాతో ఆమె విజయాన్ని అందుకుంది. ఇటీవల వచ్చిన 'అఖండ 2'లో నాయికగా నటించిన సంయుక్త ఇందులోనూ మంచి పాత్రనే చేసింది. హీరో తండ్రి పాత్రలో నరేశ్ నవ్వుల పువ్వులు పూయించాడు. అక్కడక్కడ కాస్తంత అతిగా అనిపించినా, నిజజీవితాన్ని తలపించే పాత్ర చేయడంతో ఆడియెన్స్ బాగా కనెక్ట్ అయ్యారు. అతని భార్యగా సిరి హన్మంతు నటించడం గొప్ప విషయం. సంపత్ రాజ్, సునీల్, సత్య, సుదర్శన్, వెన్నెల కిశోర్, మధుమణి, గెటప్ శ్రీను, శ్రీకాంత్ అయ్యంగార్, రఘుబాబు తదితరులు ఇతర పాత్రలు పోషించి మెప్పించారు. శ్రీవిష్ణు ఇందులో అతిథి పాత్రలో మెరిశాడు.

విశాల్ చంద్రశేఖర్ అందించిన బాణీలు సో... సో... గా ఉన్నాయి. పాటలు బాగుండి ఉంటే సినిమా మరో స్థాయికి చేరుకునేది. కేరళ, హైదరాబాద్ అందాలను జ్ఞానశేఖర్, యువరాజ్ బాగా కాప్చర్ చేశారు. రచయితలు భాను భోగవరపు, నందు సవిరిగన పాత్ర కీలకమైంది. దర్శకుడు నటీనటుల నుండి తనకు కావలసినది చక్కగా రాబట్టుకుని విజయపథంలోకి వెళ్లిపోయాడు. గత కొంతకాలంగా సరైన విజయాలను లేకపోయినా నిర్మాత అనిల్ సుంకర రాజీ పడకుండా నిర్మించి, తగిన విజయాన్ని అందుకుంటున్నారు. గతంలో శర్వానంద్ చేసిన 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'శతమానం భవతి' చిత్రాలు సంక్రాంతి రోజుల్లో విజయాన్ని అందుకున్నాయి. ఆ రకంగా ఆయన ఈ సినిమాతో సంక్రాంతి సీజన్‌లో హ్యాట్రిక్ సాధించినట్టు అయ్యింది..

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.250/-



వెల : ₹.100/-



వెల : ₹.400/-

వెల : ₹.300/-



వెల : ₹.151/-

వెల : ₹.800/900 : 999/1200

వెల : ₹.100/-

వెల : ₹.150/-

వెల : ₹.99/-



వెల:₹.1598/- సెట్



వెల:₹.449/-



వెల :₹.450/-



వెల : ₹.400/-



వెల : ₹.145/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 15



Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01